

# ప్రేమలేని చోటు

- వి.యస్.యస్.హేమ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 1



## ప్రేమలేని చోట మనసున్న మనిషికి ఎదురయ్యే అనుభవాలు

### మొదటిభాగం

దేవుడు –

ఆకాశానికి సూర్యుణ్ణీ, చంద్రుడినీ, నక్షత్రాలను బహుమతిగా ఇచ్చి– మరీ అంతా బావుంటే తనని నిర్లక్ష్యించ వచ్చని భావించి అనుకుంటా – భయంకరమైన ఉరుములనూ, పిడుగులనూ సృష్టించాడు.

అదే దేవుడు –

భూమికి పర్వతాలనూ, పచ్చని ప్రకృతినీ, మైదానాలనూ, సముద్రాలనూ ఇచ్చి – తన ఉనికిని పదిల పరచుకోవటానికై –భూకంపాలనూ, తుఫానులనూ, వరదలనూ సృష్టించాడు. ఆ దేవుడే మనిషిని సృష్టించి, ఈ మనిషి ముందు తనని తాను ఎలా నిలుపుకోవాలా అని ఆలోచించి.. ఆలోచించి, చివరకు ఒక విచిత్రమైన ఆటను సృష్టించాడు.

స్త్రీ.. పురుషులిద్దరూ ఆడే ఈ ఆటలో పురుషుణ్ణి అధికుణ్ణి చేసి – స్త్రీని బానిసను అనగా ఆ పురుషుని ఆజ్ఞను గౌరవించి, పాటించే పాత్రగా మలిచాడు.

అయితే ఈ విచిత్రమైన ఆటలో పూర్తి గెలుపు పురుషునిదీ కాదు. ఆ ఆటలో స్త్రీ పురుషులిద్దరూ అసంతృప్తులుగా మిగిలిపోవటమే ఆ ఆట ప్రత్యేకత. ఆ విచిత్రమైన ఆట పేరే పెళ్ళి.

చక్రవర్తి నా భర్త. కానీ భర్తలా ఉండటం లేదు. అతనికి నేనంటే పరమ అసహ్యం. నేను బావుండనట. నన్ను పెళ్ళిచేసుకోవటం అతనికి అస్సలు ఇష్టంలేదట!

అతని దృష్టిలో నేను అతని జీవితాన్ని నాశనం చేసిన రాక్షసిని. దయ్యాన్ని. ఆడదాన్ని. కానీ నిజం అదికాదు.

న్యాయంగా.. ధర్మంగా చెప్పాలంటే చక్రవర్తి నా మెడలో మూడు ముళ్ళు వేసి – నన్ను నేను పోగొట్టుకునేలా చేసాడు. అతను నన్ను స్పర్శించకుండా నా కోరికలకు గడవేసాడు. తన మౌనంతో నాహృదయాన్ని సమాధి చేసాడు.నన్నీ ఇంటిలో ఓ కదిలే యంత్రంలా మార్చి వేసాడు. ప్రస్తుతం నేను ఈ ఇంటి వంటగదిని. చీపురును. గ్రైండరును. రగిలే పొయ్యని. అంతే. అంతకు మించి మరేమీ నేను కాకూడదు. కానట్లుగా మార్చి వేసాడు.

ఎన్ని కలలు కన్నాను పెళ్ళిపట్ల!

ఎన్ని ఆశలు పెంచుకున్నాను నాతో కలసి జీవించబోయే సహచరుని పట్ల.

ఎందుకు ఏదీ రాలేదు నాకు?

ఏమిటి నా తప్పు? ఏమిటి నేను చేసిన నేరం?

నేను అందంగా లేక పోవటమేనా?

నేనేం అనాకారిని కానే. వచ్చిన బాధేంటంటే నా భర్త చక్రవర్తి మరీ అందగాడు. చాలా చాలా బావుంటాడు. అందానికి నిర్వచనంలా ఉంటాడు. ఏ అమ్మాయి అతన్ని చూసినా గబాల్న గుండె పారేసుకుంటుంది.

చక్రవర్తికి ఒక అక్క వున్నారు. ఆమె పేరు మాలతి పెళ్ళైంది. ఆమె భర్త పేరు సుధాకర్. ఆ దంపతులిద్దరు చాలా సాధారణంగా ఉంటారు. చక్రవర్తి అక్క అయితే మరీ మామూలుగా ఉంటుంది. కనీసం నాకు కళ్ళూ, ముక్కూ, జుట్టు అయినా బావుంటాయి. ఆమెకు అలా కాదు. ఆమె తండ్రి పోలిక అట. అయితే ఏం? తన భర్తతో ఎంత ఆనందంగా ఉంటుంది!

అందానికీ.. ఆనందానికీ ఎటువంటి సంబంధమూ లేదు. అందానికి కేవలం ఆకర్షించటం మాత్రమే తెలుసు. ఆనందం అటువంటిది కాదు. అది సంస్కారానికి సంబంధించిన విషయం. అయితే మాలతికీ.. నాకూ మధ్య ఓ గొప్ప తేడా ఉంది. మాలతి భర్త సుధాకర్‌కి తల్లి తండ్రులు చిన్నతనంలో పోయారు. అతన్ని వాళ్ళమ్మమ్మ పెంచారు. ఆమె నిజమైన సంఘసేవకురాలు. సుధాకర్ తల్లిదండ్రులనుండీ లభించవలసిన ప్రేమను మాలతి నుండీ.. మాలతిని ప్రేమిస్తూ, బాల్యంలో పోగొట్టుకున్న ప్రేమ తాలూకూ లోటును తీర్చుకుంటున్నాడు.

కానీ నాకు?

భర్త అనే మగవాడి వెనక అతని తల్లి ఉండి ముఖ్యంగా ఆమె భర్తృహీన అయితే ఆ స్త్రీ తన మనుగడ కోసం, తన సెక్యూరిటీ కోసం, కొడుకుని `తల్లి చాటు బిడ్డగా` మార్చుకుంటుంది. అందుకై ఆమె ఉపయోగించే ఆయుధం కన్నీళ్ళు. అటువంటి తల్లి చాటు బిడ్డకు భార్యనవటం నిజంగా నా దురదృష్టం.

'సంసారమన్నది సన్యాసుల ఆశ్రమం కాదు` - అంటాడు తావో.

కానీ నా గృహజీవితంలో నేను సన్యాసినే. మరి చక్రవర్తి? అతను సన్యాసి మాత్రం కాడు. సంసారీ కాదు. మరి? ఎక్కడో మరో చోట నాకు తెలియని చోట తన ఆనందాన్ని సృష్టించుకున్నాడని నా అనుమానం.

ప్రస్తుతం చక్రవర్తి ఊర్లోలేడు. కేంప్‌కి వెళుతున్నట్లూ, వారంరోజులు రావటానికి పడుతుందని, గోడకు చెప్పినట్లు చెప్పి వెళ్ళాడు. అతను ఆమాత్రంగా కూడా చెప్పాలని నేను ఆశించటంలేదు. అతను నిజంగా వెళ్ళింది కేంప్‌కేనా? మరోచోటకా? ఏమో భగవంతునికే తెలియాలి. ఫస్ట్‌నైట్ అతని మాటలూ, ప్రవర్తనతో నా మనసు విరిగిపోయింది. వీలయినంత తొందరలో చక్రవర్తి నుండీ విడాకులు తీసుకోవాలని నా ఆలోచన. కానీ నా తల్లితండ్రులు నన్ను సమర్ధించటం లేదు. "ఆడపిల్లకు పెళ్ళిచేసి, అత్తవారింటికి పంపేసిన తర్వాత వాళ్ళపిల్ల అయిపోతుంది ఇంటిపేరు మారినట్లే. అదీకాకుండా పెళ్ళయిన ఒక సంవత్సరానికే, ఆడపిల్ల మొగుణ్ణి వదిలేసి, పుట్టింటికి చేరితే, రెండో పిల్లకు సంబంధాలు ఎలా వస్తాయి? దాన్నెవరు చేసుకుంటారు? పలానా రాఘవరావు ఇంజినీరుగారి పిల్లలు కాపురాలు చేసేరకంకాదు. మొగుళ్ళను వదిలేసి పుట్టింటికొచ్చే రకాలని నలుగురూ మమ్మల్ని అనుకోరా? అసలే మీ నాన్నగారికి

ప్రాణం కంటే పరువు ముఖ్యమని నీకు తెలియదా? ఒకసారి పెళ్ళి చేసి పంపేసిన తరువాత ఆడపిల్లకు మంచి అయినా చెడు అయినా అత్తింట్లోనే. అదే మన సంప్రదాయం.'' - ఇది నా తల్లి నాకు చెప్పిన నీతి. అంటే ఇన్‌డైరక్ట్‌గా అమ్మ చెప్పినదానికి అర్థం.. నేను విడాకులు తీసుకోకూడదు. రెండు నేను మొండిగా విడాకులు తీసుకోవాలని నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకుంటే - మా నాన్నగారికి ప్రాణం కంటే పరువు ముఖ్యం కనుక, ఆయనకేమయినా కావచ్చు.

ఒక్క నేను నష్టపోతే ఒక కుటుంబం హాయిగా ఉంటుంది. ఒక్క నేను నా సుఖానికి ప్రాధాన్యత ఇస్తే ఒక కుటుంబం నష్టపోతుంది. ఆ కుటుంబం నా కుటుంబమే అయినప్పుడు, నేనే నష్టపోయి, నన్ను నేను త్యాగం చేసుకుని, నాకు జన్మనిచ్చిన తల్లి తండ్రుల రుణం తీర్చుకోవాలి ఇవీ నాముందు వున్న విషయాలు. సాంప్రదాయ కుటుంబం కదా మరి. అందుకని మనకు జన్మ ఇచ్చిన తల్లితండ్రుల రుణం తీర్చుకోవటం న్యాయమే. ధర్మం కూడానూ.

అయితే తల్లితండ్రులు మనకి ఎట్లాంటి జీవితం ఇచ్చారు? ఎలా పెంచారు? మరెలా పెళ్ళి చేసారు? వాళ్ళు మనపట్ల చూపిన బాధ్యతలో ఆడపిల్ల జీవితాన్ని పొందుతోందా? పోగొట్టుకుంటోందా? ఏం ఆ అమ్మాయికి మాత్రం జీవితం ముఖ్యంకాదా? భగవంతుడు మనకి ఒకే ఒక జీవితాన్ని ఇస్తాడు. మరి తల్లితండ్రులు? వాళ్ళ సుఖాలకి మనం ప్రతీకలం. అంటే మన పుట్టుకల కోసం వాళ్ళు మరీ అంతగా త్యాగాలేమీ చెయ్యలేదనేగా అర్థం.

'ఒకసారి పెళ్ళై అత్తింటికి వెళ్ళిన తరువాత, నీ సుఖం, దుఃఖం అక్కడే మాకు సంబంధంలేదు' - అనటం ఏం న్యాయం? తల్లితండ్రులు బాధ్యత నిజంగా తీరిపోయినట్లేనా అక్కడితో. కాదు. కాదు గాక కాదు.

వాళ్ళు సమాజానికి భయపడుతున్నారు. బంధువుల సూటిపోటీ మాటలకు భయపడుతున్నారు.

ఆ భయం ముందు వాళ్ళ మనసులోని ప్రేమను పైకి రానీయటం లేదు. ఇది అన్యాయం. ఈ అన్యాయాన్ని ఖండించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఎవరు ముందుకు వస్తారు?

మరో గాంధీ. మరో కందుకూరి మళ్ళీ పుట్టాలి అంటూ ఎదురు చూస్తూ.. చూస్తూ నిరాశలో నిండు జీవితాల్ని ఎడారి ప్రాయం చేసుకోవాలా? లేదు మొన్న పుట్టి మనకి మంచి మార్గాన్ని తెలిపిన వారి స్ఫూర్తి చాలదా? ధైర్యవంతులకూ... వివేకవంతులకూ చాలు. ఎటొచ్చీ బంధాలతోనే బాధ అంతానూ. ఏం చెయ్యాలి నేను?

ఒక మూగదెయ్యంలా ఈ ఇంటిని అంటిపెట్టుకుని, ఏ కోరికా, ఏ పండగా, ఏ ఆనందం అసలు ఏమీ లేకుండా ఎంతకాలం మోడులా బ్రతకాలి? పుట్టింటి వాళ్ళు రావద్దంటున్నారు.

అత్తింటిలో ఒంటరి ఖైదీలా ఉండలేక పోతున్నాను.

పోనీ బయటకు వెళ్ళి ఏ హాస్టల్లోనైనా ఉండి, ఉద్యోగం చేసుకుంటూ నేను బ్రతికితే?

అప్పుడు మాత్రం అమ్మా - నాన్నా ఊరుకుంటారా? అయినా ఇప్పటికిప్పుడు బయటికి వెళితే ఉద్యోగం దొరుకుతుందా? ఇదేం సినిమానా? జీవితం.

కుటుంబంలో కలహాలు కలతలూ వచ్చాయని, అందరూ బయటకు వచ్చేసి విడివిడిగా ఉండటం మొదలుపెడితే - ఈ ఆలోచన బావుండలేదు. అప్పుడు కుటుంబం అనే మాట చరిత్రనుండీ తుడిచిపెట్టుకు పోదా? అందుకే ఎక్కడ జీవితం గాడి తప్పిందో అక్కడనుండే పోరాటం ప్రారంభించి విజయం సాధించాలి. ఎస్. ఇది నిజం. అలానేచేయాలి. అంతేగానీ పారిపోవటం.. చావు అనేవి వేటికీ నిజమైన పరిష్కారాలు కావు. జీవితం ఒక సవాల్.

పోరాడాలి... గెలవాలి.. అందుకే -

నేనిప్పుడు చక్రవర్తిని గెలవాలి. గెలవాలి అంటే యుద్ధం ప్రారంభించాలి. కానీ చక్రవర్తి మౌనమూర్తి. నాతో మాట్లాడడు. నేనంటే అసహ్యం. అయినా నన్ను పెళ్ళి చేసుకున్నాడు. నాకు ఆనాటి నా పెళ్ళి.. పెళ్ళి చూపుల తంతు గుర్తొస్తోంది.

జాహ్నవీ, నువ్వు ఈ రోజు కాలేజీకి వెళ్ళవద్దు.

ఉదయమే అమ్మ చెప్పింది.

నాకు ఆశ్చర్యం వేసింది.

"అదేంటమ్మా – ఈరోజు పరీక్ష ఉంది"

"ఇది కూడా పరీక్షే. కాలేజీకి వెళ్ళొద్దన్నాను.. మానేయ్".– అది అమ్మ కఠినంగా.

అసలే అమ్మకి నేనంటే ప్రేమ తక్కువ. తనని 'అమ్మా' అని పిలవటం ఇష్టముండదు.

చక్కగా నా చెల్లెలు మీరాలా మమ్మీ అని పిలవమంటుంది. నాకు అమ్మా అని పిలిస్తేనే బావుంటుంది.

'మమ్మీ' – అంటే నాకు పిరమిడ్లనీ, చనిపోయి మందుపూతల మూలంగా చెడిపోకుండా ఉండే శవాలు గుర్తుకు వస్తాయి. అందుకే నేను అమ్మని 'మమ్మీ' అని పిలవలేను. అమ్మ అర్థం చేసుకోదు. అదీకాకుండా మరో ముఖ్యవిషయం, నా చెల్లెలు మీర, మా అమ్మలా చాలా బావుంటుంది. అమ్మ పేరు మధుర. నాన్నగారు అమ్మని 'మధూ' – అని పిలుస్తారు.

నాన్నగారి పేరు రాఘవరావు. అమ్మ అప్పుడప్పుడూ నాన్నగారిని 'రఘూ' అని పిలుస్తుంది. (మరీ ప్రేమ ఎక్కువైనప్పుడు) పిల్లలం మేము అలా అనకూడదు కదూ? నాన్నగారు కూడా బావుంటారు. వాళ్ళిద్దరినీ ప్రక్కప్రక్కన చూస్తే, ముచ్చటైన జంట అనిపిస్తారు. లలితంగా, సుకుమారంగా కనిపిస్తారు. వజ్రాలులాగ అన్నమాట. అమ్మా – నాన్నగారు, మీర ముగ్గురూ చాలా బావుంటారు. పెద్ద కూతురి నైన నాకు వారి అందమూ రాలేదు. గుణాలూ రాలేదు. అందుకే వాళ్ళ ముగ్గురూ ఒక జట్టులా ఉంటారు. అప్పుడప్పుడూ నాకనిపిస్తూ ఉంటుంది. నేను వీళ్ళ అమ్మాయిని కాదేమో! వీళ్ళకి పుట్టలేదేమో? లేదూ అనాధనేమో. ఇంకా కాదంటే అమ్మ స్నేహితులో, బంధువుల తాలూకూ పిల్లనేమో. నేను పుట్టంగానే నా అమ్మా – నాన్నా చనిపోతే, పాపం అని జాలిపడి, వీళ్ళు పెంచుతున్నారా? కాదు. కాదని బాగా తెలుసు. ఎందుకంటే నేను మా అమ్మమ్మలా ఉంటాను. అమ్మకి తన అమ్మా నాన్న ఇద్దరి పోలికలు కలగలసి వచ్చాయి. నాకు పూర్తిగా అమ్మ పోలికలు వచ్చాయి. అందుకే అమ్మమ్మకి నేనంటే చాలా ఇష్టం. ఈ కారణం మూలంగానే నాకు నా పుట్టిల్లు మరీ పరాయిగా అనిపించదు. అప్పుడప్పుడు మాత్రమే నెగిటివ్ ఆలోచనలు వస్తాయి. పాపం అమ్మమ్మకి ఇద్దరు కొడుకులు వున్నారు. అయితే వాళ్ళిద్దరూ భార్యల చాటు భర్తలు. వాళ్ళకి అమ్మ తమ ఇంట ఉండటం ఇష్టంలేదు. అలాఅని పూర్తిగా అయిష్టమూ చూపించరు. వాళ్ళకి రోగాలొచ్చినా, పిల్లలను చూడవలసివచ్చినప్పుడూ అమ్మమ్మని బాగా వాడుకున్నారు. ఇప్పుడు పిల్లలు పెద్ద వారయ్యారు. అమ్మ అవసరం తీరిపోయింది. పిల్లిమీదా.. కుక్కమీదా... పనివాళ్ళ మీద తిడుతున్నట్లు తిట్టడం, విసుక్కోవటం. ఒకసారి మామయ్యల

దగ్గిరకు వెళ్ళిన అమ్మ - అమ్మమ్మ పరిస్థితి గమనించి చాలా కోప్పడి అమ్మమ్మను తనతో తెచ్చేసుకుంది. నాన్నగారు కూడా అమ్మ మంచిపని చేసిందని మెచ్చుకున్నారు. ఆతర్వాత ఎప్పుడూ అమ్మమ్మని కొడుకుల దగ్గరకు పంపలేదు.

అమ్మకి కొడుకుల్ని చూడాలనుకున్నప్పుడంతా, వాళ్ళనే పిలుస్తూ ఉంటుంది, పండగలనీ, పేరంటాలని వంక పెట్టి. మామయ్యలకీ తెలుసు ఆరహస్యం. అసలు మా నాన్నగారు అంటూ ఉంటారు.

"పెద్దవాళ్ళయిన తల్లితండ్రులు ఆడపిల్లల దగ్గర ఉండాలి. తల్లికి ఏబాధ వచ్చినా కూతురితో చెప్పుకున్నంత స్వేచ్ఛగా కోడళ్ళతో చెప్పుకోకపోవచ్చు" అంటారు. అందుకే అమ్మా-నాన్నలంటే నాకు చాలా ప్రేమా, గౌరవం. కానీ తన తల్లి పట్ల సౌమ్యంగా ఉన్న నా కన్నతల్లి నాదగ్గరకు వచ్చేసరికి ఎందుకంత కఠినంగా ఉంటుంది?

మార్క్స్ చెప్పినట్లు

మానవ సంబంధాలన్నీ ఆర్థిక అవసరాలకు ముడిపడి వుంటాయా? నేను నెమ్మదిగా నాన్నగారి దగ్గరకు వెళ్ళి -

"అమ్మ ఇవ్వాళ కాలేజీకి వెళ్ళొద్దంటోంది" - అన్నాను.

"అవును ఈ రోజు కాలేజీకి సెలవుపెట్టు జాహ్నవీ." - అన్నారు

"ఎందుకు నాన్నగారూ?"

"నిన్ను చూసుకోవడానికి పెళ్ళివాళ్ళు వస్తున్నారు."

"పెళ్ళా?"

"అవును. అమ్మ నీ పెళ్ళి గురించి బెంగ పెట్టుకుంది."

"బెంగెందుకు?" - నేను ఆశ్చర్యంగా అడిగాను.

"నీకు తెలుసు." - ఆయన ముభావంగా అన్నారు.

నాకు తెలియటంలేదు.

"మీరాకు మంచి మేచ్ వచ్చింది. అతను ఐ.ఏ.ఎస్ ఆఫీసరు."

నేను షాకయ్యాను. నాకీ విషయం తెలియదు. ఎవరూ చెప్పలేదు. అసలు పెళ్ళి చూపులు ఎప్పుడు జరిగాయి? ఏమైనా ఇది సంతోషించే విషయమే కదా! అదీ కాకుండా మాఅమ్మ ఎప్పుడూ అంటూవుంటుంది. మా మీరా అందానికి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వరుళ్ళు, 'నేను చేసుకుంటానంటే, నేను చేసుకుంటానని క్యూలో నిలబడతారు' - అనేది. నిజమేనా?

"మీరాకు పెళ్ళిచూపులు జరిగాయాండీ? ఎప్పుడు?" - ఆశ్చర్యంగా అడిగాను.

"లేదు మొన్న బంధువుల పెళ్ళికెళ్ళాము కదా. అక్కడ ఆ అబ్బాయి మీరాని చూసాడు. ఇష్టపడ్డాడంట."

అవును కదా! అమ్మానాన్నలకు పెళ్ళిళ్ళకూ ఫంక్షన్లకూ మీరాని తీసుకువెళ్ళటం చాలా ఇష్టం.

అక్కడంతా మీరా అందాన్ని చూసి మెచ్చుకుంటూ ఉంటే, ఆనందంగా పొంగిపోతూ ఉంటారు.

తల్లితండ్రులకు అటువంటి కోరికలు ఉండటం సహజమే. కానీ - ఒక ముఖంలో ఒక కన్ని అందంగానూ, మరొక కన్ను మెల్లగాను ఉందనుకోండి ఆమనిషి అందమైన కన్నుని అట్టే పెట్టుకుని, మెల్లకన్నుని తీయించేసుకోరు కదా!

అయినా నేను మెల్లకన్నంత అనాకారినీ కానే. మీరా మరీమరీ అందంగా ఉండటం వలన - నేను చాలా సాధారణంగా కనిపిస్తున్నానంటుంది మా అమ్మమ్మ.

అయినా మీరాకు మేచ్ వస్తే దానికి పెళ్ళి చేసెయ్యొచ్చుగా. దాని పెళ్ళి కోసం నా చదువు ఆపటం ఎందుకు? పెద్దదాన్ననా? అయితే ఏం? నిజం చెప్పాలంటే మీరాకు చదువు మీద శ్రద్ధలేదు. దానికెంత సేపూ తన అందాన్ని మెరుగులు పెట్టుకోవటం ఇంకా అందంగా ఉండటం కోసం సమాచారాన్ని సేకరించటంలో సమయాన్ని వృధా చేస్తుంది. చదువులో మీరా మొద్దు. మీరా లాగా నాకెటువంటి తాపత్రయాలు లేవు. నేను ఏం చేసుకున్నా ఈ ఆకారం మారదు. అయితే బాగా చదువుతానని, తెలివైన అమ్మాయిననే పేరుంది. అందుకే -

"నా చదువింకా పూర్తికాలేదు నాన్నగారూ?" అన్నాను.

"పెళ్ళయ్యాక, వాళ్ళు ఒప్పుకుంటే, చదువుకుందువుగాని,"

"వాళ్ళు వప్పుకోకపోతే?"

"జాహ్నవీ.." - కాస్త గట్టిగానే ఉంది నాన్నగారి గొంతు.

"సారీ నాన్నగారూ, నేను మీరా అంత అందంగా లేను. కనీసం చదువైనా ఉంటే నా జీవితాన్ని నేను రచించుకోవచ్చు. అయినా అందమూ లేక ఇంకా డిగ్రీ చేతికి రాని నన్నెవరు చేసుకుంటారు?"

"చేసుకుంటారని తెలిసింది కనుకనే, ఈరోజు ఈ పెళ్ళిచూపులు ఏర్పాటి చేసాము."

"ముందుగా ఒక్కమాట నాకు చెప్పి ఉండొచ్చుగా"

"చెపితే ఒప్పుకునేదానివా? చెప్పినప్పటినుండీ నీ ఆర్గ్యుమెంట్స్, విన్నపాలూ వింటూ, నిన్ను కన్విన్స్ చేసేటంత ఓపిక నాకు లేదు."

'కాదు. ఒక ఐ.ఏ.ఎస్ ఆఫీసరు అల్లుడిగా వస్తున్నాడనే ఆనందంలో, నేను చేదులా అనిపిస్తున్నాను. తొందరగా ఈ చేదును ప్రక్కకు తీసేసి, ఆ అమృతానందాన్ని అనుభవించాలి. చుట్టాలూ, స్నేహితుల మధ్య ఎంత గర్వంగా ఉంటుందనీ! ఇంతకూ నన్ను చూసుకోవటానికి వచ్చే వాళ్ళు ఎవరో? ఏ స్థాయి వాళ్ళో? ఏం చేస్తూవుంటాడో. అసలు మనిషి ఎలా ఉంటాడో. ఒక్కటి మాత్రం నిజం నాకంటే తక్కువ ఆకర్షణలో, సాధారణంగా ఉండే ఉంటాడు.

"పోనీ, అతనేం జాబ్ చేస్తున్నాడు?"

"సి.ఏ చేసాడు. సొంతంగా ఆఫీసు పెట్టుకున్నాడు. పిల్లాడు చాలా బావుంటాడు. తండ్రిలేడు. తల్లి.. అక్క ఉన్నారు. ఆ అమ్మాయికి పెళ్ళైపోయింది."

"చాలా బావున్న అతను నన్నెందుకు చేసుకుంటాడు డేడీ?"

"అబ్బబ్బ.. ఇన్ని ప్రశ్నలేమిటి? పెద్దవాళ్ళు మీ మంచి కొరకేగా నిర్ణయాలు తీసుకునేది. మరేం ప్రశ్నించకుండా, చెప్పినట్లు చెయ్యి. వెళ్ళు."

ఎవరు వీళ్ళు? నిజంగా నా వాళ్ళేనా?

"ప్రపంచం స్వార్ధపరుల చేత తయారు చేయబడింది.

బుద్ధిమంతులు దాంట్లో నివసించక తప్పదు."

# రెండవ భాగం

**పోస్ట్!**

డిస్టర్బ్ అయ్యాను. ఆలోచనలకు స్వస్తి చెప్పి, మెయిన్ డోర్ దగ్గరకు వెళ్ళి చూస్తే –

పోస్ట్‌మేన్ కిటికీ నుండీ లోపలకు ఉత్తరాన్ని పడేసాడు.

నేను ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని, ఎడ్రస్ చూసాను.

చక్రవర్తికి వాళ్ళమ్మ రాసిన ఉత్తరం.

ఏమి రాసి ఉంటారు?

చించి చదవాలని ఉంది. బావుండదు. కానీ .. చాలా గాఢంగా అనిపిస్తోంది. చక్రవర్తికి తన అమ్మ వాక్కు వేదవాక్కు. ఆమె తప్పక నా గురించి ఏదో రాసే ఉంటుంది.

వదిలించుకోమని రాయవచ్చు. చంపేయ్ గప్..చిప్‌గా అని కూడా రాసి ఉండవచ్చు. లేదూ తిండి తిననివ్వకుండా ʻఆకలి బాధతో ఏడ్చేలా చెయ్ʼ – అని రాయవచ్చు.

ఆమెకు నా వ్యక్తిత్వం… ఆత్మాభిమానం, – పొగరూ, అహంకారంలా కనిపిస్తున్నాయి నేను దీనాతి దీనంగా చక్రవర్తి కాళ్ళ మీద పడి, ʻనన్నేలుకో దొరా. నేను నీ దాసినిʼ – అంటూ రోదించనని కసి. చస్తే చెయ్యను ఆ పని.

ఒక మూర్ఖుడు, ఒక స్వార్ధపరుడు నన్నేలుకోవాలా? వద్దుగాక వద్దు.

నేను వాళ్ళ గురించి ఆలోచిస్తూ.. పరధ్యానంగా ఆ ఉత్తరం నా వేళ్ళతో నలిపినట్లున్నాను. ఠక్కున తెరచుకుంది. గాబరాగా ఉత్తరాన్ని ʻఇదేంటి తెరుచుకుందిʼ అంటూ చూసాను. మనసులో కోరిక ఉత్తరం గ్రహించేసినట్లుగా ఇలా తెరుచుకుందేవిటీ? గమనించి చూస్తే అర్ధమయ్యింది. గమ్ సరిగ్గా అంటలేదు. బహుశా నాలుక తడితో అంటించినట్లున్నారు.

పరాయివాళ్ళ ఉత్తరాలు చదవటం తప్పే అని తెలుసు. కానీ గృహనిర్భంధంలాంటి స్థితిలో ఉన్నాను. నా రక్షణ కోసం.. జాగ్రత్తగా, మెలుకువగా ఉండటంలో తప్పు లేదుగా.

ఉత్తరం తెరచి.. కుతూహలంగా చదవసాగాను.

ప్రియమైన బాబు చక్రవర్తికి.

అమ్మ దీవెనలు. చక్రీ .. నా తండ్రీ ఎలా ఉన్నావు నాన్నా? మొన్న మీ బావ పనిమీద అక్కడికి వచ్చి, నాలుగురోజులు ఉన్నాడు కదా? నువ్వూ.. జాహ్నవీ కలసి కాపురం చేయటం లేదని గమనించినట్లున్నాడు. ఇక్కడికి వచ్చినప్పటి నుండీ, మాలతి దగ్గర విలవిలలాడి పోయాడంట. ఆపిల్ల బ్రతుకు నాశనం చేసే హక్కు మీకెవరిచ్చారు? మీ అమ్మ మీ తమ్ముడిని జాహ్నవితో కాపురం చెయ్య వద్దందేమో తెలుసుకో. లేక నీ తమ్ముడే జాహ్నవిని దూరంగా ఉంచుతున్నాడా? నువ్వీ విషయం తెలుసుకుని, వాళ్ళిద్దరికీ రాజీ చేసిరా అంటూ వత్తిడి చేస్తున్నాడంట. ʻఅలా పెళ్ళి చేసుకుని, మానసికంగా బాధ పెట్టినా – గృహహింస కింద కేసు పెట్ట వచ్చునిʼ మీ వాళ్ళకు చెప్పు అంటున్నాడట. మనం మాట వినకపోతే జాహ్నవి గతే నీకు పడుతుందని బెదిరిస్తున్నాడట. అది నా దగ్గర కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే –

నా గుండె కరిగిపోతోంది. మెత్తగా కుందేలులా ఉంటే బావ మంచి వాడనుకున్నాను. అంతేకానీ సుధాకర్‌లో ఇలాంటి బుద్ధి దాగుందని ఊహించలేకపోయాను. దాన్ని దగ్గరకు రానివ్వటం లేదట. జాహ్నవి కాపురం బాగుపడ్డాకనే అంటూ పట్టు పట్టాడంట. సుధాకరానికన్నీ వాళ్ళమ్మ బుద్ధులే వచ్చినట్లున్నాయి. మనకి తెలియలేదు. పేపర్లో ఫోటోల కోసం, పేరుకోసం వేసే వేషాలివన్నీను. పైకి తిట్టనూ లేక లోపల పెట్టుకోలేకుండా ఉన్నాను, అల్లుడు మీద కోపాన్ని. దానికి తోడు మొన్న మా రాజ్యమక్క చూట్టానికి వచ్చి -

'ఏమే కాంతం కొడుకూ... కోడలూ బాగున్నారా? మన బంధువులంతా కాంతమ్మ కొడుకుని, కోడలుతో కాపురం చేయనిస్తోందా? లేక - ఇంకా గుప్పెట్లోనే పెట్టుకుందా కొడుకుని? పెళ్ళయి సంవత్సరం అయినా ఇంకా కోడలు నెల తప్పలేదేంటీ' - అంటున్నారంట.

'కాంతం అసలే మన బంధువుల్లో నీకు మంచిపేరు లేదు. నీ నోటికి భయపడే నీ మొగుడు నిన్నొదిలే..సా..డు- అనుకుంటారు కదా' షాకయ్యాను. అది చదివి . అదేవిటి? 'చక్రవర్తి తండ్రి చక్రవర్తి చిన్నప్పుడే - వ్యాపారం కోసం దుబాయి వెళ్ళి, అక్కడ ఏక్సిడెంటులో చచ్చిపోయారంట.! శవాన్ని తీసుకురావటానికి కూడా వీలులేకుండా పోయిందట.' అని అమ్మ చెప్పిందే

తల తిరిగి పోతోంది.

ఒక పెళ్ళి చేయటం కోసం ఇన్ని అబద్ధాలూ, అంత మోసమూనా? నాతిచరామీ... నాతిచరామీ అంటే అర్థం ఏమిటి?

నాతిని (స్త్రీని) చెరపెట్టమనా? నాతి చరామీ అంటే అర్థం?

నేను చాలా సేపు అయోమయంగా కూర్చుండి పోయాను ఎవరు? ఎవరు చేసారు నా పట్ల మోసం? అసలు అమ్మా వాళ్ళకి ఈ విషయం తెలుసా? తెలిసి నాకు అబద్ధం చెప్పారా? మీరాకు పెళ్ళి చేసి, తొందరగా I.A.S అల్లుణ్ణి ఇంటికి తెచ్చుకోవాలనే కాంక్షతో. లేదూ చక్రవర్తి తండ్రి విషయం తెలియక తొందర పడటంలో మోసపోయారా? (బహుశా ఈ సంగతి తెలిసినా పట్టించుకోరు) అయినా పెళ్ళనేది ఒక జీవిత కాలపు సమస్య, అనేది తల్లితండ్రులకు కాదుగా. ఎంత జాగ్రత్తగా చూడాలి. ఎన్ని ఆలోచించాలి? ఏమీ తెలియని పసిప్రాయంలో అయితే పెద్దవాళ్ళ మాటలు వినటంలో అర్థముంది. వయసు వచ్చిన తర్వాత, తమ పిల్లల అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రవర్తిస్తే," బాధ అనుభవించేది ఎవరు? పెద్దవాళ్ళకేం ఒకసారి లేదూ కొన్నాళ్ళు బాధను ప్రకటించి, ఆతర్వాత 'దాని ఖర్మ. దేవుడు ఎలా రాసి పెడితే అలా జరుగుతుంది' - అనే మెట్ట వేదాంతాన్ని వల్లించి వదిలేస్తారు. అది తప్పు. బాధ్యత నుండీ తప్పించుకునే వాళ్ళు చెప్పేమాటలవి.

నేను మరలా ఉత్తరం చదవటం మొదలు పెట్టాను.

"నువ్వూ పెద్దదానివయిపోతున్నావు కాంతం. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు. నీ కూతురు కాపురం చల్లగా, సంతోషంగా ఉండాలని ఎలా అనుకుంటావో, కొడుకు కాపురం కూడా అలాగే బాగుండాలని కోరుకోవటం మనిషి ధర్మం. మన చుట్టాలు నీ గురించి ఏవేవో అనుకుంటున్నారు. అవన్నీ నిజం చేయకు." - అంటూ చాలాసేపు నన్ను నిలబెట్టి ఉపన్యాసం ఇచ్చి వెళ్ళింది. ఏదో మీ నాన్నకు అక్క కదాని గడపతొక్కనిస్తే అంత అలుసు చేసి వెళ్ళింది.

నాన్నా చక్రీ ఎంత కాదనుకున్నా మీ నాన్న వెళ్ళిపోయాకా, మీ అత్త అండ మూలంగానే మన ఆస్తిమనకు దక్కింది. ఆ ఆస్తే లేకపోతే నిన్నూ మీ అక్కనూ ఒంటరి ఆడదానినైన, నేను ఎలా పెంచగలను? అందుకే ఆలోచిస్తే మీ మేనత్త అండ వదులుకోవటం సరికాదనిపిస్తోంది. అందువలన అక్క చెప్పినట్లు, నీ భార్యను తల్లిని చెయ్. నెలతప్పిందని తెలియగానే దూరంగా పెట్టు. నాకు తెలుసు చక్రీ, చిన్ననాటి నుండీ మిమ్మల్ని పెంచటానికి నేనెంత కష్టపడ్డానో నువ్వెప్పుడూ మర్చిపోవని నాకు బాగా తెలుసు. కన్నతల్లి రుణం కోటి జన్మలెత్తినా తీరదంటారు. నాకు, నేను పెంచిన పిల్లల మీద పూర్తి నమ్మకం ఉంది. నా పిల్లలు, భార్య, పిల్లలూ, సంసారమంటూ ఆ బాదర బంధీలో చిక్కుకుని, ఈ కన్న తల్లిని దూరం చేసుకోరని. అయినా విధి రాతని ఎవరు తప్పించగలరు? ఒకవేళ నాకు బలవంతపు మరణం ఆ భగవంతుడు రాసిపెట్టి ఉంటే, మీ బుద్ధి మారవచ్చు. అది నీ తప్పు ఎలా అవుతుంది చక్రీ. భర్త వదిలేసిన ఆడదానిని, ఏ సుఖమూ సంతోషమూ తెలియనిదానిని. కేవలం మీ కోసమే బ్రతుకుతున్నాను. ఈ సమాజంలో బ్రతుకుతున్నందుకు, మనకు ఇష్టమున్నా లేకపోయినా కొన్ని వాటికి తలవంచి తీరాలి. అందుకే ఇలా రాయవలసి వస్తోంది. అయితే కొన్ని కొన్ని సార్లు తలవంచుతున్నట్లు నటించి, లోకాన్ని లోకులనూ మభ్యపెట్టాలి. లేకపోతే మనం సుఖంగా బ్రతకలేం. నువ్వెప్పుడూ నా మాట దాటలేదు. నువ్వు చిన్నప్పటి నుండీ నీ ప్రతీ పుట్టినరోజుకీ, దేవుని ముందు నిలబడి, 'జీవితంలో ఎప్పుడూ అమ్మ ఆజ్ఞను జవదాటనని' ప్రతిజ్ఞ చేస్తూ వచ్చావు.

రేపు పుట్టినరోజు. ఈసారి పుట్టినరోజుకి నీ దగ్గర లేనందుకు నాకు బాధగానే ఉంది. కానీ ఏం చెయ్యనూ? పొద్దున్నే లేచి ఆరోజు ఎవరి ముఖం చూసానో ఏమో? మెట్లమీద నుండి జారిపడటం కాదుకానీ, నడుం పట్టి, కాళ్ళు బెణికీ , మంచాన పడి నరకం చూస్తున్నాను. మన ఆచారిగారు, ఇంకో మూణ్ణెల్ల వరకూ లేచి నడవటానికి కుదరదంటున్నారు. మీ అక్కకు పాపం నామూలంగా పని ఎక్కువైందనుకుంటే, ఇప్పుడు మీ బావ సాధింపు తోడైంది.

పెళ్ళప్పుడు నోట్లో నాలుక లేనట్లు ఉంటే, కూతురు సుఖపడుతోందనుకుంటే, ఇప్పుడు ఇలా మారిపోయాడు. అయినా మొగుణ్ణి చెంగుకు కట్టుకుని ఆడించటం చేతకాని ఆడది ఏం సుఖపడుతుంది చెప్పు. అంతా నా ఖర్మ. నీ గురించి నాకు బెంగలేదు. నువ్వు మగమహారాజువి. ఈ సమాజంలో మిమ్మల్ని ఎలా తిరిగినా.. ఏం చేసినా ఎదురించే వారు లేరు అది

ఈ సంఘం మీకిచ్చిన వరం.ఇలాంటి సమాజంలో నిన్ను మగవాడిగా కన్న ఈ తల్లి రుణం సదా నా మాట వింటూ తీర్చుకుంటావని నాకు తెలుసు. నాకు బాగాలేదని చూట్టానికి రాకు. మీ బావ నీమీద గుర్రుగా ఉన్నాడు. నాకు నయం అయిన తర్వాత నేనే అక్కడికి వచ్చేస్తాను. సరేనా మరి. ఇక ఉంటాను.

ప్రేమతో,

నీ తల్లి కాంతమ్మ.

నేను ఆ ఉత్తరం చదివి ఆశ్చర్యపోలేదు. నాకు పెళ్ళయిన ఈ సంవత్సరం నుండీ వీళ్ళిద్దరినీ గమనిస్తున్నా.

చక్రవర్తికి నేనంటే ఇష్టం లేదంటాడు.

మరెందుకు పెళ్ళి చేసుకున్నారని అడిగితే, 'అమ్మ చెప్పింది. చేసాను' - అంటాడు.

నాకు చక్రవర్తి కంటే అతని తల్లి స్వభావమే అర్థం కావటం లేదు అనుకుంటూ ఉండేదాన్ని ఇంత వరకూ.

ఈ ఉత్తరం చదివాక నాకర్థమయ్యింది ఒకటే.

భద్రతారాహిత్యం. అవును. కొడుకు భార్యను బాగా చూసుకుంటే తనని లక్ష్యపెట్టడని భయం. ఆ భయంతోనే అంత అందమైన కొడుక్కి నన్నిచ్చి పెళ్ళిచేసిందామె. అవును చక్రవర్తికి నేనంటే అసహ్యం కదా మరి? నన్ను తల్లిని ఎలా చేస్తాడు? అయినా ఏం తల్లి ఈవిడ? కూతురు భర్తతో సుఖపడాలి! కొడుకు భార్యను దగ్గరకు రానీయకుండా, బయట వాళ్ళతో తిరిగి కోర్కెలు తీర్చుకోవాలి. ఆడదేనా? ఆమెకు తన మొగుడు వదిలేసాడు, అదీ మంచి వయసులో భర్త అనురాగానికి దూరమయ్యారు. ఆలోచించే కొద్దీ ఆవిడ మానసిక స్థితి అర్థమయింది. ఆవిడలో ఆవిడకు తెలియకుండానే మగవాళ్ళంటే కసి ఏర్పడిపోయినట్లుంది. ఇదీ ఒక రకమైన మానసిక వ్యాధే. ఈ వ్యాధికి గురైన మా అత్తగారు ఒక స్త్రీగా.. సాటి స్త్రీ అయిన తన కూతురి కాపురం బావుండాలని కోరుకుంటోంది. మగడనే మగవాని ద్వారా దగాపడ్డారు కనుక కొడుకు అనే మగవాణ్ణి సంసారసౌఖ్యాలకి దూరం చేస్తోంది. ఎటొచ్చీ ఇది ఒక జబ్బు అని బహుశా చక్రవర్తి కూడా గ్రహించి ఉండడు. నా తల్లి తండ్రులకు I.A.S అల్లుడు కావాలి. బంధువులలో గర్వంగా, గొప్పగా గుర్తించబడాలి. ఇది కూడా ఒక రకం రోగమే కదా? గొప్పల కోసం పిల్లల జీవితాల్ని ఫణంగా పెట్టటం రోగం కాక మరేమిటి? సరే! ఇప్పుడీ లెటరు చక్రవర్తికి ఇవ్వాలా? వద్దా?

ఇప్పుడీ ఉత్తరం దాచటం వలన లాభమేమీ లేదు. ఆమె మరల తన కొడుక్కి ఉత్తరం రాయరని గేరంటీ ఏమిటి?

ఉత్తరం కాకుంటే ఫోను చేసి చెప్పవచ్చుగా.

ఫోనులో చెప్పేటంత మంచి విషయం కాదుగా. అదీ కాకుండా అల్లుడు ఎటునుంచీ వినేస్తాడో అనే భయం కూడా ఉండి ఉంటుంది. ఏమైనా నాకీ ఉత్తరం చదువుతుంటే హుషారుగా, ఆసక్తిగా ఉంది. నా నీడను కూడా చూడటానికి ఇష్టపడని నాభర్త కాని భర్త నన్ను తాకుతాడా?

కౌగిలిలో బంధిస్తాడా? లేక - కాళ్ళూ, చేతులూ, నోరు కట్టేసి రేప్ చేస్తాడా?

అంత ధైర్యమా అతనికి? అతనికి ధైర్యం ఉందో లేదో తెలియదు కానీ, నేను మాత్రం సాదా సీదా స్త్రీని కాదు. అతను వద్దన్నప్పుడు దూరంగా ఉండి, రమ్మన్నప్పుడు సిగ్గు పడుతూ గదిలోకి వెళ్ళటానికి. ఒకసారి వద్దని చీదరించబడిన తర్వాత, మరల అతని చేతివేలి గోరును కూడా నన్ను తాకనియ్యను.

నేను నిన్న పుట్టిన రేపటి స్త్రీని.

అయితే ఒక ఆసక్తి ఇప్పుడే నాలో జనించింది. చక్రవర్తి తన తల్లి మాట పాటించటం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేస్తాడు?

ఎంతో నిర్లిప్తమైన జీవితాన్ని ఈ సంవత్సరం నుండీ గడుపుతున్నాను నేను. నాకు చక్రవర్తీ అతని తల్లి మీద కంటే, నా తల్లితండ్రుల మీద నాకెక్కువ కోపంగా ఉంది.

పిల్లల్ని కనగానే సరిపోదు. వాళ్ళ జీవితాలని మంచి మార్గంలో పెట్టవలసిన బాధ్యత తల్లితండ్రులదే. అటువంటి బాధ్యతలు నిర్వర్తించలేని వారు అసలు తల్లితండ్రులు అని పిలవటానికి కూడా అర్హులు కాదు. నేను నిజమే అంటున్నాను. పెండ్లయి, గొడవపడి, బలవంతంతో, అయిష్టంగా - ఆత్మాభిమానం రెండువైపుల వాళ్ళూ గాయపరచగా, ఒక బానిసలా, అసహాయంగా ఇతనితో వచ్చాను.

మాటలతోనే కాదు. మౌనంతోనూ బాధించవచ్చని ఇక్కడికి వచ్చాక తెలిసింది.

ఆగస్టు 14వ తేదీన నాపెళ్ళి జరిగింది. ఎంతగా వేడుకున్నాను నాకీ పెళ్ళి వద్దని? ఎంత వాదించాననీ! `ఆ అబ్బాయికి నన్ను పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేనట్లుందమ్మా` అంటే, ఏమంది అమ్మ, "అదేంకాదు. అతనికి సిగ్గట"అంది.

అలా చెప్పటానికి సిగ్గులేదూ? ఆడపిల్లలుకూడా పెళ్ళి చూపుల్లో ఠీవిగా కూర్చుని, ఫ్రెండ్లీగా హాయిగా మాట్లాడుకునే ఈ రోజుల్లో, ఒక అబ్బాయి కళ్ళెత్తి కాబోయే భార్యను చూడలేదంటే - అది సిగ్గు కానేకాదు. అనాసక్తి.

ఆడపిల్ల తల్లితండ్రులకూ తెలుసు. అయినా సరే. ఎక్కువ కట్నం అదీ అడక్కుండా చీప్‌గా వచ్చేస్తున్నాడు కదా అనీను -

`పెళ్ళయితే అతనే మారతాడులే` అనే దుర్మార్గపు ఆలోచన చేసి, `ముందుగా ఒక్క పిల్ల బరువునైనా వదిలించుకోవాలి` - అనే స్వార్ధంతో తమని తాము మభ్య పరచుకుని - పిల్లల్ని మోసగిస్తారు ఎందుకు? ఎందుకు అమ్మల్లారా మమ్మల్ని కనటం. మానేయొచ్చు కదా? సరే? నేను నా చేతిలో ఉత్తరాన్ని చక్రవర్తికి ఇవ్వాలనే నిశ్చయించుకుని గమ్ తీసుకుని ఉత్తరం చివర రాస్తుంటే అనిపించింది.

పెళ్ళి కూడా గమ్ లాంటిదే లోపల ఏ అక్షర భావాలు ఉన్నాయో తెలియదు కదా, ఒకసారి గమ్ చేసిన తర్వాత. ఉత్తరం చించాలి. పెళ్ళి జరిగిపోవాలి. అప్పుడు అసలు విషయం బయటపడుతుంది. నా ఆలోచనలు మరల పెళ్ళి చూపుల నాటి సంఘటనలను జ్ఞాపకం చేస్తున్నాయి. అమ్మకాలేజీకి వెళ్ళొద్దందని నాన్నగారి దగ్గర మొరపెట్టుకున్నాను.

ఆయనా నా మాట వినలేదు. పైగా అమ్మనే సమర్ధించారు. చివరి ప్రయత్నంగా అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి -

"అమ్మమ్మా నాకిప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. నాకు లాయర్ కావాలని ఉంది." - అన్నాను సీరియస్‌గా.

"అదేవిటే, నీకు పెళ్ళి చెయ్యాలని మీ అమ్మా - నాన్నా ఈ రోజు పెళ్ళిచూపులు కూడా ఏర్పాటు చేసారు కదే!" అంది.

"ముందే నాకు చెప్పారా?"

"అన్నీ నీకు చెప్పే చేయాలా? నీకు చెప్పే కన్నామా?"- వెనుక నుండీ అమ్మ కంఠం ఖంగుమంది.

నాకింకా డిగ్రీ కూడా లేదు. పరీక్షలు చూస్తే ముందున్నాయి. ఇప్పుడీ పెళ్ళిగొడవేంటీ? అడగాలని ఉంది. అడిగీ లాభం లేదని తెలుసు. వాళ్ళకి మాత్రం తెలియదా? తెలుసు. అన్నీ తెలిసే ఇలా చేస్తున్నారు. వాళ్ళ స్వార్ధం కోసం. I.A.S అల్లుణ్ణి అర్జెంటుగా తెచ్చుకోవాలంటే గుదిబండలా నేను అడ్డుగా ఉన్నాను. ఆ అడ్డు తొలగించుకోవటానికి ఇప్పుడు నాకు అర్జెంటుగా పెళ్ళి చేసేయాలి.

"ఎప్పుడంటే అప్పుడు మంచి సంబంధాలు రావు. చదువుదేముంది. ఎప్పుడయినా చదువుకోవచ్చు. అయినా నువ్విప్పుడు చదివి ఉద్యోగం చేసి ఊళ్ళేలాలా? డిగ్రీ చదువుతే ఏం ఉద్యోగం వస్తుంది. గుమ్మస్తా ఉద్యోగం కూడా రాదు. చెల్లెలు భర్త కలెక్టరుగా ఉండి, అది కలెక్టరు భార్యలా గొప్ప హోదాలో ఉంటే - నువ్వు చిన్ని చిన్ని.."

"చిన్ని.. చిన్ని కాదు. నేను లా చెయ్యాలనుకుంటున్నాను." - అమ్మ మాటలను మధ్యలో ఆపి చెప్పాను.

నువ్వు డిగ్రీ పూర్తి చేసి లా పూర్తయేసరికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది? అప్పటి వరకూ నీ చెల్లెలికి పెళ్ళి చెయ్యకుండా ఆపాలా? అంత వరకూ ఆ అబ్బాయి వాళ్ళు ఆగుతారా? ఇప్పుడు చదువవ్వాలి అన్నావు. ఆతర్వాత ప్రాక్టీస్ అంటావు. ఆ తర్వాత జడ్జి అవ్వాలని అననైనా అంటావు. అందుకని పిచ్చి పిచ్చి వేషాలు వేయక, నోరు

మూసుకుని చెప్పినట్లు చెయ్యి. ఆడపిల్లల్ని ముదిరే వరకూ ఇంట్లో పెట్టుకుని, ఆ తర్వాత కాలో చెయ్యో జారిన తరువాత, మేమిద్దరం ఉరేసుకుని, చచ్చేవరకూ తెచ్చుకోవటం నాకిష్టం లెదు."

తల్లేనా ఈమె! చాలు ఇహ చాలు. ఇలాంటి వాళ్ళ దగ్గర ఉండేకన్నా, పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయి, అక్కడుండి చదువుకోవటమే ఉత్తమం అనుకుని -

"ఇహ చాలు. నాకోసం మీరెవరూ ఉరేసుకుని చావక్కర్లేదు. నేనీరోజు కాలేజీకి వెళ్ళను." - అన్నాను పౌరుషంగా.. వేదనగా -

"ఇదేదో ముందే ఏడ్వొచ్చుగా." - అమ్మ తిట్టుకుంది.

ఏడ్పని తెలియదు. పెండ్లంటే నూరేళ్ళ పంట అనుకున్నాను. ఆ పంట బాగా పండటం కోసం, ఒక రైతు పంట పండించేముందు, భూమిని ఎట్లా సాగుచేసి, ఎఱువులు వేసి పంట కోసం సిద్ధం చేస్తాడో, అలాగే ఆ పిల్లల పెళ్ళి విషయంలో తలితండ్రులు కూడా పిల్లలకు అన్ని రకాల సెక్యూరిటీలు ఏర్పరుస్తారనుకున్నాను. అంతేకానీ, పిల్లల పాలిట అకాల వర్షాలూ, తుఫానులూ అవుతారని అనుకోలేదు.

అమ్మమ్మ కూడా నాకు సపోర్ట్ ఇవ్వటంలేదు. ఒట్టప్పుడంతా బోలెడు, బోలెడు ప్రేమను చూపించేది. తీరా జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం వచ్చేసరికి మొహం చాటేస్తోంది! నాకు ఆశ్చర్యంగా ఉంది. బాధగాఉంది.

సరే చేయనివ్వు. వాళ్ళకెలా కావాలో అలానే చేసుకోనియ్. కానీ అమ్మా నువ్వు ఇంత వరకూ నాలో లేని, రాని ఊహకు ప్రాణం పోసావు. అవును -

నేనెందుకు 'లా' చదివి జడ్జిని కాకూడదూ? ఎస్. నేను 'లా' చెయ్యాలి జడ్జిని కావాలి.

అందుకోసం మొదటగా ఈ ఇంటి నుండి బయటపడాలి. పారిపోవటం మాత్రం కాదు. న్యాయమూర్తిని కావాలనుకున్నప్పుడు న్యాయమైన బాటపైనే పయనించాలి కదా? అందుకే నేనీ పెళ్ళి చూపుల్లో పాల్గొనటానికి ప్రిపేరు అవసాగాను.

అమ్మమ్మ నా ముఖం చూస్తూ, "జాహ్నవీ.. అప్పుడే నీకు పెళ్ళి కళ వచ్చేసింది." - అంది.

అవును కళ వచ్చింది. అయితే ఏం కళ ఇది???

## మూడవ భాగం

**"అందమయినవి అందమైన వాటికే అందుతాయి."**

"ఇదిగో పెళ్ళి చూపుల్లో తిక్క తిక్కగా మాట్లాడకు వాళ్ళ ముందుకు వచ్చినప్పుడు." - అమ్మ అంది.

"అది నా కూతురు. నా మర్యాదను కాపాడుతుంది." - నాన్న ముందరి కాళ్ళ బంధం. కనకాంబరం రంగు బిన్నీ జార్జెట్ చీర మీద, సన్నటి జరీ చక్స్. అదే కలర్ సన్నటి జరీ అంచువున్న బ్లౌజ్. రెండేసి బంగారు గాజులు. చిన్న డైమండ్ డాలరు వున్న సన్నని బంగారు చైన్. ఏడురాళ్ళున్న డైమండ్ చెవిదుద్దులు. వేలికి డైమండ్ రింగ్. సింపుల్ డ్రెసింగ్. రంగు తక్కువగా వున్నవాళ్ళు. గాడీ రంగులూ, నగలూ పెట్టుకుంటే ఎబ్బెట్టుగా వుంటుందంటుంది అమ్మ.

"జాహ్నవికి అప్పుడే పెళ్ళి కళ వచ్చేసింది" - అంది అమ్మమ్మ.

ఒక వేళ ఇతనితో పెళ్ళి జరిగితే, మొదటి రాత్రే చెప్పేయాలి, నేను 'లా' చదివి న్యాయమూర్తిని కావాలనుకుంటున్నానని. అతను - కొద్దిగా మాటకారి అయితే, "ఏం చెల్లెలుతో పోటీపడ్తున్నావా? నయం నన్ను, కలెక్టరునీ, ఎస్పీనో కమ్మనలేదు. అంతవరకూ సంతోషం. సరే చదువుకో. నీ కోరిక ఎందుకు కాదనాలి?" - అంటే ఎంత బావుంటుంది. బయట కారు శబ్దమయింది. "వాళ్ళు వచ్చినట్లున్నారు." - అంటూ నాన్న బయటకు వెళ్ళారు గబగబా.

"ఫేను కింద కూర్చో. చెమట పట్టదు. చీర నలుపుకోకు. జాగ్రత్త."- చెప్పి అమ్మ, వెనగ్గా అమ్మమ్మ బయటకు వెళ్ళారు.

ఒక్కర్తినే గదిలో మిగిలిపోయాను. అద్దంలో నా ప్రతిబింబం నాకు తోడుగా. నా చెల్లెలు మీరాను చాలా ముందు చూపుతో ఫ్రెండింటికి పంపేసారు. మళ్ళీ ఫోను చేసే వరకూ రావద్దని చెప్పారు. అందమైన అమ్మాయి కదా? "మీ మొదటి అమ్మాయి బావుండలేదు. రెండో అమ్మాయి అయితే చేసుకుంటాను, అంటున్నాడు మావాడు." అంటారని భయం.. నిజమే కదా. ఎవరైనా అందమైన వస్తువులనూ, మనుషులనేగా వాంఛించేది.

అయినా పాపం అమ్మ ఎప్పుడూ అంటూ వుంటుంది. "ఉన్నదంతా వూడ్చి నీ నెత్తిన పెడితేకానీ, నిన్ను వదిలించుకోలేమేమో" - అని.

ఇప్పుడు వీళ్ళు కట్నం ఎంత అడుగుతారో మరి. అసలు  అబ్బాయి ఎలా వున్నాడో. మీరా అందాన్ని అందరూ విపరీతంగా పొగడేస్తున్నప్పుడు నాకు భలే అసూయ వేసేది.

కనీసం నాకు అందమైన భర్తనైనా ఇవ్వకూడదా ఆ దేవుడు. అలాగే మీరాకు అది కోరుకున్నట్లే బాగా డబ్బున్నవాడో, మంచి హోదా ఉన్న భర్తో రావాలి. కానీ... నా భర్తే చాలా చాలా అందంగా ఉండాలి. - ఇలా ఊహించి నప్పుడంతా నాకు భలే భయం వేసేది. ఎవరికైనా నా మనసులో ఆలోచనలు తెలిసి పోయాయేమో అని, ఛ.. ఇంకెప్పుడూ అలా ఆలోచించకూడదు అనుకునేదాన్ని. అయినా నేను అలా ఆలోచించటానికి కారణం
ఎవరు?

పెద్దలు మా పట్ల చూపే వ్యత్యాసమే కదా కారణం.

అబ్బ! ఎంతసేపిలా కూర్చోవాలి? బయట గది నుండీ మాటలు వినిపిస్తున్నాయి గానీ, లేకుంటే మా అక్క చెల్లెళ్ళ అందాల గురించి తెలిసిపోయి, 'పెద్దమ్మాయి అయితే వద్దులెండి' అని చెప్పి వెళ్ళిపోయి ఉండేవారు అనుకునేదాన్ని.

అడుగుల శబ్దం వినిపించి తలెత్తి చూసాను. అమ్మ ముఖం విచిత్రంగా ఉంది. ఏ భావమూ తెలియటంలేదు. మొత్తం మీద సంతోషంగా లేదు. అలాని విచారంగానూ లేదు. నిర్లిప్తత కనిపిస్తోంది. వస్తూవస్తూనే, ఆ అబ్బాయి చాలా బావున్నాడు," - అని "రా వెళ్దాం" - అంది.

ఎలా ఆలోచించాలో అర్థంకాక, గుడ్డిగా.. గొర్రెలా అమ్మని అనుసరించాను. మొత్తం అయిదుమంది వచ్చారు. నేను చూసీ చూడనట్లు, పాదాల నుండీ పైకి చూసాను. ఉలికి పడ్డాను. 'ఛ అదేంటీ అమ్మ అలా అంది. ఏం బావున్నాడు? ఇక్కడ కూడా అబద్ధమేనా' - అనుకుంటా వుంటే.. అతను -

"బాబూ సరిగ్గా చూసుకోండి. మళ్ళీ రేపొద్దుట మమ్మల్ని ఏం అనకూడదు." అన్నాడు. ఓహో ఇతను మధ్యవర్తా? అనుకుని, నాన్నగారి ప్రక్క కుర్చీలో కనిపిస్తున్న మరో వ్యక్తి కాళ్ళను చూసి అతనే అయ్యుంటాడు అనుకున్నాను. కానీ చూట్టానికి ధైర్యం లేదు. చూడాలని వుంది. తెలుపు రంగులో కాస్త గులాబీరంగుని కలిపి ఆ పాదలను తయారుచేసాడా ఆ బ్రహ్మ? అనిపించింది గభాల్న తలెత్తి చూసాను. షాక్. నిజంగా చాలా చాలా బావున్నాడు. మీరా పక్కన నిలబడితే మీరా కంటే అందంగా వుంటాడు.

నేను అతని ప్రక్కన నిలిస్తే దీపం క్రింద నీడలా వుంటాను. సో.. కేన్సిల్. "అమ్మాయిని లోపలకు తీసుకు వెళ్ళండి" – అతని తల్లి అనుకుంటా. అదేవిటి! ఏమీ అడగలేదు. సరిగ్గా చూడనైనా లేదు. ఎవరూ? నేనా? అతనా? అతనేం చూస్తాడు నన్ను?

నాకే మరోమారు అతన్ని చూడాలని ఉంది. అందానికి నిర్వచనంలా వున్నాడు. మెరిసే కత్తిలా వున్నాడు. నాన్నగారితో నెమ్మదిగా కాస్త తలవంచి మాట్లాడుతున్నాడు. కనీసం నన్ను చూడాలనే కుతూహలంకూడా అతనిలో కనిపించటంలేదు. నెమ్మదిగా సీరియస్‌గా నాన్నగారికేదో చెపుతున్నాడు.

"లోపలికి వెళ్ళమనండమ్మా!" – ఆవిడ మరల చెప్పారు అమ్మతో. ఈడూ జోడూ కుదరదని అర్ధమయిపోయినట్లుంది. నేను లేవబోయాను. ఇంతలో సడన్‌గా – "మీకు ఇద్దరు అమ్మాయిలన్నారు? మరో అమ్మాయి ఏదీ?" – అలా అడిగిన ఆమె అతని అక్కో, బంధువో అయ్యుండాలి.

"మా రెండో అమ్మాయి మీరా, మా అత్తగారికి బావుండలేదని తెలిసి ఊరికి వెళ్ళింది. తీరా అక్కడికి వెళ్ళిన తర్వాత అమ్మాయికి అమ్మవారు పోసిందట. అందుకని అక్కడే వుంది." – అమ్మేనా. ఇన్ని అబద్ధాలా? నాకు అసహ్యమనిపించి, ఛరుక్కున లేచి లోపలికి వచ్చేసాను గబగబా. వచ్చి అద్దం ముందు నిలబడ్డాను. నాకళ్ళకు నేను కనిపించటం లేదు. అతని అందం నాకళ్ళను మిరుమిట్లు కొలుపుతోంది. ఆ మెరుపుల అడుగునెక్కడో మసక మసకగా నా రూపం. ఇది నన్ను నేను తక్కువ చేసుకోవటం కాదు. వాస్తవం.

అవునూ అతను నాన్నగారితో ఏం మాట్లాడుతున్నాడు?

'నా అంత అందగానికి మీ అమ్మాయిని ఇవ్వచూట్టం బావుందా' అని అంటున్నాడేమో!

నాకేం తోచటం లేదు. మీరా ఉంటే బావుండేది. వద్దు .వద్దు అదిగానీ ఇతన్ని చూస్తే –

ఐ.ఏ.ఎస్ వద్దు ఐ.పి.ఎస్ వద్దు, డబ్బు వద్దు, హోదా వద్దు. అసలేమీ వద్దు ఇతను తప్ప అనేసి వుండేది. దానికా ధైర్యం వుంది. ఒకవేళ అమ్మా నాన్నా 'లేదూ నిన్ను ఐ.ఏ.ఎస్ ఆఫీసర్‌కే ఇస్తామంటే ' – అతన్ని లేపుకుపోతుంది. ఆ తెగింపు మీరాకి ఉంది. తనకి నచ్చింది లభించకపోతే నిరాహార దీక్ష చేసయినా సాధించుకుంటుంది. అందమైనది అంటే దానికి పిచ్చి ప్రేమ. పొరపాట్న నేనెప్పుడయినా మంచి డ్రస్సు కొనిపించుకున్నా, లేదూ నా పుట్టినరోజుకు మంచి బొమ్మలు ఫ్రెండ్స్ ఇచ్చినా అలాంటివే తనకూ దొరికే వరకూ ప్రశాంతంగా ఉండనిచ్చేది కాదు ఎవర్నీ. ఇప్పుడే కనుక మీరా ఉండి వుంటే? ఏంచేసి ఉండేది? అందమా? హోదానా? అని ఆలోచిస్తుందా? ఏమో. చెప్పలేం మీరా ఎప్పుడు ఎలా ఉంటుందో తనకే తెలియదు.

అమ్మా వాళ్ళ ముందు చూపును అభినందించాలి. వాళ్ళకి అందమైన అల్లుడు కంటే ఐ.ఏ.ఎస్ అల్లుణ్ణే కోరుకుంటారు. ఇతను నన్నెలానూ అంగీకరించడు. అది వేరెవరూ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంక హాయిగా ఈ డ్రస్ మార్చేసి, కాలేజ్‌కి వెళ్ళిపోతే బావుంటుంది కదా!

నేను బీరువా తెరిచాను మామూలై పోతూ. ఇదో చిన్న కల. ఇలా వచ్చి అలా కరిగి పోయింది అంతే. అనుకుంటూ, చుడీదార్ తీసుకుంటూ ఉండగా -

బయట వాళ్ళు వెళ్ళిపోతున్న శబ్దం.

అమ్మమ్మ గబగబా లోపలికి వచ్చింది. నా దగ్గరగా వచ్చి నన్ను దగ్గరకు తీసుకుంటూ - "అదృష్టవంతురాలివే తల్లీ. వాళ్ళకి నువ్వు నచ్చేవ్" - అంది.

"వాట్!!!"

"అదేవిటీ అలా అరిచావ్. వాళ్ళకి నువ్వు నచ్చేవ్ అన్నాను అంతేగా"

"అదే అదే వాళ్ళకి నేను నచ్చట మేమిటో?!" - నా చేతిలో చుడీదార్ క్రిందకు జారిపోయింది.

"ఏం నీకేం తక్కువ?"

"ఏ మెక్కువ?" - ఎదురు ప్రశ్నించాను.

"అదేవిటే అలా అంటావ్?"

"లేదమ్మమ్మా. వాళ్ళు ఒప్పుకున్నారంటే నాకేదో అనుమానంగా ఉంది. వాళ్ళకేదో లోపం ఉందేమో. అదీ భయంకరమైనది అయి ఉంటుంది - అనిపిస్తూ ఉంది."

"చాల్లే ఊరుకో. టీ.వీలు చూసి చూసి ఈ కాలం పిల్లలు అన్నింటినీ అతిగా ఊహించుకుంటున్నారు."

"అతని ప్రక్కన నేను మరీ తీసి కట్టుగాఉంటాను."

"నీ మొహం. నీకేం కన్నొంకరా? కాలొంకరా? అయినా అందమొక్కటే చాలా? మంచి గుణం ఉండొద్దూ? పెళ్ళికి పైకి
కనిపించే ఎట్టుతోలు ఒక్కటే చూడరు. మంచి గుణం ఉండాలి. మాటా, మర్యాదా బావుండాలి. కుటుంబం సాంప్రదాయం, ఇటు ఏడు తరాలూ.. అటు ఏడు తరాలూ వాకబు చేయాలి -"

"అమ్మా ఇంక నీ చాదస్తాలన్నీ దాని బుఱ్ఱలోకి ఎక్కించకు. ఏడు తరాల వాకబులన్నీ మీ కాలంనాటివి.

ఇప్పుడు అమ్మాయికీ, అబ్బాయికీ నచ్చితేచాలు. ఈ కాలం పిల్లలేమైనా పెద్దవాళ్ళతో కలిసి ఉంటున్నారా?

పిల్లలిద్దరూ సంతోషంగా ఉంటే చాలనుకునే రోజులివి.

జాహ్నవీ ఆ అబ్బాయి మన సంబంధాన్ని ఇష్టపడ్డాడు. మరి నువ్వేమంటావ్? నాన్న నీకిష్టమని చెప్పేసారు. మా అందరికీ ఈ సంబంధం బాగా నచ్చింది.

ఆ అబ్బాయ్ మెరుపులా ఉన్నాడు నాన్నగారు కూడా అదే అన్నారు."

"అదే అమ్మా ఆ మెరుపులాంటి మంటలో నేను మాడిపోతానేమో నని భయం వేస్తోందమ్మా."

"పిచ్చి కబుర్లు చెప్పకు. మనకేం తక్కువ? వాళ్ళకన్నా అన్నింటిలోనూ మనం పైనే ఉన్నాం. ఏదో పిల్లాడు నీకన్నా కాస్త ఎఱ్ఱగున్నాడంతే. మరింకేం మాట్లాడకు. నాన్నగారు విన్నారంటే నన్ను కోప్పడతారు. పిల్లల్ని సరిగా పెంచలేదంటూ." - అమ్మకోప్పడింది.

ఇంతలో నాన్నగారు పిలిస్తే అమ్మ బయటకు వెళ్ళింది అమ్మమ్మ కూడా గది నుండీ బయటకు వెళ్ళబోతుంటే నేను చేయిపట్టి ఆపేసాను.

అమ్మ దూరమయ్యేవరకూ ఆగి, అమ్మమ్మను నా వైపుగా తిప్పుకుని అడిగాను.

"నిజం చెప్పు అమ్మమ్మా. అతనికి నేను నచ్చానా?"

"నీకెందుకు ఆ అనుమానం వచ్చింది?"

"ఎందుకో చెప్పనా? నన్ను అతను కన్నెత్తి అయినా చూళ్ళేదు. నేను కేవలం ఐదు నిమిషాలు మాత్రమే వాళ్ళముందు ఉన్నాను. అమ్మ సరిగ్గా 11.55 నిమిషాలకు నన్ను వాళ్ళ ముందుకు తీసుకు వెళ్ళింది. సరిగ్గా 12 గంటలకు నేను మరలా ఈ గదిలోకి వచ్చాను. అందుకు సాక్ష్యం ఇదిగో ఈ డ్రస్సింగ్ టేబుల్ మీద ఉన్న టైమ్‌పీస్. మరో విషయం, అతను నన్నెలా కన్నెత్తి చూడలేదో, వాళ్ళ అమ్మా వాళ్ళూ నన్ను ఒక్క ప్రశ్న కూడా అడగలేదు.

పైగా నేను వాళ్ళముందు కెళ్ళి కూర్చున్న దగ్గర నుండి, "అమ్మాయిని లోపలకు తీసుకు వెళ్ళండి, తీసుకు వెళ్ళండి' అంటూనే ఉంది. అప్పుడయినా అతను కళ్ళెత్తి నన్ను చూళ్ళేదు. అటువంటప్పుడు నన్నతడు ఇష్టపడ్డాడని ఎలా నమ్మను? ఇది జీవితం అమ్మమ్మా నిజం ప్లీజ్." - ఆల్‌మోస్ట్ ప్రాధేయ పడినట్లుగా అడిగాను.

"ఇందులో అబద్ధం చెప్పేదేముంది జాహ్నవీ. సాంప్రదాయాలు పాటించే కుటుంబాల్లో, అన్ని విషయాలూ పెద్దవాళ్ళే చూసుకుంటారు కదా?"

"అమ్మమ్మా! నువ్వు మారేవు. నిన్నటి నా అమ్మమ్మవు కాదు నువ్వు. చాలా గుంభనంగా మాట్లాడుతున్నావు. ఒక్కటి మాత్రం నాకు బాగా అర్థమయింది అమ్మమ్మా. మీరు అంతా కలిసి నన్నెంత తొందరగా పంపించేయాలా, అలాగే మీరాకు ఆ I.A.S. అబ్బాయితో ఎంత తొందరగా పెళ్ళి చేసి, చుట్టాల్లో వెలిగి పోదామాని ఉవ్విళ్ళూరి పోతున్నారు. ఇది మాత్రం నూటికి నూరు పైసలు నిజం."

"బుజ్జీ నువ్వు మా అందరినీ అపార్థం చేసుకుంటున్నావే."

అమ్మమ్మకి మా మీద ప్రేమ వస్తే బుజ్జీ అని, మీరాను 'చిన్ని' అని పిలుస్తుంది.

"నా తల మీద ఒట్టేసి చెప్పు. మీరు నన్ను మోసం చెయ్యటం లేదా?"

"బుజ్జీ నువ్వీ ఇంటి ఆడపడుచువి. నీకు అన్యాయం జరిగితే అది ఈ ఇంటికి శుభమంటావా చెప్పు."

"నిజంగానే అంటున్నావా?"

"ఒట్టు"

"మరి అతను నన్ను చూళ్ళేదు కదా?"

"కాబోయే మొగుణ్ణి, అంత కళ్ళు తెరుచుకుని, సిగ్గులేకుండా ఎలా చూసుకున్నావే నా తల్లీ." - అమ్మమ్మ నా బుగ్గలు నిమిరి, మెటికలు విరుచుకుంది. కాబోయే మొగుడు.. మాటే తియ్యగా ఉంది. అంతే ఒక్కసారిగా ఊహలకి రెక్కలొచ్చినట్లు, ఆనందపు హరివిల్లు నన్ను చుట్టేసినట్లు పరవశం నాలో. కాబోయే మొగుడు. అందమైన వాడు భర్తగా రావాలనే ఊహే తప్ప, ఊహ నిజమవుతుందని ఊహించలేదు నేను. ఒక అందాల చందమామకు నేను తారను కాబోతున్నాను. పున్నమి వెన్నెల వంటి వివాహజీవితం నన్ను వరిస్తుంటే - హాయిగా మంచి గృహిణిలా అతని అందంలో ఆనందంగా పిల్లా పాపల్తో లోకమంతా అసూయ పడేలా, ముఖ్యంగా మీరా.. అవును మీరా కుళ్ళుకోవాలి. ఎప్పుడైనా ఒక్క మంచి వస్తువును నాకు దక్కనిచ్చిందా? ఇప్పుడేమంటుందో మరి. ఏదో గెలుపు మీరాపై. నాదే నేనే. ఎందుకా చదువు. నే 'లా' చదవటం. నే న్యాయమూర్తిని కావటం. ఆ కేసులూ, కక్షలూ, చదువుకోవటాలూ జీవితమంతా విని వినీ జీవితం డ్రై అయిపోయి ఉండేది. థేంక్‌గాడ్ ముళ్ళదారి నుండీ అందాల పూల దారికి నా జీవితాన్ని మళ్ళిస్తున్నందుకు? అవునూ పేరేంటీ? ఏదో పాట ఉన్నట్లుంది కదూ?

'పేరైనా అడగలేదు. ఊరయినా అడగ లేదు -' అని. "అమ్మమ్మా అతని పేరు?"

"అయ్యో పేరు కూడా చెప్పలేదటే నీకు? చక్రవర్తి. శ్యామ సుందర చక్రవర్తి పూర్తి పేరట. కానీ అంతా చక్రవర్తి అనే పిలుస్తారట. చక్రవర్తికి అక్కే ఆ వచ్చిన అమ్మాయి. పేరు మాలతి అట. అదేంటో అబ్బాయి అందం అక్కకి రాలేదు. పెళ్ళయిందట. భర్త పేరు సుధాకర్ అనుకుంటా.

ఆడపిల్లకు తండ్రి పోలికా - మగపిల్లాడికి తల్లిపోలికా, వస్తే అదృష్టమంటారు అబ్బాయికి తల్లి అందం వచ్చింది. అమ్మాయి తండ్రి పోలికట. పాపం తండ్రి వీళ్ళ చిన్నప్పుడే చచ్చిపోయాడట ఏక్సిడెంటులో. అదీ దుబాయిలో. శవాన్ని కూడా చూసుకోలేకపోయారట.. పాపం విధి రాతను ఎవరు తప్పించగలరు చెప్పు" - అంది వేదాంతిలా చూస్తూ.

అలా నా పెళ్ళి చూపులు జరిగాయి.

అమ్మా వాళ్ళు ఫోన్ చేసిన తర్వాత మీరా వచ్చింది. చాలా ప్రశ్నలు వేసింది.

"అక్కా పర్వాలేదా? బాగానే ఉంటాడా? సి.ఏ చేసాడా? ప్రేక్టీస్ బావుందటనా? సైల్ట్‌గా ఉన్నాడా? ఏక్టివా? ఆస్థిపాస్తులున్నాయా, ప్రేక్టీసు బాగలేకుంటే మరిదిగారు హెల్ప్ చేస్తారులే. పేరయితే చాలా బావుంది. శ్యామ సుందర చక్రవర్తి. పూర్వకాలపు అందమైన పేరు అనుకుంటా. ఇంకా చాలా చాలా ప్రశ్నలు వేసింది. ఫోటో తీసుకోనందుకు చాలా ఫీలయింది.

"ఎంత పదిహేను రోజుల్లో పెళ్ళైయిపోతుంది కదా? అప్పుడు బావగార్ని ఒకేసారి చూద్దువుగానిలే." - అమ్మ అంది.

"పదిహేను రోజుల్లోనే పెళ్ళా" - ఆశ్చర్యంగా అడిగాను.

"అవును కళ్యాణ ఘడియలు తీసుకు వస్తే అంతే మరి. ఇక గబగబా పనులు మొదలుపెట్టాలి. మీరా షాపింగ్ అంతా మీరు చూసుకోండి. ఇంట్లో పనులు అమ్మమ్మ, నేనూ చూసుకుంటాము. నాన్నగారి ఆఫీసు వాళ్ళు బయటి పనుల్లో నాన్నగారికి సహాయం వస్తారట. నాన్నగారు చెప్పారు. నేను అర్జెంటుగా మామయ్యలకు ఫోన్ చేసి చెప్పాలి. మీరా నువ్వు మామయ్యలకు ఫోను కలుపు. వారం రోజుల ముందయినా వచ్చేయమని చెప్పాలి.

ఏమిటో పెండ్లి కుదిరే వరకూ ఒక బెంగ. తీరా కుదిరాక పెళ్ళయ్యే వరకూ కంగారు. పెండ్లంతా సవ్యంగా జరిగే వరకూ ఈ కంగారు తగ్గదనుకో." - అమ్మ ఓవర్ యాక్షన్ చేస్తోందా అనిపిస్తోంది.

మీరా ఫోను దగ్గరకు వెళ్తూ ఆగి నా దగ్గరగా వచ్చి -

"నేను నీ పెళ్ళి చూపుల టైములో లేకుండా నీకు మేలు చేసాను చూసావా? థాంక్స్ చెప్పు నాకు. నేను లేను కాబట్టి నిన్ను ఓ.కే చేసారు వాళ్ళు. అవునా?" - అంది.

నాకు నవ్వొచ్చింది. కాస్త గర్వంగానూ, మీరా గర్వానికి జాలిగాను అనిపించి, అన్ని భావాలనూ మిళితం చేసి నవ్వుతూ -

"థేంక్స్" - అన్నాను

మీరా నా ముఖం వైపు గమ్మత్తుగా చుస్తూ, "అరే ఈ రోజు నీ నవ్వు చాలా బావుందే" - అంది.

"థేంక్స్" - అన్నా మరల.    నా నవ్వూ, ముక్కూ, జుత్తూ చాలా బావుంటాయని నా ఫ్రెండ్సు
ఎప్పుడూ అంటూ ఉంటారు. ఇంట్లో వాళ్ళకే నాలో అందం కనిపించదు. అప్పుడే గుర్తుకు వచ్చి - "అవునూ మీరా. నిన్నెవరో ఐ.ఏ.ఎస్ ఇష్టపడ్డారట కదా? కంగ్రాట్స్. మొత్తం మీద నీ కోరిక నెరవేరింది - బావుంటాడా?" - అడిగాను.

"చూళ్ళేదు నేను. మొన్న అమ్మా - నాన్నగారితో పెళ్ళి కెళ్ళినపుడు నన్ను చూసారట. నాన్నగారి దగ్గరకు వచ్చి, పరిచయం చేసుకుని, చెప్పారట నన్ను చూసినట్లూ, నచ్చినట్లూనూ."

"అమ్మకూడా చూళ్ళేదా?"

"లేదు. ఇద్దరం పెళ్ళిలో హడావిడిగా ఉన్నాం. అతని కేదో ట్రైనింగ్ ఉందని కొద్దిసేపే ఉండి, నాన్నగార్ని కలిసి వెళ్ళిపోయారట! నెలా పదిహేనురోజులట్రైనింగట. అది అయిన తర్వాత నిశ్చితార్థం అనుకుంటున్నారు. పెద్దదానివి. నీకు పెళ్ళి నిశ్చయం కాకుండా, నాకు పెళ్ళి నిశ్చయమయితే నువ్వు బాధ పడతావని, అప్పుడే నీకు చెప్పకూడదనుకున్నాం. నీకూ మేచ్ సెటిలయింది కనుక చేప్పేసారన్నమాట. అదీ కాకుండా 'రామ్ అలా చెప్పిన తర్వాత -"

"రామ్ ఎవరు?"

"ఆయన పేరే. పూర్తి పేరు సాయిరామ్. ఆయన నన్ను చేసుకుంటానని చెప్పిన తర్వాత నాన్నగారు, పెళ్ళికి వచ్చిన మన
చుట్టాలందరికీ నీకూ ఒక మంచి సంబంధం తొందరగాచూసిపెట్టమని చెప్పారులే."

"ఇంతకీ నువ్వు మీ సాయిరామ్‌ని చూళ్ళేదన్నమాట."

"చూళ్ళేదు. అయినా I.A.S కదా? తప్పకుండా బావుండే ఉంటారు" - మీరా సిగ్గుపడింది. అందం పండినట్లనిపించింది. ఏమైనా మీరా అందగత్తె.

సాయిరామ్ కూడా మీరాలా అందంగా ఉండే ఉంటాడు. ఎంత అందం? చక్రవర్తి అంత అందంగా ఉంటాడా? తప్పకుండా నో. ఎందుకంటే చక్రవర్తి అందం సమ్‌థింగ్ స్పెషల్. అది అతనికే సొంతం, బాలభానుని కిరణాలు సోకి వజ్రం ఎలా ధగధగా మెరుస్తుంటే అలాంటి అందం చక్రవర్తిది.

మా పెళ్ళిలో చక్రవర్తిని చూసి మీరా నిజంగానే షాక్ తింటుంది. పదిహేను రోజులు పదిహేను నిమిషాల్లా గడిచిపోయాయి. నాన్నగారు మీరా వాళ్ళ కాబోయే మామగారికి కూడా శుభలేక పంపారు. తప్పకుండా రమ్మని ఫోన్ చేసి చెప్పారు. సాయిరామ్ ట్రైనింగ్‌లో ఉన్నారు కనుక ఆయన రాలేక పోతున్నందుకు అమ్మా - నాన్న విపరీతంగా బాధపడిపోయారు. మీరా కూడా దిగులు పడింది. అయితే సాయిరామ్‌కి తనే స్వయంగా ఒక శుభలేక పోస్ట్ చేసింది.

ఆగస్టు 14

ఉదయం పదీ ఐదు నిముషాలకు నా వివాహం.

ముందురోజే పెళ్ళి కూతురుని చేసారు. ఇల్లంతా బంధువులతో, మంగళతోరణాలూ, వాయిద్యాలతో కలకలలాడుతోంది. అమ్మా నాన్నగారూ, మీరా మరీ హుషారుగా ఉన్నారు.

మీరా కాబోయే అత్తగారి పేరు లలిత అట. ఆయన పేరు భాస్కరమూర్తి అట. వాళ్ళు నన్ను పెళ్ళికూతుర్ని చేసి పట్టు చీరా, వెండి బుద్ధుని ప్రతిమా ఇచ్చారు.

"పట్టు చీర మీ అంకుల్, నేనూ సెలెక్ట్ చేసాం. ఈ బుద్ధుని ప్రతిమ సాయిరామ్ నీకు ఇవ్వమని అక్కడనుండీ పంపాడమ్మా" - అన్నారు.

ఎందుకో మరి ఆ బుద్ధ ప్రతిమను చూస్తుంటే, భవిష్యత్తులో సాయిరామ్ నాకు చాలా దగ్గర ఆత్మీయుడవుతాడేమో అనిపించింది. ఎందుకలా అనిపించింది.

జస్ట్ ఇట్ ఈజ్ లైక్ దట్. అంతేనా??

## నాలుగవ భాగం

"మహాశక్తి ఏదో నా మనో మందిరంలో
సృజన కోసం ప్రతిధ్వనుల్ని ప్రసరిస్తోంది.
పూలు విచ్చుకుంటున్నాయి.
నా స్పర్శ సందిగ్ధమైంది." - గోథే

నేను సాయిరామ్ గారు పంపిన వెండి బుద్ధ ప్రతిమను ఇంట్లో అందరికీ చూపించాను. అంతా చాలా బావుందని మెచ్చుకున్నారు. మీరాతో సహా. 'ఫస్ట్ గిఫ్ట్ మనింట్లో నాకు ముందుగా ఇవ్వకుండా ఆయన నీకు పంపారు. సర్లే నీ పెళ్ళి కదా?' అని కూడా అంది.

ఒక్క అమ్మమ్మ మాత్రం - "అదేంటమ్మా ఏ పార్వతీ పరమేశ్వరులో, విష్ణుమూర్తీ లక్ష్మీదేవుల విగ్రహాలు ఇచ్చినా బావుండేది. బుద్ధుడి బొమ్మ ఏంటీ? "బుద్ధుడు భార్యా బిడ్డలను వదిలేసి, సన్యాసి అయ్యాడు కదమ్మా. ఎంత వెండి వస్తువయితే మాత్రం." అంది.

నేనదేం పటించుకోలేదు. పెద్దవాళ్ళు కదా చాదస్తంగా ఉంటారు అనుకున్నాను కానీ, అనుభవజ్ఞులు అనీ, వారికి విద్యాలయాలలో నేర్చుకున్న విద్యకన్నా వందరెట్లు సత్యమైన అనుభవాలు ఉంటాయనీ అవి భవిష్యత్తుకు సంకేతాలు కావచ్చని గ్రహించలేకపోయాను. చిన్నదాన్ని కదా! అనుభవం తక్కువ మరి. నే నేనా బుద్ధ ప్రతిమని నా నగల పెట్టిలో బద్రపరచుకున్నాను. రాత్రి పదిగంటలకు పెళ్ళికొడుకు వాళ్ళు విడిదింటికి వచ్చారని తెలిసింది. నన్ను వదిలేసి, అంతా హడావిడి పడిపోయారు వాళ్ళ పనుల్లో. మీరా అప్పుడే వెళ్ళి అందరినీ చూసెయ్యాలని తెగ సరదా పడింది. కానీ అమ్మ ఒప్పుకోలేదు.

ముందుగా ముత్తైదువలు వెళ్ళాలంట. పెళ్ళి కొడుకు చేత ఏవో పుజలు చేయించాలంట.

మీరాను నా దగ్గర కంపెనీగా బలవంతంగా ఉంచేసారు. నాకు మీరా ఆత్రుత చూస్తే, తనకి చక్రవర్తి ఎలా ఉంటాడో అనే దానికన్నా, నాకన్నా తను ఎంత అందంగత్తో చూపించుకోవాలనే ఆరాటం కనిపించింది. నిజమే. అమ్మ మంచి పని చేసింది. ఇప్పుడు మీరా అక్కడకు వెళ్ళటం నాకూ ఇష్టం లేదు. చక్రవర్తి మీరాను ఇప్పుడే చూడ్డం అస్సలు ఇష్టం లేదు. అందుకే -

"పొద్దున్నుంచీ చలాకీ రాణిలా తిరిగి తిరిగి కాస్త అలసినట్లు కనిపిస్తున్నావు మీరా. అదీ కాకుండా ఆ మొహం చూడు ఎలా వాడిపోయిందో కాసేపు నిద్రపో. ఉదయానికల్లా అప్పుడే వికసించిన గులాబీలా కనిపిస్తావు." అన్నాను.

నాకు తెలుసు, మీరా పట్ల ఆ మాటలు నాగస్వరాలని. అందం విషయంలో ఏమాత్రం అశ్రద్ధ చెయ్యదు. రాజీ పడదు. బద్ధకించదు. తెల్లవారు ఝామున మూడు గంటలకే అమ్మ మా ఇద్దరినీ లేపింది. ఇహ అప్పటినుండీ తల స్నానం చేయించటం, అలకరణా, గౌరీ పూజా అంటూ ఒకటే హడావిడి. మీరా వీడియోలో తను ప్రత్యేకంగా కనిపించాలని, నాకంటే మంచి అలంకరణ చేసుకుంది. చీర కూడా నా చీరకంటే తనదేబావుంది. ట్రెడిషనల్ అంటూ నాకు ఎర్రంచు తెల్ల కంచిపట్టు జరీ బుటాలని కట్టారు. నిండుగా బుటా, జరీ అంచూ ఉన్న జాకెట్ ధరించాను.

ముత్యాలు కెంపులు కలిపి చేసిన నగలు పెట్టుకున్నాను. అత్తయ్యలు మల్లెలూ, కనకాంబరాలూ కలిపి తయారు చేసిన పూలజడ నా పెద్ద వాలుజడకు దారపు ముడులు వేసి బిగించారు. పిన్ని మేచ్ అవుతుందని తన రవ్వల నక్లెస్ కంతానికి మేచ్ అవుతుందని తన రవ్వల నక్లెస్ నా కంతానికి అమర్చింది. నేను నవ్వాను. "థేంక్స్" - అన్నట్లుగా.

"నీ నవ్వు చాలా బావుంటుంది జాహ్నవి. పున్నమి రోజున సడిలేని అర్ధరాత్రి ఆకాశం మధ్యలో చంద్రుణ్ణి ఎప్పుడైనా చూసావా?" - పిన్ని అడిగింది.

"లేదే!"

"రేపు రాత్రి చక్రవర్తి నాలాగే అడుగుతాడు. అప్పుడు ఇలానే 'లేదే' అంటావు. అప్పుడతగాడేమంటాడో తెలుసా?"

నా వంటిని అలంకరించబడిన పెళ్ళి పట్టుచీర ఇప్పటికే చక్రవర్తిని గుర్తు చేస్తూ - అతనితో కలిసి జీవించబోయే నా మధుర జీవితాన్ని తలపింప చేస్తోంది. కవ్విస్తోంది. మురిపిస్తోంది.

ఇప్పుడు పిన్ని మాటలు నన్ను మైమరిపిస్తున్నాయి.

పిన్ని మరల - "ఆకాశంలో నడిరేయి ప్రకాశించే పున్నమి వెన్నెలలా ఉంటుంది నీ నవ్వు జాహ్నవీ." - అంటాడు"". అంది.

"థాంక్సు పిన్నీ నీ కామెంటుకి" - అని పూర్తి అలంకరణతో అద్దం ముందు నిలబడ్డాను. 'నిజంగానా?' - మనసులో అనుకున్నా అప్పుడే గదిలోకి వచ్చిన అమ్మ - "చాలా బావున్నావు. నా దిష్టే తగిలేలా ఉంది మీరా" - అంది.

ప్రాణం చివుక్కు మంది. తలెత్తి అద్దంలోంచి చూస్తే అమ్మ వెనక 'మీరా'

"నేను మీరాని కానమ్మా జాహ్నవిని." అన్నాను.

"సారీ బుజ్జీ అద్దంలో నిన్ను చూస్తూ ఉన్నప్పుడే మీరా కూడా కనిపించింది అప్పుడే లోపలికి వస్తూ." - అమ్మ సంజాయిషీ

నేను వెనుతిరిగి మీరాను చూసాను.

కనకాంబరం రంగు పట్టు కంచి పట్టు చీర. నిండా ముద్దగా బంగారు రంగు వర్క్. కళ్ళు చెదిరిపోయాయి.

"కనీసం నా పెళ్ళిరోజునైనా నాకు పోటీ రాకుండా ఉండవచ్చుగా మీరా. అయినా నీతో నాకు పోటీ ఏంటి పరిహాసం

కాక. నాలాంటి అక్కలకు నీలాంటి అందాల చెళ్ళెళ్ళు పుట్టకూడదు మీరా అందం అందంతో మాత్రమే  పోటీ పడాలి. అంతే కానీ -" మరి ఆలోచించనీయకుండా, అత్తయ్య వచ్చి -

"జాహ్నవీ రామ్మా. పురోహితులు పెళ్ళి కుమార్తెను తీసుకురండి - అంటున్నారు"  - అన్నారు.

"నేను తీసుకు వస్తాను అత్తా" - అంది మీరా వీడియోకి ఫోజు ఇస్తూ.

"గౌరీ పూజ చేయించాలి మీరా. మేం తీసుకు వెళ్తాం" అన్నారు అత్తలు

గౌరీ పూజ అనంతరం.. నన్ను తీసుకు పెళ్ళి పీటల మీద కూర్చోపెట్టారు. "కాస్త తల వంచుకో జాహ్నవీ." - పిన్ని చెవిలో గుసగుసలాడింది. నాకు తెలియకుండానే నా కళ్ళు చక్రవర్తి చక్రవర్తి వైపు పరిగెడుతున్నాయి మరి. పిన్ని మాటలతో సిగ్గుపడి గబాల్న తలవంచుకున్నాను.

బెల్లం జీలకర్ర కలిపిన ముద్దను అతని బంగారు చేతితో నా తలమీద పెట్టి ఆన్చినప్పుడు - అతని ప్రథమ స్పర్శ. ఒక్కసారిగా నా తనువు పులకించిపోయింది. అతనో పూలవర్షం. ఓ మధురభావం. ఆ భావానుభూతిలో అమ్మా, నాన్నా, అమ్మమ్మా,మీరా, అత్తయ్యలూ, పిన్ని, స్నేహితులూ అంతా ప్రక్కకి తొలిగిపోయారు.

ఆకాశాన్నీ, భూమినీ కలిపే వెలుతురులా... ఒక్క చక్రవర్తి , నా పంచేంద్రియాలకు ఇంద్రుడు చంద్రుడు. ప్రాణవాయువు. ఎలా ఎలా ఇన్ని భావనలు నాలో, ఈ మామిడి తోరణాలూ, పచ్చని పందిరీ, షామియానాలూ, పూలవాసనలూ, బాజాభజంత్రీలూ - బంధుమిత్రుల హాస్యాలూ, పట్టుచీరల గరగరలూ, పిల్లల పరుగులూ, - ఇవన్నీ కలగలసి, నా మనసున కాబోయే భర్తపై ఎన్నెన్నో మధుర భావాలు కలిగిస్తున్నాయి. ఓ నవతేజం నాలో. నిన్నటి వరకూ గడిచిన సాధారణ జీవితాన్నుండీ మళ్ళిస్తూ - ఇప్పుడు ఈ ప్రథమ స్పర్శ, తన కరకమలం సోకి-

"లాహిరి లాహిరి లాహిరిలో

ఓహో జగమే ఊగెనుగా" - నిజమే మరి కాసేపటిలో తాళికట్టి సొంతం చేసుకోబోతున్న చక్రవర్తి కాదు.. కాదు శ్రీమాన్ శ్యామ సుందర చక్రవర్తిగార్ని తలచుకుని నా మనసు ఊయల లూగుతోంది, తీయని ఊహలతో.

ఎందుకు పెళ్ళంటే ఇంత హడావిడి అనుకునేదాన్ని.

కానీ ఈ అనుభవం చెపుతోంది నూరేళ్ళ పంట వంటి పెళ్ళికి ఇంత శుభకరంగా ప్రారంభం జరగాలని. ఆలోచనల మధ్య మూడుముళ్ళబంధంతో అతని అర్ధాంగినైపోయాను.

ఏదో ఓ నూతనోత్సాహం... ఏమిటీ మీరా అంటే? ఆఫ్టరాల్ మీరా. బోడి అందం గాడిద గుడ్డు కలెక్టరు భార్య హోదా. ఏవీ నా భర్త చక్రవర్తికి సాటి వస్తాయా?

పురోహితులుగారు "అమ్మా, అమ్మాయిని లేపి అబ్బాయి ప్రక్కన కూర్చోపెట్టండి" - అంటున్నారు.

'ఇంతవరకూ ఎదురు ఎదురుగా, ఇప్పుడు ఇహ మీదట ఒకరిలో ఒకరిగా' అనుకుంటూ లేచి అతని ప్రక్కన కూర్చున్నాను.

ఇన్ని మధుర ఊహలలోనూ నేను ఓక్కటి మర్చిపోలేదు. అది మీరా.

ఏది మీరా?

తలెత్తి చుట్టూ చూశాను.

పెళ్ళి పందిరి రాటకు ఆనుకుని ఉంది. ఎలా జాహ్నవీ? ఎలా? ఎలా ఉంది మీరా? మనసు ఆత్రంగా అడుగుతోంది.

శిలలా నిల్చుండి పోయింది మీరా. ఆశ్చర్యం ఘనీభవించి శిలైనిలిచినట్లుంది మీరా. విచిత్రంగా చూస్తోంది.

కదలక .. మెదలకా.. ఒక్క ఉలుకూ.. మరో పలుకూ రానట్లూ, పోయినట్లూ ఉన్న మీరాని చూస్తే జాలేసింది.

ఎంతైనా అది నా చెల్లెలు.

"రా" - అంటూ దగ్గరకు పిలిచి, తల నిమురుతూ "కలెక్టరు సాయిరామ్ కూడా నా భర్త చక్రవర్తి అంత అందంగానూ ఉంటాడులే." అని చెప్పాలనిపిస్తోంది.

'ఎవరా అమ్మాయి?" - చాలా చిన్నగా నాప్రక్కనే వినిపించి చూస్తే - చక్రవర్తి.

పెళ్ళి పీటల మీద నా భర్త నాతో మాట్లాడిన మొదటి మాట అది.

"నా చెల్లెలు మీరా." అసంకల్పితంగా చెప్పాను.

బంధువులంతా లైనుగా వచ్చి అక్షతలు మా శిరస్సుపై చల్లి గ్రీట్ చేసి గిఫ్టులు ఇస్తున్నారు.

కంగ్రాట్స్. విష్ యూ హేపీ మేరీడ్ లైఫ్ లాంటి విషెస్‌తో కరచాలనాలు.

మరీ దగ్గర వాళ్ళు, పెద్దమ్మా.. పెద్ద వదినా వరుస వాళ్ళు

"అదృష్టవంతురాలివే జాహ్నవీ. మంచి అందగాడే భర్త అయ్యాడు. లక్కీ అనేసారు. కానీ వాళ్ళ కళ్ళల్లో - 'నువ్వతనికి తగవు సుమా' అనే భావం మెరుపులా, నల్ల మేఘంలా వాళ్ళ ముఖాలపై ఆవరించి మాయమయ్యేది.

"మీరా అయితే ఈడూ జోడు బావుండేది." - నా వెనుకనే ఎవరో. నాకు వినిపించాలనా? ఆ వినిపించదులే అనా?

ఏమైనా ఓ ముల్లు గుండెలో గుచ్చుకుంది - 'ఇహ ఇప్పటి ఉండీ మా ఇద్దరినీ చూసిన వాళ్ళు ఇలానే అంటారా? ఇదేమిటి ఊహలు తీరకముందే ఇవేం అపశకునపు మాట్లు?

సాయ్‌రాం గిఫ్టుగా ఇచ్చిన బుద్ధుడు కళ్ళముందు కదులు తున్నాడు.

"ఏ పార్వతీ పరమేశ్వరులో, విష్ణుమూర్తీ లక్ష్మీ దేవిల విగ్రహాలు ఇవ్వచ్చుగా" అన్న అమ్మమ్మ మాట్లు గుర్తుకు వస్తున్నాయి. అలానే -

"ఆ అమ్మాయి ఎవరు?" అన్న చక్రవర్తి మొదటి మాటలో ఏదో ఏదో తెలియని గుబులు. ఈ బంధువుల మాటలు చక్రవర్తికీ వినిపించి ఉంటాయిగా! ఏమనుకుంటూ ఉండవచ్చు?

భగవంతుడా ఏమిటిది?

మధ్యాహ్నం వరకూ పెళ్ళి హడావిడితో సరిపోయింది. అక్క పెళ్ళిలో ఎంతో సంతోషంగా, హుషారుగా, అంతా తానై పనులన్నీ చేస్తానన్న మీరా ఎందుకో సడన్‌గా డల్ అయింది.

మా పెళ్ళి అయిన తర్వాత విందు భోజనం ముగించుకుని, మీరాకు కాబోయే అత్తా - మామా ఊరెళ్ళిపోయారు.

వెళుతూ.. వెళుతూ నన్నూ, చక్రవర్తినీ వాళ్ళింటికి తప్పక రావాలని మరీ మరీ చెప్పి వెళ్ళారు. వాళ్ళ కాబోయే కోడలు బంగారు బొమ్మలా ఉందని మురిసిపోయారు.

అమ్మ నా దగ్గరకు వచ్చి, సాయింత్రం బంతాటా అదీ ఉంటుంది, ఓ గంట ఇప్పుడు నిద్రపొమ్మని చెప్పింది.

నేను అమ్మ ముఖం వైపు చూసాను.

తృప్తిగా.. రిలీఫ్‌గా ఉంది. జాక్‌పాట్ తగిలినప్పుడు కలిగే ఆనందం లాంటి ఆనందం లీలగా గోచరించింది ఆ ముఖంలో. ఒక అల్లుడు అందగాడు. మరో అతను కలెక్టరు కదా మరి. అమ్మ నేను మంచం మీద పడుకున్న తర్వాత, నాముంగరులు సవరించింది ప్రేమగా. నా మెడలో మంగళసూత్రాలని  తన చేతిలోకితీసుకుని, "కంసాలి చాలా బాగా చేసాడు.కళకళలాడుతూ బావున్నాయి." - అంది మెచ్చుకోలుగా.

"అమ్మకి నా మీదా ప్రేముంది. ఎటొచ్చీ పెళ్ళి చేయటానికి కష్టపడాలనుకుని కసురుకునేదంతే" అనుకుంటే మనసుకి హాయిగా ఉంది.

"సరే బాబూ, కొద్దిసేపు నిద్రపో. మీరా కూడా పడుకుంది. బాగా తలనొప్పి వచ్చిందంట. బాగా దిష్టి తగిలి ఉంటుంది." - అంది.

యధాలాపంగానే అమ్మ చెప్పి ఉండొచ్చు. ఎటొచ్చీ నాకే మీరా గురించి వింటానికే అనీజీగా, అభ్యాంతరంగా ఉంటోంది.

అయినా ఇంకెంత? ఓ రెండు రోజులు. ఆ తర్వాత చక్రవర్తితో తన ఇంటికి. ఈ మాటే చిత్రంగా.. త్రిల్లింగ్‌గా ఉంది.

మా ఇంటి నుండి నా ఇంటికి. చక్రవర్తీ - నేను ఒక్కటిగా చెప్పవలసి వచ్చినపుడు 'మా ఇల్లు', - ఎంత తియ్యగా, మధురంగా ఉంది. ఈ భావన.

సాయంత్రం తీరా నన్ను అత్తయ్యలూ, పిన్ని ఎదురుకోళ్ళు ఆటకు సిద్దం చేస్తుంటే, తెలిసింది. ఈ వినోదానికి చక్రవర్తి సిద్ధంగా లేరట. ఆయనకు ఇలాంటివి నచ్చదట!

'ఇదేం చాదస్తమే నా తల్లీ! నేనెక్కడావిన్లేదు!" - అమ్మమ్మ బుగ్గలు నొక్కుకుంది. పిన్ని, అమ్మమ్మను కళ్ళతో హెచ్చరించింది. 'జాహ్నవి వింటోంది' అన్నట్లు. నాలో చాలా ఆలోచనలు. చక్రవర్తి ఎందుకు వద్దంటున్నారు? బంధువుల కామెంట్స్ మీరా అందం ఇందుకు కారణము కాదు కదా?

మీరా.. మీరా.. మీరా. ఈ మీరా ఎక్కడ దొరికింది నా ప్రాణానికి. చిన్ననాటి నుండీ ప్రతి విషయంలోనూ నాకు అడ్డంగానూ, పోటీగానూ వస్తోంది. అన్నింటా అలిగో, మొరిగో, కరిచో, ఏడ్చో నా నుండి లాక్కుంటూనే ఉంది. అదంతా సరే అప్పటికి బాధనిపించినా, జీవితం మీద పెద్ద ప్రభావాన్ని చూపించవు. సర్దుకుపోయాను. కానీ ఇప్పుడు? నేను ఎక్కువ ఆలోచిస్తున్నానేమో. మీరా నా చెల్లెలే కదా ఆ... ఏమవుతుందిలే. బావున్నాడు. బావున్నాడని ఓ పదిసార్లు చూడొచ్చు. ఆ కలక్టరు సాయిరామ్‌తో పెళ్ళి అయిపోతే - మీరా కళ్ళకు చక్రవర్తి అందం కనిపిస్తుందా? ఆ హోదా, దర్జాలకు మరిగి, ఎప్పుడైనా ఇంటికి వెళ్ళి పలకరించబోయినా - టైములేదు బావగారూ. చీఫ్ గెస్టుగా వెళుతున్నాను. సారీ. పనివాళ్ళం మీకేం కావాలో చూస్తారు. రెస్ట్ తీసుకోండి. వస్తాన్లే." - అని వెళ్ళిపోతుంది. ఈ ఆలోచన చాలా బావుంది సాకు. రాత్రికి ఆ ముచ్చటైనా ఉందా?" అత్తయ్యలు అడిగారు.

"అదెందుకు వద్దంటాడు? ఎప్పుడెప్పుడురాత్రి అవుతుందాని ఎదురు చూస్తాడు కానీ." - ముసి ముసిగా నవ్వుతూ పిన్ని అంది.

"ఇంకేం జాహ్నవీ హాయిగా కూర్చుని కలలు కను. మాకు పనుంది. గదిని అలంకరించాలి. ఏ పువ్వులంటే ఇష్టమో మరి మీ ఆయనకు." అని ఒకరంటే, చక్కర చిలుకలూ, పూతరేకులూ, మిఠాయిలూ, బాదుషా, జాంగ్రీ, కాజాలూ

సరిపోతాయామ్మా, ఇంకా ఏమైనా గులాబ్‌జాములు లాంటివి కావాలా?"

అవన్నీ జాహ్నవికేం కనిపిస్తాయి. తేనె తొనల్లా భర్త పెదవులు -" నేను గబాల్న చెవులు మూసేసుకుని -

"అమ్మ తల్లులారా నన్నొదిలేయండి ప్లీజ్" - అన్నాను.

"మేం వదిలేస్తాం కానీ మొగుణ్ణి గట్టిగా పట్టుకో." నవ్వుకుంటూ ఒంటరిగా నన్ను గదిలో వదిలేసి బయటకు వెళ్ళిపోయారు.

మనసంతా అయోమయంగా, గందరగోళంగా ఉంది.

ఎందుకో పెళ్ళైయిందన్న ఆనందమే లేదు. అంతా సక్రమంగా జరుగుతున్నట్లే ఉంది. కానీ ఏదో లోటు. అది నా వైపు నుండీ కాదు. చక్రవర్తి వైపు నుండి. పెళ్ళి మొదలు భోజనాల వరకూ పక్క పక్కనే ఉన్నాము. అంటే నాలుగు గంటలు.

"ఎవరా అమ్మాయి?" - ఆ ఒక్కమాటతప్ప, ఓర చూపులూ, తాకీ తాకనట్లు స్పర్శించటాలూ ఏమీలేవు. రాత్రికైనా...!

మెత్తని పాల నురుగు వంటి తెల్లని మైసూర్ సిల్క్‌చీర. వెండి హంసల అంచు. ముత్యాలసెట్. తలలో సన్నజాజుల మాల.

కునేగా మరక్లం పరిమళం లోనా బయటా. తడబడే మనసుతొ గదిలో ప్రవేసించాను. వెనుక తలుపు మూసిన శబ్దం. కళ్ళెత్తి అర్ధనిమీల నేత్రినిలా చూడబోయి, సిగ్గె.. ఆగిపోయాను అతని కోసం.

క్షణాలు, నిమిషాలు, పావుగంట, అర్ధగంట. అనుమానమొచ్చి తలెత్తి చూసాను. నా భర్త శ్రీమాన్ చక్రవర్తిగారు. కనిపించలేదు. నేను గబగబా ముందుకు మంచం వైపు నడిచాను.

తనింకా గదిలోకి రాకుండానే, నన్ను గదిలోకి పంపితలుపు వేసి పొరపాటు పడ్డారా ముత్తైదువలు?

అలా ఎలా జరుగుతుంది? కాదే నాకేదో అనుమానం. గది అంతా చూసాను. నా గది పెద్దగా ఉంటుంది. ఎల్ షేప్‌లో ఉంటుంది. మొదటి వైపు మంచు అద్దం వగైరా ఉంటే రెండో చివర కంప్యూటర్ టేబుల్ కుర్చీ, కాస్త ఎడంగా పడక కుర్చీ ఉంటుంది. రెంటికీ - అడ్డంగా కర్టెన్ అమర్చబడి ఉంటుంది. కాస్త పలచగా ఉంటుందా కర్టెన్ నేనా తెరలో నుండీ కళ్ళను గుచ్చి చూసి... షాక్ అయ్యాను. చక్రవర్తి వాలు కుర్చీలో పడుకుని ఉన్నాడు కళ్ళు మూసుకుని. అసహనం, నిస్సహాయితా, కోపం, అవమానం, ఉక్రోషం అన్నీ కలిపి ఆ క్షణాన నేనయ్యాను.

ఎప్పుడో చదివిన వాక్యాలు -

"పెళ్ళి సిగరెట్‌లా మనిషిని నాశనం చేస్తుంది.

సిగరెట్టు కన్నా దాని ఖర్చూ ఖరీదు ఎక్కువ, అంతే." నా లాంటి వాళ్ళకోసమేనా ఈ కొటేషన్? అర్ధమైపోయింది అతని అభిప్రాయం. బ్రతిమాలటం లాంటి నాన్‌సెన్స్ డ్రామాలు, వేడికోలు వంటి పతివ్రతా వేషాలను ప్రక్కన పెట్టేసి, మంచం ప్రక్కనే ఉన్న టీపాయి మీద పళ్ళు తీసుకుని మంచం మీద కూర్చుని తినేసాను. ఆకలి కాదు కసి. నా జీవితంలో ప్రతి మలుపులోనూ నాకు నిరాశే ఎదురయ్యింది. ఇహ మరే మలుపులూ లేవు. ఇక నా జీవనబాటను నేనే వేసుకోవాలి. ఆ పట్టుదలతోనే, ఆ కసితోనే ఈ తినటం.

పాలు తాగుదామనుకునీ, మరేదో గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాను. ధరించిన నగలు తీసి, ప్రక్కన పెటి,

గదికి గడియ పెట్టి, లైటు తీస్తూ -

"మిస్టర్ చక్రవర్తీ మీకేమైనా దిండుకావాలా?" అని అడిగాను. ఎంతైనా మా ఇంటి గెస్టు కదా! అటునుంచీ నిశ్శబ్ధం తప్ప మాటరాలేదు. 'అతని ఖర్మ. నాకేం పోయింది,' - అనుకుని నేను లైటాఫ్ చేసి... నా మంచం మీద పడుకున్నాను. ఎప్పుడో విన్న పాట గుర్తుకొస్తోంది.

తొలినాటి రేయి తడబాటు పడుతూ

మెల మెల్లగా నీవు రాగా,

నాలోని వగలూ, నాలోని సొగసూ -" నా పెదవిపై విరక్తి లాంటి నవ్వు. దేనికైనా ప్రాప్తముండాలిగా? పూర్వజన్మలో చాలా పాపం చేసి ఉంటాను చాలా మందిని బాధపెట్టి ఉంటాను. కాకపోతే ఈ నిరాశలేమిటో నాకు అడుగడుగునా?

## అయిదవ భాగం

*"వేయి ముద్దుల కోసం ప్రార్థించాను."*

*లక్ష మమతల కోసం ఆశపడ్డాను. కానీ ఏమైంది?*

*"నా తీవ్ర కాంక్షలన్నీ నా గుండెలోకి ఉపహరించుకుంటున్నాయి.*

*నన్ను కలత పెట్టేది, నేను పోగొట్టు కున్నదీ ఎప్పటికీ నాదే"*

ఎన్ని కన్నీళ్ళు నా చెక్కిలిని నిమిరాయో నేను లెక్కించ లేను. ఎన్ని గంటల యాతన అనంతరం, ఏ ఝాముున నిద్రించానో తెలియదు. అసలు అది నిద్రేనా? కాదేమో.. సొమ్మసిల్లాను. యవ్వనంలో ఉన్నాను. అతను గదిలోనే ఉన్నాడు. అయితే ఏం లాభం? అతను సముద్రమయ్యాడు. నా దాహం తీరదు. నిరాశలో అలసి మనసు మూర్ఛిల్లినట్లుంది. అంతే తప్ప అది నిద్రమాత్రం కాదు. అవమానం రుచి చూపిన చీకటి దుప్పటి క్రింద మనసు మూర్ఛిల్లింది.

తిరిగి నాకు మెలుకువ వచ్చి కళ్ళు తెరిచేసరికి.. అంతా అయోమయం! ఏమైంది నాకు. ఈ పూల పందిరి మంచంపై నేనేమిటి???

'ఇదిగో జాహ్నవీ నిన్న నీకు పెళ్ళైంది. రాత్రి నీ ఫస్ట్‌నైట్. నీకేం కాలేదనుకో.' - మనసు చెప్తోంది.

'అవును కదా?!' - నేను గభాల్న లేచి మంచం మధ్య బాసింపీట వేసుకుని కూర్చుని గదంతా కలియ జూసాను.

ఊహూ... ఎవ్వరూ లేరు. గది అంతటికీ నేనొక్కర్తినే ఉన్నాను. అతను... అదే తాళికట్టి ఆగిన భర్త ఏమయ్యాడు? అవునూ? మెళ్ళో తాళికడితే భర్త అవుతాడా? లేక శారీరకంగా కలిస్తేనే భర్త అవుతాడా? ఏమోమరి. తెలియటం లేదు. పోతే పోనీ అసలు ఏమయ్యాడు ఇతగాడు? నేను, రాత్రి అతను పడుకున్న కుర్చీ వేపు కర్టెన్ నుండీ మళ్ళీ చూసాను గుచ్చి.. గుచ్చి.

కుర్చీ ఖాళీగా ఉంది. ఏ నడిరాత్రి దాటాక కానీ ఆలోచనలలో అలసి నేను సొమ్మసిల్లిన అదును చూసి పారిపోలేదు కదా? లేదూ బయట మరోగదిలో పడుకున్నాడా?

నేను తలుపు వైపు చూసాను. లోపలికి గడియవేసే ఉంది. నెమ్మదిగా కదిలి మంచం దిగాను. అలవాటుగా నా ఎడమచేత్తో నా జుత్తును సవరించుకోబోతే –

నిన్న రాత్రి జడలో అమ్మ పెట్టిన పెద్ద సన్నజాజుల మాల చేతికి తగిలింది. పాపం సన్నజాజిపూలు! ఎంత నిరాశ చెంది ఉంటాయో, ఏమో! పూసిన ప్రతిపూవూ తాము దేవుని పాదాల చెంతనో, లేక ప్రేమ తాలూకూ వత్తిడికో నలిగి పోవాలని కోరుకుంటాయట! పాపం పూలమాల చేతిలోకి తీసుకున్నాను. నిరాశతో ఆత్మహత్య చేసుకున్నట్లు పసుపురంగులోకి మారిపోయి ఉన్నాయి. వాటిని చూస్తుంటే జాలివేసింది. ఏం చెయ్యను? నా తప్పేంలేదు కదా? ‘సారీ సన్నజాజులూ‘ – అనుకుని ఆ దండను టేబుల్ మీద పెట్టి – నా గది తాలూకూ ఎటాచ్ బాత్‌రూం దగ్గరకు వెళ్ళి, తలుపు మీద చెయ్యి వేసాను

భళ్ళున తెరచుకుంది.

నేను కాదు. చక్రవర్తి. అప్పుడే స్నానంచేసి నట్లున్నాడు. బంగారు రంగులో విలీనమైన గులాబీ వర్ణం. అతని మేనిచ్ఛాయ అయితే.. ఆ మేనిపై తెల్లటి నీటి బిందువులు,.గులాబీ రంగు ముత్యాల్లా మెరుస్తున్నాయి. తనని అక్కడ అలా – షాకయ్యాను. ఆ అందం చూసి షేకయ్యాను. సవ్యంగా శుభప్రదంగా జరిగి ఉంటే? మొదటి రాత్రి అద్భుతమయిన అనుభవాలు కలిగి, మామధ్య ఎడం కరిగి, ఆ అనుబంధపు బంధంలో ఇద్దరం ఒక్కటైపోయి ఉంటే – ఇలా అతని ఛాతీమీద నీటి ముత్యాలను చూసి.. మనసు చలిస్తే – అతను గ్రహించి, చిలిపిగా కవ్వింపుగా చూసి – నీ పెదవుల అల్చిప్పలలో బంధించవూ... రా... అంటూ చేతులు – ‘వద్దు జాహ్నవీ. వద్దు.

రాని చోట.. లేనిచోట యాచకురాలివి కావద్దు. ఊహగానైనా సరే. నీ వ్యక్తిత్వాన్ని నీవే గాయపరచుకోకు. ఎస్. నిజం నిజం నేను తలెత్తి అతన్ని చూస్తూ.. పక్కకు జరుగుతూ భయపడ్డాను. మొట్టమొదటి సారి, రెండవ మగవాని ముందు భయపడటం. మొదటి వ్యక్తి నా తండ్రి. ఎంత రౌద్రంగా చూడగలడితను?! అసంకల్పితంగా మరింత వెనక్కు జరిగాను. అతను పరమ అత్యంత అసహ్యంగా నన్ను చూసి, దాటి వెళ్ళిపోయాడు.

అతని చూపు నన్ను గాయపరచింది. ఉక్రోషం వచ్చింది. నేనేదో తప్పు చేసినట్లు... ఆ చూపేంటీ? హూ ఈజ్ హీ?

ఎవరితను? మగవాడే కదా? అందునా భారతదేశపు మగమహారాజు. అయిఉండీ.. స్వేచ్ఛలేనట్లు.. ఎందుకు నా మెడలో మూడుముళ్ళు వేసాడు?

నేను చిత్రించుకున్న పెళ్ళి అనే అందమైన చిత్రపటాన్ని ఛిద్రం చేసే అధికారం ఎవరిచ్చారితనికి? అసలు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నట్లు? నా జీవితంతో ఆటలాడే హక్కు ఎవరిచ్చారు? ఏం చేస్తున్నానో తెలియని ఆవేశంలో..

అయోమయంలో అతని దగ్గరకు వడివడిగా వెళ్ళి, అతని ఎదురుగా నిలిచి - "ఇష్టం లేదా ఈ పెళ్ళి?" - అడిగేసాను ధైర్యంగా. మొహమాటపడకుండా.

అతను మాట్లాడలేదు. సీరియస్‌గా టవల్‌తో తల రుద్దుకుంటున్నాడు. ఎంత నిర్లక్ష్యం మరెంత పొగరు! మా ఇంట్లో... అదీ నాగదిలోనే ఉండి!

"మిమ్మల్నే?" - రెట్టించాను.

అతను ఒక చీకటి చూపును నాపై విదిలించి -

"మా అమ్మ చెప్పింది. ఆమె మాట నాకు వేదం" నిర్లక్ష్యంగా చెప్పాడు.

"ఏం చెప్పిందావిడ? పెళ్ళి చేసుకో. కానీ దగ్గరకు వెళ్ళకు. అనా?" అడగటమైతే సూటిగా అడిగాను గానీ, లోలోన నాధైర్యానికి నేనే ఆశ్చర్యపోయాను.

(అరే! ఇంత ధైర్యమా నాలో ఇటువంటి రకమైన ఆలోచనలూ, మాటలూ నాకూ వస్తాయా?! పరిస్థితుల ప్రభావం అంటారే. అది ఇదేనా!) "అవును. అక్షరాలా అలాగే చెప్పింది. చేసాను. ఇంక ముందయినా సరే అమ్మ ఏం చెపితే అలానే చేస్తాను. కొడుగ్గా నా కర్తవ్యం అది. నువ్వే అడిగి మంచిపని చేసావు. ఎప్పుడు చెప్పాలి నీకు అనుకున్నాను." - అన్నాడు. నేను శిలనయ్యాను అతని మాటలకు. (ఎంత ధైర్యం నీకు! నా జీవితాన్ని నేను అనుభవించకుండా చేసే హక్కు నీకెవరిచ్చారు? నేనేమన్నా నీ చుట్టాన్నా. నీ అత్తకూతుర్నా కనీసం నీ విరోధి కూతుర్ని కూడా కాదే! అసలు ఆ చాదస్తపు పెళ్ళిచూపుల దురదృష్ట క్షణాలకు ముందు వరకూ, నువ్వెవరో కూడా నాకు తెలియదే! అలాంటి నా జీవితం... నా బ్రతుకు... నాకలలు... నా తీయని కోరికలూ - అన్నీ అన్నీ ఇలా.. ఇలా కేవలం ఒక నూలుతాడుతో ఉరి వేయటం ఎంత అన్యాయం!) ఇందులో ఒక్కమాట కూడా నేను పైకి అన్లేదు.

ఇంకా అలానే మూగశిలలా ఉన్న నన్ను చూస్తూ -

"మరోమాట. నువ్వు బావుండవు. నా కసహ్యం. నిన్ను చూస్తే నాకెలాంటి కోరికా కలగటం లేదు. అమ్మ చెప్పిందనే కాదు. నేనే నీకు దూరంగా ఉండాలనుకుంటున్నాను. ఎందుకంటే గొంగళిపురుగును గుండె మీద పెట్టుకోరు ఎవరూ."

చటుక్కున కసిగా నరకటానికి ఆయుధం అక్కర్లేదు. మాట చాలు.

ఎవరితను? పూర్వ జన్మ తాలూకూ శత్రువా? ఈ జన్మలోనూ నక్షత్రకుడిలా వెంటాడి వేధించటానికై ఈ పెళ్ళి తంతా? అసలు ఎందుకు నాపై ఇతని కింత కక్షా... పగా? నేనేం చేసాను? పెళ్ళి చూపులకు వచ్చినపుడు చూసుకుని నచ్చేననేగా చెప్పింది. ఇందులో ఎవరి బలవంతమైనా ఉందా? లేక... ఇతనిలో ఏదైనా లోపం ఉండి - ఆలోపాన్ని దాచుకోవడానికై ఈ డ్రామానా ఇదంతా? నాలో ఒక అనుమానం. చాలా చోట్ల విన్నదీ, కన్నదీనూ. ఇతని కథ కూడా అలాంటిదేనా? అనుమానమొచ్చి అడిగేశాను. "మీరు.. అదే నువ్వు సం..సా..రా...నికి పనికి వస్తా(వా)రా?" - అంతే ముఖం ఎత్తి అతన్ని సీరియస్‌గా చూస్తూ అడుగుతున్నానేమో ముఖం పగిలిపోయింది. అతని అరచేతి తాలూకూ దెబ్బకి.

ఒక్కసారిగా గది అంతా చీకటి కమ్మేసింది.

ఎక్కడో అగాధంలోకి నెట్టి వేస్తున్న.. పడిపోతున్నట్లు వణికిపోయాను. కొన్ని క్షణాలు నాకేమీ కనిపించలేదు. మబ్బులు కమ్మేసినట్లు - చివరికి నాకు నేను ఉన్నానో.. లేదో?

అతన్ని చూస్తుంటే భయమేస్తోంది. పారిపోవాలనేది బలమైన కెరటమైంది. కాళ్ళు నేలలోకి కూరుకు పోయినట్లో అతుక్కుపోయినట్లుగా ఉండి కదలలేకపోతున్నాను .

అసలు ఇది ఏ అవస్థో కూడా నాకు తెలియటం లేదు. ఒక్కటి మాత్రం తెలుస్తోంది. అది అతను ప్రళయకాల రుద్రునిలా ఎఱ్ఱని ముఖంతో జ్వలిస్తున్న మంటలా ఊగిపోతున్నాడు. వద్దు. వద్దు నాకీ పెళ్ళి వద్దు. ఈ మొగుడు వద్దు. అసలీ ఆడబ్రతుకే వద్దు. నిన్నటిదాకా కాలేజ్ పిల్లను. రాగాల కన్నెను. అంతలోనే మాయ కమ్మేసినట్లు ఏమిటీ అవస్థ? నాలోని ఈ ఆలోచనలు అతని కెదురుగా నా ముఖం పైకి రావటానికి కూడా భయపడుతున్నాయి. గదిలో గాలి స్తంభించి పోయింది. నిప్పులు చెరిగే చూపులతో, కాదు.. కాదు. అతనే ఓ అగ్ని గుండమై... ఆ అగ్ని గుండం కాస్తా అతని చేయిగా మారి, నా వైపు బాణంలా సాగి చటుక్కున నా జుత్తు పట్టుకున్నాడు. అతని బలమైన.. అందమైన.. కఠినమైన గుప్పెట్లో నా జుత్తు విలవిలలాడుతూ విలపిస్తోంది.

నల్లని పొడవైన నా కురులు, పట్టులాంటి నా జుత్తు - విప్పితే మేఘాల దొంతర ముడివేస్తే స్వప్నాల ఆతుర..., అంటూ కాలేజీ అబ్బాయిల చేత కవిత్వం చెప్పించిన నా జడ నిస్సహాయంగా ఈ దుర్మార్గపు భర్త చేతిలో మూర్ఛపోయింది.

స్వప్నాలు విరిగి నేలకు జారినట్లు - జడపాయలలో చిక్కుకున్న జాజిపూలు కొన్ని నేలను తాకాయి.

"నేను సంసారానికి పనికి వస్తానో.. కాదో, నీకు తెలియాలా? మీరాను పంపు. చూపిస్తాను. ఆ తర్వాత అడుగు. నీకు చెపుతుంది."

అందమయినవి అందమయిన వాటినే ఆశిస్తాయా?! ఇతను మీరాని కోరుకుంటున్నాడా? ఇది కోరికా? మోహమా? లేదూ వీటన్నింటికన్నా శక్తివంతమైన ప్రేమా???? కూలిపోయాను. కుప్పకూలాను. శూన్యమయ్యాను. ఆశ్చర్యపోయాను. విస్తుపోయాను! ఎంత అహంకారం? ఏమి పొగరూ ఆ గొంతులో?! మరెంత కాఠిన్యత! సిగ్గులేకుండా, మర్యాదలేకుండా, ఇంత సంస్కారహీనంగా ఎలా చెప్పగలిగాడు? అదీ తాళికట్టిన భార్య (?)తో ... ఆమె చెల్లెలి గురించి ఇలా ఇంత అసభ్యంగా ఎలా మాట్లాడగలిగాడు? పాపం! మీరా వింటే ఎంత క్షోభ చెందుతుంది. ఛీ! అందగాడని మురిసిపోయినంత సేపు పట్టలేదు, ఈ మేడిపండు మనసులోని మాలిన్యం. సౌందర్యహీనత తెలియటానికి. "ఏమిటీ? ఉన్నావా? చచ్చావా?" - అతను నాజుట్టు బిగించి, నా తలను ఊపేస్తూ అడుగుతున్నాడు.

నొప్పిగా ఉంది. బాధగా ఉంది. నా జుత్తు.. నా వెంట్రుకలు ఊడిపోతాయేమో. తెగిపోతాయేమో.. కాదు.... కాదు ఇతని కర్కశహస్తాల మధ్య నా మెడవిరిగి నేను చచ్చిపోను కదా? ఇందుకా?! ఇటువంటి విధమైన చావుకోసమా ఈ పెళ్ళి పండగ తంతు?! నో.... గబాల్న నా రెండు చేతులతో అతన్ని బలంగా వెనక్కి నెట్టేసాను.

అనుకోని సంఘటన అతనికి. అతను వెనక్కి తూలుతూ నా జుట్టు వదిలేసాడు.

"ఛీ" - అనే ఒకే ఒక్క అక్షరాన్ని బల్లెంలా అతని పైకి విసిరి నేను విసురుగా స్నానపు గదిలోకి వెళ్ళి తలుపు వేసేసుకున్నాను. ఆవేశంతో నా గుండె ఎగిసెగిసి పడుతోంది.

అసహ్యంతో నా హృదయం కృంగి పోతోంది. నిస్త్రాణలా తలుపుకు చేరబడి, కళ్ళు మూసుకుని ఉండిపోయాను. అలా ఎంత సేపో?! మనసులోని దుఃఖం గట్టిపడుతోంది. బాధ శరీరమవుతోంది. ఎగిసెగిసి పడుతున్న గుండె సర్దుకుంటోంది నిరాశ చెంత. ఇదీ రిజల్ట్. పెళ్ళి గిఫ్ట్. ఎంత గొప్ప విలువైన కానుక ఇది.

"కలకానిదీ, విలువైనదీ

బ్రతుకూ కన్నీటి ధారలతోనే బలిచేయకూ-"

తలుపు తడుతున్న శబ్దం. నెమ్మదిగా కళ్ళు తెరిచాను. వికసించక ముందే వాడిపోయిన మొగ్గలా ఉంది నారూపం.... చూశాను ఎదుటి అద్దంలో. అసలే అంతంత మాత్రపు రూపు. ఈ సంఘటనతో మరింత వాడి, - వయసు పెరిగినట్లు కనిపిస్తున్నాను.

తలుపు చప్పుడు మరల మరల వినిపిస్తోంది.

ఉలిక్కి పడ్డాను. అతను కాదు కదా?

ఈ బాత్‌రూంలో నన్ను అంతం చేయాలనుకుంటున్నాడా?

రాత్రి ముత్తయిదువలు రకరకాల పండ్లూ, అవి కోసుకుంటానికై వెండి చాకు బెడ్ ప్రక్కన వెండి ప్లేటులో పెట్టారు.

ఆ వెండి చాకు ఇప్పుడు ఇందుకు పనికి వస్తోందా?

అయినా ఈ పెద్దలకు కాస్త ముందు చూపు ఉండొద్దూ.

'నవ వధువంటేనే పూలూ, కాయలూ, పరిమళాల కలయిక కదా? వరుడు పదునైన ఆయుధం' - అని తెలియదా? ఇంకా ఆ పళ్ళూ, చాకూ ఎందుకట? ఏమయినా.. పెద్దవాళ్ళ ముచ్చట నా ప్రాణం మీదకు వచ్చింది. బయట తలుపు మీద శబ్దం మరింత ఎక్కువైంది. ఎలా ???

## ఆరవ భాగం

పదే పదే వినిపిస్తున్న ఆ శబ్దం.

నన్ను భయపెడుతోంది. ఇప్పుడు ఈ తలుపు తీయమంటే నా చేతులతో నాకు నేనే మరణాన్ని స్వాగతించడమే. ఎలా? ఎవరు రక్షిస్తారు నన్ను???

"బుజ్జీ" అంటూ తలుపు మీద శబ్దం.

రిలీఫ్. చాలా. చాలా. అతను కాదు. ఆపద కాదు. ప్రేమ. ప్రేమ పిలుపు. మమకారపు చిరునామా అయిన అమ్మమ్మ గొంతు అది.

ఎంత ఆనందం!

అగాధంలోకి జారిపోతున్నామని తల్లడిల్లి పోతున్న వ్యక్తి జారి అమ్మ ఒడిలోకి చేరుకుంటే - కలిగేటంతటి అపూర్వమైన ఆనందం ఇప్పుడు నాలో.

నేను గభాల్న కదిలి తలుపు తీయబోయాను.

అద్దంలో నా ప్రతిబింబం - 'వద్దు. ముఖం ఎలా ఉందో చూసుకో', - అంటూ ఆపింది

అవును. ఇప్పుడు నా ముఖం చూస్తే అమ్మమ్మ అంతా గ్రహించేస్తుంది. ఏం చేయాలి?

అరక్షణం ఆలోచించి టాప్ ఆన్ చేసాను.

నీటి శబ్దం. అమ్మమ్మకి నా అలవాటు తెలుసు. మనసూ తెలుసు.

"తొందరగా స్నానం చేసిరా బుజ్జీ. నేను ఇక్కడే ఉంటాను." అంది.

నేను నెమ్మదిగా ప్రాతఃకాల కార్యక్రమాలన్నీ పూర్తి చేసి, తలారా స్నానం చేసి, రాడ్ నుండీ టవల్ తీసుకుంటూ గమనించాను. స్నానాంతరం వేసుకునే బట్టలు లేవు. నేను ఒళ్ళు తుడుచుకుని, అదే టవల్‌ని వంటికి చుట్టుకుని తలుపు తెరిచాను. తలుపు ఎదురుగా అమ్మమ్మ. ఆందోళనగా.

నేను గబాల్న అడిగాను. "ఏమైంది అమ్మమ్మా?"

"నాకు కాదు, నీకు ఏమైంది? ఎంతసేపు తలుపు తట్టాను? ఉలుకు లేదు. పలుకు లేదు. భయంతో ప్రాణం పోయిందనుకో." అంటూనే అర్ధనగ్ననైన నన్ను చూసి -

"ఉండు. తలుపు లోపలికి గడియ పెట్టి వస్తాను." - అంటూ గుమ్మం వైపు కదిలింది.

పూర్ అమ్మమ్మ. చాలా కంగారు పడి... భయపడీ ఉంటుంది.

"విశ్వసించడమన్నది నీరసమైంది
సందేహించడమన్నది గంభీరమైనది."

ఇప్పుడు ఈ క్షణంలో మాత్రం అమ్మమ్మ నీరసంగానూ, నేను గంభీరంగానూ ఉన్నాము. జీవితం ఎంత విచిత్రం!

నేను నెమ్మదిగా నా కబోడ్ దగ్గరకు వెళ్ళి, తెరిచి బట్టలు తీసుకోసాగాను.

"అయ్యయ్యో! తల శుభ్రంగా తుడుచుకోలేదటే! చూడు జుట్టు నుండీ నీళ్ళు ఎలా కారుతున్నాయో. నట్టింట అలా జుట్టు నీళ్ళు కారితే దరిద్రమంటారు." - అంటూ టవల్ తీసుకుని నా జుత్తు వత్తసాగింది.

నేను మౌనంగా బట్టలు ధరించటం పూర్తి చేసాను.

అమ్మమ్మ నన్ను పూర్తిగా తన వైపు తిప్పుకుని, నా మొహంలోకి చూస్తూ, ఆర్తిగా అడిగింది.

"రాత్రేమయింది. మీ ఇద్దరి మధ్యా గొడవ జరిగిందా?"

"అదేమిటి అమ్మమ్మా." - ఆశ్చర్యంగా అడిగాను.

"అతను ముభావంగా... టిఫిను చెయ్యకుండా, కనీసం కాఫీ అయినా తాగకుండా బయటకు వెళ్తేనూ"

"మీరా ఉందా?"

"అదేమిటి నేను అబ్బాయి గురించి మాట్లాడుతుంటే, నువ్వు మీరా అంటావేమిటి??"

అవును. నిజమే! నేను మీరా గురించి ఎందుకు అడిగాను? మెదడు గ్రహించలేని ఆలోచనలు మనసు గ్రహిస్తోందా? లేదూ మనసు అనవసరంగా ఎక్కువ ఊహిస్తోందా?

"మాట్లాడవేం బుజ్జీ? ఏం ఆలోచిస్తున్నావ్? 'ఈ అమ్మమ్మకు ఏ అబద్ధాన్ని నిజంలా చెప్పి నమ్మించాలా', అనా? "

ఏం చెప్పను నేను?

నిజం చెపితే ఎలా ఆదరిస్తారు నన్ను? అబద్ధం చెపితే ఎలా ఆనందిస్తారు వీళ్ళు అయినా ఇప్పుడు నేను ఆ ఇంటి పిల్లనయ్యాను కదా? ఇప్పుడు వీళ్ళు నా సమస్యను అర్ధం చేసుకుని, పరిష్కారం చూపిస్తారా? సాంప్రదాయ కుటుంబాల్లో ఉండే భయాలూ, పిరికితనాలూ, వెన్నెముక లేని తనాలూ మా ఇంట్లో అదే అమ్మావాళ్ళ ఇంట్లోనూ

ఉన్నాయి. పైగా కాస్త స్వార్థం.. ఆడంబర ప్రియత్వం కూడా ఉన్నాయని నా పెళ్ళిలో తేటతెల్లమయింది కదా? అందుకే -

'నీలోని సంతోషాన్ని నలుగురికీ పంచు.

నీలోలోని దుఃఖాన్ని నీలోనే దాచుకో' - అనే పాతకాలపు సూక్తిని గౌరవిస్తూ.. పాటిస్తూ -

"అదేం లేదు అమ్మమ్మా. కొత్త కదా. భయం వేసింది అప్పుడే వద్దు అన్నాను. కాస్త పరిచయం పెరిగిన తర్వాత అన్నాను. అతనికి కోపం వచ్చింది." - అన్నాను నెమ్మదిగా తలవంచుకుని.

"బుజ్జీ. నిజంగా అలాగే అన్నావా?" - ఆందోళనగా అడిగింది. నా తలపైకెత్తి.

'అవును' అన్నట్లు నమ్మకంగా తల ఊపాను.

"చాలా పొరబాటు చేసావు బుజ్జీ. అలా అనకుండా ఉండవలసింది."

"మనసు తెలియకుండా ఎలా? ఎంత భర్త అయినా అనిపించింది." అన్నాను ఇది మరో అబద్ధం"ఎవరి మనసు బుజ్జీ? నీ మనసా? అతని మనసా? ఒకమాట చెపుతాను విను బుజ్జీ. ఈ మనసులూ అవీ కథలకీ, సినిమాలకీ పనికొస్తాయి కానీ జీవితాలకు సరిపడవు. ముఖ్యంగా సంసారం చేసుకునే వాళ్ళకి ఇళాంటి ఆలోచనలు అస్సలు పనికిరావు. భర్త ఎలా చెపితే అలా వింటూ అతనికి కావల్సినట్లుగా నడుచుకుంటే కాపురాలు బావుంటాయి. ఇలా చెపుతున్నానని, పాతకాలపు దాని మాటలని తేలిక చేయకు. ఈ రాత్రికయినా అతనితో సంతోషంగా ఉండు. 'ముందు రాత్రి తెలియక మాట్లాడాను. క్షమించండని వీలు చూసుకుని ఇవ్వాళ చెప్పు. తెలిసిందా?"

అమ్మమ్మ హితబోధ వింటుంటే బాధనిపిస్తోంది.

ఇదా వివాహ జీవితం అనిపిస్తోంది.

"లేలే బుజ్జీ. జుట్టు ఆరింది. తొందరగా జడవేసుకుని, ముస్తాబయిరా. కొత్త పెళ్ళికూతురివి. ఇంతంత సేపు గదినుండీ బయటకు రాకపోతే మీ అత్తగారూ తక్కిన వాళ్ళు ఏమనుకుంటారు? అటు చూస్తే చిన్నదయినా మీరా పొద్దున్నే లేచేసి, చక్కగా ముస్తాబయి చకచకా అందరినీ పలకరిస్తూ, కలివిడిగా తిరుగుతోంటే - నువ్వేమో మందకొండిగా ఇలా ఉంటే అందరూ ఏమనుకుంటారు? నీ కిష్టం లేని పెళ్ళి చేసారని అనుకోరూ?"

దీన్నేమంటారు?

నేను మందకొండిగా ఉన్నానా? అవును. నిజమే.

చదువు పూర్తికానివ్వండి అంటే వినకుండా మీ స్వార్థం కోసం పెళ్ళి చేసారు.

'అటు చూస్తే తాళికట్టిన వాడు నన్ను పట్టుకుని, నా ముఖం మీదే నువ్వు బావుండవూ... నాకు నచ్చలేదూ... గొంగళిపురుగును గుండెమీద పెట్టుకుంటారా ఎవరైనా' - అంటూ అవమాన పరిస్తే -

నన్ను కాదులే ఎవర్నో అనుకుని, కాళ్ళావేళాపడి వేడుకోవటానికి నేనేంటీ? మనిషిని కానా? నాకు ఆత్మాభిమానం లేదా ఉండకూడదా?

ఇదంతా అమ్మ, నాన్న, అమ్మమ్మలకి చెప్పినా వింటారా? కాళ్ళూ, చేతులూ కట్టేసయినా అతనితో పంపేయరా? ఈ దేశంలో ఆడపిల్ల అంటే గుండెలమీద భారమనేగా. ఒకసారా భారాన్ని దింపేసుకున్న తర్వాత, మరల గుండెపై చేర్చుకుని హత్తుకుని ఆదరించేవాళ్ళు ఎందరున్నారు ఈ దేశంలో?

"నేను వెళుతున్నా. నువ్వు తొందరగా రామరి." అమ్మమ్మ వెళ్ళిపోయింది.

నాకేమీ అర్థం కావటం లేదు. ఏమిటీ జరిగేదంతా? ఇది నా జీవితమేనా లేక కలకంటున్నానా? వేరెవరి జీవితాన్నో చూస్తున్నానా?

ఆలోచిస్తూనే నగల పెట్టెను తీసాను. రాత్రి పెట్టుకున్న నగలు భద్ర పరచటానికై మూత తెరిచి చూస్తే -

పెట్టెలో సాయిరామ్ ప్రజెంట్ చేసిన బుద్దుని ప్రతిమ. చేతిలోకి తీసుకుని ఆ ప్రతిమను చూస్తుంటే -

మనసుకేదో స్వాంతన. సాయిరాం నిజంగా మనసు తెలిసినట్లు ఇచ్చారు. థేంక్స్ టు హిమ్. ఈ బుద్దుడు ఎంత ప్రశాంతంగా నిర్మలంగా ఉన్నాడు! ఎందుకుండడూ? తెలివైనవాడు కనుకనే సంసారాన్ని త్యజించాడు. "బుద్ధం శరణం గచ్చామి" మనసులో అనుకుని ఆ ప్రతిమను తిరిగి యధాస్థానంలో పెట్టాను. కబోడ్ తలుపులు మూసేసాను. ఇప్పుడు బయటకు వెళ్ళి అందరి ముఖాలు ఎలా చూడాలి? ఆలోచిస్తూ.... సందేహిస్తూ... ధైర్యాన్ని కూడదీసుకుని హాలులోకి వచ్చాను. హాలునుండీ డైనింగ్ హాలులో కనిపించిన సీను చూసి షాకయ్యాను. డైనింగ్ టేబుల్ దగ్గర అమ్మా - నాన్నగారూ ఒక వైపు, బయటకు వెళ్ళాడన్న చక్రవర్తి - మీరా మరో వైపు, అత్తయ్యలిద్దరూ, మామయ్యలూ అటూ ఇటూ దగ్గర దగ్గరగా ఎక్స్ట్రా కుర్చీలలో కూర్చుని టిఫిన్ చేస్తున్నారు. నవ్వుకుంటూ, సరదాగా మాట్లాడుకుంటున్నారు.

మీరా ఎంత శ్రద్ధగా అలంకరించుకుంది!

"ఇంకొంచెం ఉప్మా వేసుకుని తిన్నంత మాత్రాన మీరేం లావయిపోరు. మీ అందమేమీ తరిగిపోదు శ్యామ సుందర చక్రవర్తిగారూ" అంటూ అతని ప్లేట్లో మరికాస్త ఉప్మా వేస్తోంది.

మీరా ముద్దు ముద్దు మాటలకు అందరూ నవ్వుతున్నారు హాయిగా, ఆనందంగా, చివరకు శ్యామసుందర చక్రవర్తి కూడా నవ్వుతున్నాడు. అందంగా. మేన్లీగా. నేను స్థిరంగా నిలబడి ఆ అందమైన దృశ్యాన్ని చూస్తున్నాను.

ఇంతకూ పెళ్ళయింది నాకా? మీరాకా?

"ఏయ్ జాహ్నవీ! ఏంటలా నిల్చుండిపోయావు? రా...రా." - అమ్మ పిలుస్తోంది. నేను నిదానంగా నడుచుకుంటూ అమ్మకి దగ్గరగా వెళ్ళి నిలుచున్నాను.

గుండెలో ఎగిసి పడుతున్న ఉక్రోషాన్ని అణుచుకుంటూ ఉంటే, అమ్మ అంది "రా కూర్చో టిఫిన్ చేద్దువుగానీ."

పదిమందికి సరిపడే డైనింగ్ టేబుల్ అది.

ఒకసారి టేబుల్ అంతా చూసి -

"సీటు లేదు కదమ్మా" - అన్నాను.

"నాది అయిపోయింది. నేను లేస్తున్నా, నువ్వు కూర్చో." అంది అమ్మ. అంతే గానీ - 'మీరా నువ్వులే, అక్క కూర్చుంటుంది.' అనలేదు అమ్మ. ఎందుకు? సాంప్రదాయ కుటుంబం మాది కాదనను. అయితే కాబోయే కలెక్టరుగారి భార్యగారు కదా మరి. అమ్మ దాన్ని లేవమనదు. అమ్మో అలా అంటే నొచ్చుకోదూ. ఆ అందమైన ముఖం వాడిపోదూ?

ఆ అందం చూసేగా కలెక్టరుగారు మోహించింది. అటువంటప్పుడు ఆ అందాన్ని కాపాడాలి. రక్షించాలి. అందరూనూ. అంతే. అంతే అయుంటుది. నాకు తెలియదా మా వాళ్ళ ఆలోచనలు.

అమ్మ లేచింది. నేను కూర్చున్నాను.

మీరా చక్రవర్తుల మొహాల్లో కాంతి స్విచ్ ఆఫ్ అయినట్లు పోయింది. చక్రవర్తికి మరో ప్రక్కన కూర్చున్న పెదమామయ్య -

"జాహ్నవీ ఇలా రా అమ్మా. ఇక్కడ కూర్చో." - తను లేస్తూ అన్నాడు.

"వద్దు. తింటూ మధ్యలో లేవకూడదు. ముఖ్యంగా మగవారూ, అతిథులూనూ. మీరు కూర్చోండి ," అని -

"ఏం మీరా చాలా హుషారుగా ఉన్నావు? పొద్దున్నే కలెక్టరు సాయిరాంగారు ఫోన్ చేసారా? లేక రాత్రంతా మాట్లాడుతూ ఉండిపోయేవా?" -నవ్వు తెచ్చుకుని కావాలనే అడిగాను.

మీరా మాట్లాడలేదు. కళ్ళెత్తి ఓసారి నన్ను సీరియస్‌గా చూచి, ముఖం వాల్చి, ఉప్మాని స్పూన్‌తో తీసుకుని నోట్లో పెట్టుకుంది.

చక్రవర్తి మాత్రం లేచి నిలబడ్డాడు. కనీసం నా వైపు కూడా చూళ్ళేదు.

"అదేంటి బాబూ లేచావు. కాఫీ తెస్తున్నారు కూర్చో." - పెద్దత్త అంది. పెద్దత్తకి మీరా అంటే చాలా ఇష్టం.

"చేయి కడుక్కోవాలి." - చక్రవర్తి జవాబు.

అంతలో మా అత్తగారు కాదు చక్రవర్తి మదర్ పక్కగదిలోంచీ వచ్చి సోఫాలో కూర్చున్నారు.

"వెళ్ళి పలకరించు జాహ్నవీ" - చిన్నత్త చిన్నగా అంది.

"వెళ్ళమ్మా". బావుండదు." - నాన్నగారు కూడా.

ఏమని పలకరించాలి?

"టిఫిన్ చేసారాని అడుగు." - మళ్ళీ చిన్నత్తే సలహాగా.

నేను మనసులో నిట్టూర్చి, లేచి -

'ఆలూలేదూ... సూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు,' - అతనితో నిశ్శబ్దయుద్ధం చేస్తూ, మరో ఒంక -

'పెళ్ళి చేసుకో కానీ దూరం పెట్టు,' - అన్న ఆడదానితో కోడలిలా పలకరించాలా? ఏమిటీ శిక్షనాకు? నేను అన్యాయంగా శిక్ష పడ్డ ఖైదీలా నెమ్మదిగా ఆమెకు దగ్గరగా వెళ్ళాను.

"మీరు ...టిఫిన్ చేసారాండీ?" - అన్నాను. ఆమెను కాదు. సోఫాను చూస్తూ.

"ఆ. లేటుగా లేచినట్లున్నావు. నీకు బాగా తలనొప్పి వచ్చిందని మీ అమ్మ - అమ్మమ్మ చెప్పారు. బాగా అలసిపోయినట్లున్నావు. టిఫిను తిన్నావామ్మా." చాలా ఆప్యాయంగా అడిగారు.

ఆవిడ మాటలు వింటే ఆశ్చర్యంగా ఉంది. చక్రవర్తి అలా చెప్పాడు, ఈవిడేంటీ ఇంత ప్రేమగా మాట్లాడుతున్నారు?

ఎవరు నిజం. మరెవరు అబద్ధం?

"లేదండీ. సారీ లేటయింది." అన్నాను అసంకల్పితంగా. ఎవరైనా కాస్త ఆప్యాయత చూపించినా చాలు ఈ పిచ్చి మనసు వెన్నలా కరిగి పోతుంది ఎందుకో.

మా అత్తగారు మంచావిడలానే కనిపిస్తున్నారు. ఈ చక్రవర్తే బోడి అందంతో మిడిసిపడుతున్నాడు.

ఇతనికి తోడు నా ఖర్మకి మీరా తోడైంది. ఖర్మ.

"జాహ్నవీ టిఫిను అక్కడికి తీసుకురానా ప్లేట్లో పెట్టి." చిన్నత్త అడుగుతోంది.

"రామ్మా లేటుగా తింటే నీరసపడిపోతావు. గంటకోసారి కాఫీ తాగకపోతే నేనుండలేను. పద అక్కడికే వెళదాం" అన్నారు. ఆ మాటలతో మనసుకు మంచి గంధం పూసినట్లు అనుభూతిని ఆస్వాదిస్తూ ఆమె వెనుకే నేను. మా అత్తగార్ని చూస్తూనే, నాన్నా... మామయ్య లూ లేచి "రండమ్మా" - అన్నారు.

"అయ్యో! అదేంటీ మీరు లేచారు. నేను హాల్లో కూర్చుంటాను గానీ మీరు లేవకండి", అన్నారు.

"అబ్బెబ్బే అదేం లేదు. మాది అయిపోయింది. లేద్దామనుకుంటున్నాం అంతలో మీరొచ్చారు అంతే." -చిన మామయ్య అన్నాడు. అంటూనే సింక్ వైపు నడిచారు.

"రామ్మా జాహ్నవీ. నీకు నేను పెట్టనా?" - మా అత్తగారి మాటలు నాలో ఆనందం.

నాకు కన్నీరే అనుకున్నాను పన్నీరూ ఉందన్నమాట.

కాస్త గర్వంగా మీరా వైపు చూసాను.

మీరా ఇదేం పట్టించుకోకుండా... అసలు విననట్లే, ఒక నిశ్శబ్దాన్ని బ్రేక్ చేస్తున్నట్లుగా -

"అత్తమ్మా కాఫీ ఇచ్చేదా. మీరసలే గంట గంటకూ కాఫీ తాగకుండా ఉండలేరు." - అంది.

ఆశ్చర్యపోయాను. ఎలా తెలుసు? ఎవరు చెప్పి ఉంటారు? చక్రవర్తా. అయ్యుండదు. మాలతి వొదిన అయివుంటుంది. నిజంగానా? అనుకోవటంలో ఓ తృప్తి.

"మాలతి - సుధాకర్ గార్లు కనిపించటం లేదు." - మా అత్తగారి ప్రక్కనే కూర్చుంటూ అడిగాను. నాకిప్పుడు చక్రవర్తి తప్ప, ఆ ఇంట్లో మిగిలిన వాళ్ళంతా నావారు అనిపిస్తున్నారు. చివరకు వీళ్ళ తర్వాతే అమ్మా - నాన్నా అమ్మమ్మ అంతాను అనిపించసాగారు.

"నీ కెందుకులే మీరమ్మా. జాహ్నవి తిన్నాకా ఇద్దరకూ కలిపి ఇస్తుందిలేమ్మా" సరిగ్గా అప్పుడే మాలతీ, సుధాకర్ గార్ల గురించి నేను అడగటం వలన, మొదట మీరాకు జవాబు ఇచ్చి, నా ముందున్న ప్లేట్లో ఇడ్లీలు పెడుతూ -

"వాళ్ళిద్దరూ గుడికి వెళ్ళారమ్మా. సుధాకర్‌కి భక్తి ఎక్కువలే." - అన్నారు నాతో. ఆ మాటలు కాదు నేను వింటున్నది -

"మీరమ్మ.. ఎస్. అందమైన మీరాను, 'మీరమ్మా' అనటం పేరు కాదు కదా గోరు చివర కూడా అందంగా స్టైల్‌గా ఉండక పోతే భరించ లేని మీరాను, 'మీరమ్మా' అంటుంటే మీరా ముఖం వైపు చూసాను. తను అదేం పట్టించుకోకుండా -

"నేనూ మీ కోడల్నే కదా, నేను ఇస్తే మీరు తాగరా?" - బుంగమూతి పెట్టి గోముగా అడిగింది. ఆశ్చర్యపోవటం నావంతు అవుతోంది. ఏమిటీ అమ్మాయి నేచర్?! ముద్దొస్తోంది మీరా ముఖం. అసంకల్పితంగా చక్రవర్తి వైపు చూసాను అద్దంలోంచి మీరానే చూస్తున్నాడు పరవశంగా.

"పోనీలే మీరా. కోడలి చేతి కాఫీ తాగాలని వదిన సరదా పడుతున్నట్లున్నారు. టిఫిను నువ్వు సర్వ్ చేసావుగా. కొత్తకోడలి చేతి కాఫీ తాగనివ్వు." అమ్మ అంది.

"ఓకే మమ్మీ మీరూ .. మీరూ ఎంజాయ్ చేయండి. నేను వెళుతున్నా. హాయిగా బావగారికి కంపెనీ ఇస్తాను." - అంటూ గమ్మత్తుగా నా వైపు చూసి వెళ్ళిపోయింది.

వద్దన్నవాడి మీద నాకేం ఆశలు లేవు. కానీ ఈ మీరా ఏంటి ఇలా ప్రవర్తిస్తోంది. ఒట్టి మరదల్లా సరదాగా ఉందా లేక ఇంకేమైనా ఉందా?

"వదినగారూ చిన్నమ్మాయి పెళ్ళెప్పుడు పెట్టుకున్నారు?" వెళుతున్న మీరాను వెనుక నుండీ చూస్తూ అడిగారు మా అత్తగారు.

"అల్లుడుగారు ఏదో ట్రైనింగులో ఉన్నారంట. ఆ ట్రైనింగ్ పూర్తయి వచ్చిన వెంటనే ఎంగేజ్‌మెంట్ చేద్దామనుకుంటున్నాం వదినగారూ." - అమ్మ చెప్పింది.

"ఏమిటీ ఇంకా ప్రధానం జరగలేదా? అయ్యో అదేమిటమ్మా. అబ్బాయి రాలేక పోతే ఏం? తాంబూలాలు మొదట తీసేసుకోవాలి. అమెరికా నిశ్చితార్థాలన్నీ అలాగే జరుగుతున్నాయిగా. తప్పేం లేదు. ఈ కాలం పిల్లల మనసు ఎప్పుడు ఎలా మార్చుకుంటారో చెప్పలేం కదా! అందుకే సంబంధం అనుకోగానే తాంబూలాలు తీసేసుకుని పెళ్ళి చేసెయ్యాలి వదినగారూ."

అమ్మకి మా అత్తగారి మాటలు నచ్చలేదని అమ్మ ముఖం చూస్తే అర్థమైపోయింది అయినా నిగ్రహం పాటిస్తూ -

"వాళ్ళ నాన్నగారూ, నేనూ చాలా స్ట్రిక్ట్‌గా పిల్లల్ని పెంచాం. వాళ్ళెప్పుడూ పొరపాట్లు చెయ్యరు. మాకా నమ్మకం బాగా ఉంది." అమ్మ పౌరుషంగా.

"అయ్యో! మన పిల్లలు తప్పుచేస్తారని నేను అనటంలేదమ్మా. మగవాళ్ళ బుద్ధులు ఎప్పుడు ఎలా మారతాయో చెప్పలేం కదా? అందుకే అలా అన్నాను. అంతేకానీ మీ కూతురు నాకు మాత్రం కూతురు లాంటిది కాదా వదిన గారూ."

"మీకా భయం అక్కర్లేదండీ. మా మీరాను ఒక్కసారి చూస్తే నిద్రలో కూడా మర్చిపోరు. అందుకే సాయిరాం కోరి కోరి వచ్చాడు. మీరాలాంటి అమ్మాయి భార్యగా దొరకటం అతని అదృష్టమే అనుకోవాలి." అమ్మ చాలా గర్వంగా చెప్పింది.

మా అత్తగారు చాలా అసహనంగా ముఖం పెట్టారు. ఏదో అనబోయి మానేసినట్లుగా కూడా అనిపించింది.

మీరా, చక్రవర్తి చిన్నగా మాట్లాడుకుంటున్నారు. హాల్లో కూర్చున్నారు. ఇద్దరి మధ్యా తక్కువగా ఉన్న దూరాన్ని చూస్తుంటే -

నాకు వళ్ళు మండి పోతుంది.

అసలు నాన్నగారూ, మామయ్యలూ అంతా ఏమయ్యారు?

వీళ్ళిద్దరినీ అలా ఏకాంతంగా ఎలా వదిలేసారు?!

బయటి నుండీ... వరండా నుండీ ఏవో మాటలు వినిపిస్తున్నాయి. నాన్నగారూ, మామయ్యల మాటలతో పాటు, వేరెవరి మాటలో కూడా వినిపిస్తున్నాయి.

కొద్దిగా శ్రద్ధగా ఆలకిస్తే అర్థమౌతోంది. పెళ్ళి ఎరేంజ్‌మెంట్ల తాలూకూ డబ్బును వసూలు చేసుకోవటానికి వచ్చిన వాళ్ళనుకుంటా. హూ వీళ్ళిప్పుడే రావాలా అని మనసులో అనుకుని నేను గబగబా టిఫిను తినటం ముగించి - "అత్తమ్మా మీకు కాఫీ తీసుకు వస్తాను", - అని చెప్పి, వంటింట్లోకి వెళ్ళి మా వంటావిడ చేసి ఇచ్చిన కాఫీ కప్పులను తీసుకుని, మా అత్తగారి దగ్గరకు వచ్చి ఆమెకో కప్పు ఇచ్చాను.

ఇస్తూ హాలులో ఉన్న వాళ్ళిద్దరి వైపు చూసాను.

సరిగ్గా అప్పుడే అనుకోని సంఘటన

*పెళ్ళి ఎంత హాస్యాస్పదమైన ఆడంబరపు తంతో కదా!*
*అదో అగ్నిప్రవేశం వంటిది.*
*నవ హృదయాల లోని ప్రేమను అది హరించి వేస్తుంది.*
*మనుషులను యంత్రాలుగా మార్చివేస్తుంది.*
*అగ్నితో ఆడుకోవటం తెలిసిన వారికి అగ్ని అంటదట!*
*అగ్ని ఎవరు?*
*ఆహుతయ్యేది ఎవరు???*

## ఏడవ భాగం

*"మనం భరించే, సహించే దురదృష్టాలు బాహ్యం నుండీ వస్తే, వాటిని... 'యాదృచ్ఛికాలు - ప్రమాదాలు'... అనవచ్చు."*

*- ఆస్కార్‌వైల్డ్.*

"లోపలికి రావచ్చా?"

గుమ్మం వరకూ వచ్చేసి, ముఖాన్ని గడపావలి నుండీ లోపలికిసాచేసి, ఒంటెలా కనిపిస్తున్న ఓ అపరిచితుణ్ణి చూసి, ఆ కంచు కంఠాన్ని విని, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న మేము గుమ్మం వైపు చూసాం.

'ఏదో మాట వరసకు అడిగాను, కానీ నా ఇంట్లోకి నేను రావటానికై పర్మిషనేంటి నాకు' - అన్నట్లుగా ఓ చూపు గడపపై విదిల్చి - గబగబా.. గునగునా లోపలికి చక్రవర్తీ .. మీరాలు కూర్చున్న చోటుకి వెళ్ళి -

"ఓహో! కొత్త దంపతులు మీరేనన్నమాట. శుభం. చూడముచ్చటగా సీతారాముల్లా.. రతీమన్మధుల్లా బావున్నారు. దిష్టితగిలేలా ఉన్నారు.." - అంటూ తన రెండు చేతులూ పైకెత్తేడా వ్యక్తి దీవిస్తున్నట్లుగా. అసంకల్పితంగానో, మరెలానో గానీ చక్రవర్తీ.. మీరాలు చటుక్కున లేచి నిలబడ్డారు.ఇద్దరి ముఖాలు వింతగా మారిపోయాయి.

"ఏంటమ్మా అలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? ఎవరీ ముక్కూ ముఖం తెలియనివాడు? ఇదేంటీ ఇలా లోపలికి వచ్చేసి మాట్లాడేస్తున్నాడేంటీ?! అని ఆశ్చర్యపోతున్నారు కదూ?

నేనేనమ్మా రాఘవగాడి ఓల్డ్ ఫ్రెండ్‌ని. జగపతిరావును. మీ నాన్నకి ఓల్డ్‌ఫ్రెండ్ అంటే ముసలి ఫ్రెండ్‌ని కాదమ్మడూ. బాల్య స్నేహితుణ్ణి అంటే చిన్ననాటి స్నేహితుణ్ణి అన్నమాట.

మీ పెళ్ళికి నాలుగురోజులు ముందన్నా రావాలని మీనాన్న ఫోన్ చేసి మరీ చెప్పాడు.

కానీ.. ఏదమ్మా. సరిగ్గా మీ పెళ్ళి ముహూర్తానికే మా అల్లుడుగారి చెల్లెలు పెళ్ళి కూడానూ. బావుండదు కదమ్మా. అసలే అల్లుడు తరపు పెళ్ళికదా. అందుకే ఆ పెళ్ళి చూసుకుని, ఇలా వచ్చాను. మీ ఇద్దరినీ దీవించేసి.. సుష్టుగా పెళ్ళి భోజనం తినేసి, మధ్యాహ్నం తిరిగి ఊరుకెళ్ళిపోతానమ్మా అదీ ప్రోగ్రామ్." - అంటూ గబగబా మాట్లాడేస్తూ, లాల్చీ జేబులో చెయ్యి పెట్టి వెతుక్కోసాగారు. ఆయనను చూస్తూనే అర్ధమవుతోంది, పల్లెటూరి వాటమని.

అమ్మ గబగబా ఆయన దగ్గరకు వెళ్ళి -

"నమస్కారం అన్నయ్యగారూ. రండి ఇలా కూర్చోండి సోఫా చూపిస్తూ అంది." ఆయన వాక్ప్రవాహాన్ని ఆపజూస్తూ.

ఆయన ఆ వెతకటం, మాట్లాడటం ఆపి -

"ఆ.. నమస్కారమమ్మా. నువ్వు మా రాఘవగాడి పెళ్ళానివి కదూ చెల్లెమ్మా.!"- అన్నాడు వాస్కోడిగామాలా చూస్తూ.

ఏడ్చినట్లుంది ఆ తెలివితేటలు మీరానూ, చక్రవర్తినీ చూసి నవ్వుడేమయిందో? అతి తెలివి చూపించి వాళ్ళిద్దరినీ భార్యాభర్తలు చేసేసాడు. అయినా వాళ్ళిద్దరికీ బుద్ధి ఉండక్కర్లా. అలా దగ్గర దగ్గరగా కూర్చుని ఆ గుసగుసలు ఏమిటి? అదీ కాకుండా ఈ మీరా తనే పెళ్ళికూతురన్నట్లుగా ఆ ఓవర్ అలంకరణ చేసుకోవటం ఎందుకనీ? చక్రవర్తిని ఏం చెయ్యాలనో?! అమ్మ మాత్రం అవస్థపడిపోతూ, " అవును అన్నయ్యగారూ, మీ ఫ్రెండ్ బయట ఎవరితోనో మాట్లాడుతున్నట్లున్నారు. పిలుస్తాను. మీరు కూర్చోండి," - అని, చటాలున మీరా వైపు చూస్తూ -

"మీరా నువ్వెళ్ళి మీ నాన్నగారిని పిలుచుకురామ్మా. తన ఫ్రెండ్ వచ్చారని చెప్పు." - అంది.

"అయ్యెయ్యో!! కొత్తపెళ్ళికూతురికి పని చెప్పటమెందుకమ్మా. అయినా ముందుగా బయిట వాడిని పలకరించే లోపలికి వచ్చాను." అని - మీరా వైపు చూస్తూ -

"అమ్మా పెళ్ళి కూతురా ఇదో నీకో చిన్న కానుక." - అంటూ లాల్చీజేబునుండీ ఎర్రకాగితం చుట్టిన చిన్న బాక్స్‌ను బయటకు తీసారు.

"అన్నయ్యగారూ, మీరు పొరపడ్డారు. అది మా రెండో అమ్మాయి మీరా. ఇంకా పెళ్ళికాలేదు. పెళ్ళి నిశ్చయమైంది. కాబోయే అల్లుడు కలెక్టరు." - అంది. ఆ చెప్పటంలో అమ్మ ముఖంలో చెప్పలేని గర్వం. మీరా ముఖంలో తడబాటు.

చక్రవర్తి ముఖంలో అసూయ.

నాకు ఇదంతా చూస్తుంటే గమ్మత్తుగానూ, విరక్తిగా కూడా ఉంది. ***నా జీవితానికి నేనే ఒక ప్రేక్షకురాలిగా అనిపిస్తోంది.***

డైనింగ్ టేబుల్ దగ్గర, మా అత్తగారి వెనకగా నిలిచిన నన్ను.. అమ్మ కాస్త చికాగ్గా చూస్తూ -

"జాహ్నవీ ఇలారామ్మా" - అంది మహామృదువుగా.

నేను నెమ్మదిగా వెళ్ళి అమ్మ ప్రక్కన నిలిచాను.

నా మెడలో పసుపుతాడు పచ్చివాసన వేస్తూ, పచ్చగా మెరుస్తోంది. వేలికి ఉన్న పెళ్ళి ఉంగరం వింతకాంతులీనుతోంది. మెడలో నల్లపూసల ఒత్తిడి మురిపెంగా, ' ఈ అమ్మాయికి పెళ్ళి అయింది సుమా', అన్నట్లుగా నిగనిగలాడుతున్నాయి.

'ఈ అమ్మాయే నవ వధువు సుమా- అని తెలియజేసే గుర్తులన్నీ నా వంటిమీద ఉన్నాయి.

అయితే వీటన్నింటి కంటే ముందుగా, మనిషిని చూడగానే తెలియచేసేది ఏదో నాలో శేషమైంది. ఏవిటది???

ఆ.. అవును. అదే కన్నెపిల్ల గృహిణిగా మారినవేళ నవవధువు చెక్కిలిపై.. మోముపై మెరవవలసిన సిగ్గుల మెరుపు... ఆ కాంతి. అది నాలో లేదు. అది ఎలా వస్తుంది?

భర్త తాలూకూ స్పర్శతోనే కదా? అదే నాకు జరగలేదు.

'కమలము నీట బాసిన గమలాప్తుని రశ్మిసోకి కమలిన' అలాగే భర్త తాలూకూ నిరాశతో... అడుగడుగున, వేదనలో మునకలేస్తున్న నాకు, ఆ కళ ఎలా వస్తుంది మరి. సరే... నేను.. ఓ..కే. నా ప్రారబ్ధం అనుకున్నా, మరి మీరా ముఖంలో ఆ కాంతి ఏమిటి?

అందుకేనా పాపమా పెద్దమనిషి పొరపాటు పడింది?

వాస్కోడిగామాగారు షాక్ అయ్యారు.

తరువాత తన తొందరపాటు తనానికి 'అరెరే'.. అనుకుంటూ ఫీలయిపోయి, క్షణకాలం గజిబిజి అయి, ఆపై నెమ్మదిగా తలెత్తి నా వైపు చూస్తూ -

"సారీ అమ్మా! పెద్దవాడినయ్యాను కదా. నాభార్య అంటూనే ఉంది. నాకు తొందరెక్కువని. అలాగే అయ్యింది. రా తల్లీరా .. ఇలారా తల్లీ" - అంటూ నా ముఖాన్ని పరిశీలనగా చూస్తూ - "లక్ష్మీ కళ ఉట్టిపడుతోంది తల్లీ. ఆడపిల్లకు వుండాల్సిన నిదానం, నిండుతనం నీలో ఉన్నాయమ్మా. అబ్బాయి సుఖపడతాడు" - అన్నారు.

నాకు చక్రవర్తి ముఖంలోకి చూడాలనిపించింది.

ఆ వెంటనే 'వేస్ట్' అనికూడా అనిపించింది.

అమ్మ గబగబా, "జాహ్నవీ బాబాయిగారి కాళ్ళకు మొక్కి ఆశీర్వాదం తీసుకోండి." - అంది.

అతను వినబడనట్లు నిలబడ్డాడు.

నేను వంగి ఆయన కాళ్ళకు నమస్కరించాను.

ఎందుకనీ?

చక్రవర్తితో నాకాపురం చక్కబడాలనీ, బావుండాలనీ మాత్రం కాదు. వ్యక్తిగా నా వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా - 'నవ్విన నాపచేనే పండుతుంది' - అన్నట్లుగా నేను ఎదగాలి. చక్రవర్తీ మీరాలు సిగ్గుపడేటంతగా నేను ఎదగాలి. నేను బాబాయిగారి ఆశీర్వాదం తీసుకుని, నిలిచి చక్రవర్తి వైపు చూసాను.

అతను తను ఉన్న చోటు నుండీ రవ్వంతైనా కదలక, మెదలక అప్పుడే శిల్పిచే తయారుచేయబడిన ప్లాస్టరాఫ్ పారిస్ బొమ్మలా నిలబడి ఉన్నాడు. ప్రక్కన మీరాలేదు. అసలా హాలులో కూడా లేదు. గాలిలా.. నీడలా ఎప్పుడు ఎలా ఎక్కడికి మాయమయిందో మరి.

అమ్మ అన్నింటినీ కవర్ చేస్తూ -

"జానకమ్మగారూ! ఊరు నుండి అన్నయ్యగారు వచ్చారు. టేబుల్ పైన టిఫిను సిద్ధం చేయండి," - అంటూ 'వంటింట్లో వున్న' ఆమెకు వినిపించటానికే సుమా - అన్నట్లుగా పెద్దగా చెప్పింది.

"రండి అన్నయ్యగారూ టిఫిను చేద్దురుగాని" - అంది. అప్పుడే నాన్నగారు లోపలికి రావటం చూసి, -

"అదిగో అన్నయ్యగారూ మీ ఫ్రెండ్ వచ్చేసారు ఇంకేం" - అంది రిలీఫ్‌గా. ఆ 'ఇంకేం' అనేమాటకు అర్థమేమిటి?

హమ్మయ్య! ఇహ నేను విపరీతంగా నటిస్తూ, పరిస్థితులకు అనుకూలంగా వాతావరణాన్ని మార్చే శ్రమ తప్పించేరు సుమా - అనా?

జగపతిరావుగారు ఓసారి నాన్నగారు వచ్చేదిశగా చూసి -

"ఉండు చెల్లెమ్మా అమ్మాయికి.." అంటూ,

"అమ్మాయీ నీ పేరేమిటమ్మా అని" - అడిగారు.

"జాహ్నవి అండీ" అన్నాను.

"పేరు బావుందమ్మా" - అని, "జాహ్నవి తల్లీ.. ఇదిగోమ్మా కుంకమబరిణా, దుర్గాదేవి విగ్రహం, మా ఆవిడ తరపున నీకు -" అంటూ, ఆ చిన్ని ఎర్రని పేకెట్ నా చేతిలో పెట్టి -

"బాబూ ఇలారా" - అంటూ చక్రవర్తిని పిలిచారు.

కనురెప్పల మాటున అయిష్టాన్ని దాచుకుంటూ, ఏదో జడపదార్థం కదులుతున్నట్లుగా కదిలి, చిన్నగా అమ్మ ప్రక్కన నిలిచాడు.

జగపతిరావుగారు తన మరో జేబునుండి ఓ కవరు తీసి, చక్రవర్తి వైపు చూచి -

'మీ ఇద్దరికీ - అమ్మాయికి చీరే కొంటావో, మరేం చేసుకుంటావో నీ ఇష్టం" - అన్నారు.

'వద్దండీ. ఇటువంటివి నాకిష్టముండదు." - అన్నాడు. ఒక అడుగు వెనక్కి వేసి.

జగపతిరావుగారి ముఖం చిన్నబోయింది. పాపం. పైకి మొరటుగా కనిపిస్తున్నా, పల్లెతాలూకూ స్వచ్ఛత ఆయనలో నిండుగా కనిపిస్తోంది. అప్పుడే మా దగ్గరకు వచ్చిన నాన్నగారు తన స్నేహితుని చేతినుండీ ఆకవరు చనువుగా తీసుకుని, నా చేతిలో పెట్టి, " మా అల్లుడుగారు చాలా ఆదర్శభావాలు గల వ్యక్తిరా. పిల్లల ఆదర్శాలను మనం గౌరవించాలి. కానీ... నువ్వు ఫీలవకుండా ఉండటానికై అమ్మాయికిచ్చేస్తున్నాను. సరేనా? అయినా ఎందుకురా ఇదంతా నీ అభిమానం నాకు తెలియదా?"

"అవును అన్నయ్యగారు! మీరు వచ్చి పిల్లను దీవించారు. అది చాలదా"? ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలో .. ఎలా ప్రవర్తించాలో అమ్మా - నాన్నలకు బాగా తెలుసు.

"రండి అన్నయ్యగారూ టిఫిన్ చేద్దురుగానీ" - అమ్మ ఆయనను తొందర చేసింది అనేకంటే ఆయనను మాటల తాడుతో కట్టేసి లాక్కెళ్ళింది అంటే కరెక్ట్.

అమ్మ జగపతిరావుగారిని మా అత్తగారికి పరిచయం చేసింది. మాటల మధ్యలో వాళ్ళిద్దరి ఊర్లూ ప్రక్కప్రక్కనే అని తెలుసుకుని ఇద్దరూ పుట్టింటివైపు బంధుత్వం కోసం బీరకాయపీచును విడతీయసాగారు.

అమ్మ హాయిగా నిట్టూర్చింది.

ఇంతలో మాలతీ, సుధాకర్ వచ్చారు. వాళ్ళ పరిచయాలు జరిగిన తర్వాత అందరి మధ్యా మాటలతో, సుధాకర్, జగపతిరావు, నాన్నగార్ల హాస్యాలతో ఇంటి వాతావరణం మారిపోయింది.

ఒక్క చక్రవర్తిని ప్రక్కన పెడితే, నిజంగా పెళ్ళి నాకే జరిగినట్లే అనిపించసాగింది... ఈ క్షణంలో, అంతలో -

మా పనిపిల్ల భాగ్యం కాస్త అమాయకురాలు, కుతూహలం, భోళాతనం ఎక్కువ. అది పరుగులాంటి నడకతో, అమ్మ దగ్గరకు వచ్చి, అమ్మ చెవిలో రహస్యంగా -

"అమ్మా, దొరగారు వచ్చారు." - అంది. ఆ ముఖంలో ఆశ్చర్యం... ఆనందం కూడా ఉంది.

"దొరగారెవరే?" - అమ్మ కాస్త గట్టిగానే అడిగింది. ఇంటివాళ్ళందరూ కూర్చుని మాట్లాడుకునే సమయంలో, పనివాళ్ళు అలా వచ్చి మాట్లాడితే అమ్మ చాలా చికాకు పడుతుంది.

భాగ్యం కాస్త బెదురుకుని -

"పెద్ద పోలీసు దొరగారంట." - అంది చిన్నగా.

"ఎవరూ?" - నాన్నగారు అడిగారు.

భాగ్యం మరలా చెప్పింది.

"ఉండు చూస్తానంటూ", - నాన్నగారు లేచి వెళ్ళారు.

రెండు నిముషాల అనంతరం - ఓ నూతన వ్యక్తితో నాన్నగారు లోపలికి వస్తూ -

"మధూ... మీరాను తీసుకురా." అన్నారు ఆయన ముఖంలో సంతోషం - కాస్త ఎగ్జైట్‌మెంటు కూడా కనిపించాయి! ఎవరబ్బా చూట్టానికి మాత్రం అతను - ఠీవిగా.. దర్జాగా, పొడవుగా, బలంగా... అందంగా కూడా ఉన్నాడు. నాన్నగారు, చక్రవర్తి వైపు చూస్తూ -

"అల్లుడుగారూ ఓసారిలా వస్తారా?" నాన్న పిలుపు విని, సుధాకర్ ప్రక్కన కూర్చున్న చక్రవర్తి లేచి, వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు.

నాన్నగారు, చక్రవర్తిని - "మాపెద్దల్లుడు చక్రవర్తి" అని పరిచయం చేసి,

"అల్లుడు గారూ వీరు వివేక్‌గారని, సాయిరాంగారి స్నేహితులట. ఇక్కడ ఎ.ఎస్.పిగా పనిచేస్తున్నారట." - అన్నారు.

"హలో" - అంటూ ఇద్దరూ చేతులు కలుపుకున్నారు.

అంతలో మీరాని తీసుకుని అమ్మ వాళ్ళ దగ్గరకు వెళ్ళింది. నాన్నగారు మొదట అమ్మని, వివేక్‌గారికి పరిచయం చేసారు. తర్వాత, మీరాను పరిచయం చేస్తూ - "మా రెండో అమ్మాయి మీరా" - అని, "మీరా ... ఈయన వివేక్ గారు. సాయిరాంగారి ఫ్రెండ్" - అన్నారు.

మీరా 'నమస్తే అండి' - అంది.

అతను చాలా సంతోషంగా మీరాను చూస్తూ -

"చాలా సంతోషంగా ఉంది సిస్టర్. సాయిరాం కంటే ముందుగా నేనే నీతో మాట్లాడేయటం" అని గుమ్మంవైపు చూసి సైగ చేసాడు. వెంటనే గుమ్మం బయట అంతవరకూ, ఆజ్ఞకై ఎదురు చూస్తున్న పోలీసు, ఒక పెద్ద పూల గుత్తితో లోపలికి వచ్చాడు. అతని కాళ్ళకు సాక్స్ ఉన్నాయి కానీ బూట్లులేవు.

ఆ పోలీసు అత్యంత వినయంగా, వాళ్ళ బాస్‌కి అడుగుదూరంలో ఆగి -

మహా - గౌరవంగా వంగి,

గుడిలో పూజారి నుండీ స్పెషల్ ప్రసాదాన్ని స్వీకరించే భక్తపరమాణువులా, విధేయంగా ఆ పూల గుత్తిని వివేక్ వైపు సాచాడు.

వివేక్ ఆ పూల గుత్తి అతని నుండీ తీసుకుంటూ, "ఊ" - అన్నాడు. పోలీసు పూలగుత్తి అందించి వెనుతిరిగి సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. వివేక్ ఆ పూలగుత్తిని మీరాకి ఇస్తూ -

"మీకోసం." - అన్నాడు. బహుశా గులాబీల్లో దొరికే అన్నిరంగులవి తీసుకుని, చాలా స్పెషల్‌గా ఆ పూలగుత్తిని తయారుచేయించినట్లు, చూస్తుంటేనే అర్థమౌతోంది. మీరా వికసించిన మరో పూల సమూహంలా సంతోషంగా చూస్తూ "థేంక్స్" అంటూ తీసుకుని

"చాలా బావుంది. చాలా చాలా బావుంది." అంది.

"స్పెషల్ వ్యక్తులకు చాలా చాలా స్పెషల్‌గా గ్రీట్ చెయ్యాలి. లేకుంటే మా సాయిరాం క్షమించడు. అందుకే మీకోసం చాలా స్పెషల్‌గా చేయించాను. థాంక్స్ బాగున్నందుకు." అన్నాడు.

నాన్నగారు మా అందరినీ కూడా రమ్మని పిలిచారు. మా అత్తగారు ఎప్పుడు లోపలికి వెళ్ళారో గమనించలేదు. నాన్నగారు జగపతిరావుగార్నీ, సుధాకర్‌నీ, మాలతినీ... వివేక్‌గారికి పరిచయం చేసి, చివరలో నన్ను పరిచయం చేసారు.

"మా పెద్దమ్మాయి జాహ్నవి. నిన్ననే పెళ్ళైంది." - అన్నారు.

'కంగ్రాట్స్' సారీ వట్టి కంగ్రాట్సే చెపుతున్నందుకు. విష్‌యూ హేపీ మేరీడ్ లైఫ్" - అన్నాడు.

థేంక్స్ చెప్పాను. చక్రవర్తి నవ్వి ఊరుకున్నారు.

అందరం కూర్చున్న తర్వాత, వివేక్ మీరాను, "మీ అభిరుచులేమిటి?" అని అడిగాడు.

'చదువుకోవటం' టీవీ చూడ్డం, షాపింగ్ చేయటం.." అంది.

"చదువుకోవటమా? ఏం చదువుతారు?" - వివేక్ కుతూహలంగా కాస్త ముందుకు వంగి అడిగాడు.

"క్లాసుపుస్తకాలు అంది" - చాలా తేలికగా. ఇంకేం చదువుతాం అన్నట్లుగా చూస్తూ

"అంతేనా? మరేం చదవరా?"

"ఇంకటైమెక్కడుంది? క్లాసుబుక్స్ చదవటానికే టైమ్ ఉండదు." - అంది.

అతనో క్షణం నిరాశ చెందినట్లనిపించింది నాకు.

"సాయిరాంగారికి బుక్స్ చదివే అలవాటున్నట్లుంది." అడిగాను.

"అవును. వాడో బుక్వామ్. ప్రపంచంలోని మంచి పుస్తకాలన్నీ చదివేయాలి అంటాడు."

"ఆ ఒక్క అలవాటేనా?"

"కాదు. అని ఆగి .. సరే.. మీ అభిరుచులేమిటి?"- నన్ను చూస్తూ అడిగాడు.

నేను ఊహించలేదు ఈ ప్రశ్న. కనురెప్ప కదలిక పాటు నిశ్శబ్దం నాలో. వివేక్ కుతూహలంగా చూస్తున్నాడు.

అమ్మ చిన్నగా నాన్నగారితో మాట్లాడుతోంది. దేనిగురించో మరి.

జగపతిరావుగారు.. సుధాకర్‌తో పోలీసుల వేధింపుల గురించి చిన్నగా చెపుతున్నారు. ముఖం మొహమాటంగా పెట్టి వింటున్నాడు సుధాకర్.

మాలతి... మీరా చీర చెంగుకి ఉన్న జరీ వర్క్‌ని పరిశీలిస్తోంది.

మీరా - "ఏంటీ వీళ్ళ సుత్తి కబుర్లు' - అన్న భావాన్ని ముఖంలో దాచ ప్రయత్నిస్తోంది.

ఇదంతా ఒక్క క్షణంలో గ్రహించాను. మరి చక్రవర్తి?

సరిగ్గా అప్పుడే చక్రవర్తి సెల్‌ఫోను మోగింది.

అతను 'సారీ' - అంటూ లేచి బయటకు వెళ్ళాడు.

"విలువైనవి అనుకున్న బుక్స్ కలెక్ట్‌చేసి చదువుతాను."

వివేక్ కళ్ళు మెరిసాయి.

"అంతేనా?"

"మొక్కలను పెంచటం. సంగీతం వినటం... మా బామ్మ చెప్పే కథలు వింటూ, ఆమెను అల్లరిపెట్టటం ఇష్టం." ఇంతగా ఎందుకు చెప్పాను? నన్ను నేను నాలో ప్రశ్నించుకున్నాను.

అతని స్నేహపు చూపులలో ఏదో సామీప్యత కనిపిస్తోంది... నాకు.

"బావుంది చాలా బావుంది. సాయిరాం అలవాట్లు కొన్ని మీలోనూ ఉన్నాయి." - అన్నాడు అని -

"మీ అక్కచెల్లెళ్ళిద్దరూ వేరు వేరుగా ఉంటారనుకుంటా?"

"ఎందుకలా అడిగారు?"

"ఏం లేదు." - అన్నాడు సాలోచనగా.

"ఇంతకూ సాయిరాం గారి అభిరుచులూ... అలవాట్లు మీరు చెప్పలేదు.?" - నాన్న వివేక్‌ని అడిగారు.

వివేక్ నాన్నగారిని చూసి, తమాషాగా భుజం ఎగరేశాడు. ఆ చర్యలో 'ముందుగా ఆలోచించవలసిన ప్రశ్న ఇది. ఇంతలేటుగా కాదు! అన్న భావం ఉందా? లేక నా ఆలోచనా?

వివేక్ మీరా వైపు చూస్తూ - "ఆమెనే తెలుసుకోనియ్యండి." - అన్నాడు ముక్తసరిగా.

కరెక్ట్ వివేక్ చెప్పింది నిజం. 'మావాడిదీ... మావాడదీ' అని చెప్పటం ఈ కాలంలో అవివేకమే.

ఒక్కరే అనేకుల పట్ల అనేక రకాలుగా ప్రవర్తించటం నేటి నాగరికతకూడా.

అమ్మ లేచి వెళ్ళి కాఫీ తీసుకు వచ్చి వివేక్‌కి ఇచ్చింది.

తీసుకుని 'థాంక్స్ చెప్పాడు

"మీకు పెళ్ళయిందా?" - మీరా సడన్‌గా వివేక్‌ని ఐగింది. కాఫీ సిప్ చేస్తున్న అతను చలించి... ఆగి... నవ్వి -

"ఎస్. ప్రెగ్నెంట్. పుట్టింట్లో ఉంది." - అన్నాడు.

"చాలా బావుంటారా ఆమె?"

ప్చ్ ... మీరా అలా అడగకుండా ఉంటే బావుండేది.

అతను క్షణం మీరా వైపు చూసి, -

"నా భార్య నాకు మాత్రమే బావుండాలనుకోరుకునే వాణ్ణి నేను". - అన్నాడు మీరాకి అర్థమయినట్లు లేదు -

"అంటే?" - అంది.

"జాహ్నవిగారిలా ఉంటుంది." - అన్నాడు.

మీరా ముఖంలో ఆనందం ఆ మాట వింటూనే పరిమళంలా గుప్పుమంది.

"ఎరేంజ్డ్‌మేరేజా?"

ఏమైంది మీరాకు? ఎదుటివాళ్ళ మానసిక స్థాయిని గ్రహించదేఏమి?

"కాదు. లవ్ మేరేజ్. మా 'విన్నూ' సాయిరాం క్లాస్‌మేట్. తనూ ఐ.ఏ.ఎస్." - అన్నాడు.

క్షణకాలం పాటు సూది పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం మా మధ్యలో. ఆ నిశ్శబ్దంలో మీరా ముఖంలో ఆనందం ఆవిరి అయిపోయింది.

"మేమెవ్వరమూ సాయిరాంగారి ఫోటో కూడా చూళ్ళేదు తెలుసా?" అన్నాను.

"అరే. అలానా. మా ఇద్దరి ఫోటో కాదు మా ముగ్గురి ఫోటో ఒకటి ఎప్పుడూ నా పర్స్‌లో ఉంటుంది." - అంటూ పర్స్ తెరిచి ఫోటో బయటకు తీసి నాచేతికిచ్చాడు.

నేనా ఫోటో నా చేతిలోకి తీసుకుని చూసాను.

వివేక్‌గారికి ఒక వైపు సాయిరాం, మరోవైపు?? నేను వివేక్‌ని చూస్తూ "ఈమె 'విన్నూ' గారా? - అని అడిగాను.

"అవును."

విన్నూ అంటే?

విన్నూత్న.

వివేక్, విన్నూత్న పేర్లు కలిసాయి. మనసులో అనుకున్నా. కానీ సాయిరాంనే, పూర్ పర్సనాలిటీ. చాలా చాలా సాధారణంగా అసలు కలెక్టరు అంటే నమ్మనట్లుగా ఉన్నాడు.

మీరా ఇష్టపడుతుందా?

గుండె వణికింది.

## ఎనిమిదవ భాగం

*మనం ఊహించలేనంత నిరాశకు లోనయినప్పుడు*

*ఎదురుగా ఉన్నది ఆకర్షణీయం అనిపిస్తున్నప్పుడు,*

*ఆగు... కాస్త యోచన చెయ్యి*

*ఏది మనకి కావాలో*

*ఏది మనకి వద్దో*

*ఏది మనం కొనసాగించాలో*

*ఆగి ఆలోచించుకోవాలి.*

*తొందర పడకూడదు.*

*చేయి జార్చుకున్న దేన్నీ*

*తిరిగి పొందలేము కదా!*

అమ్మ నా చేతి నుండీ ఫోటో తీసుకుంది.

నాన్నగారు చాలా కూల్‌గా వివేక్‌తో మాట్లాడుతున్నారు.

వివేక్ నాన్నగారి మాటలు వింటూనే ఒక కంట మమ్మల్ని, ముఖ్యంగా మీరాను గమనిస్తున్నాడు.

ఎంతయినా పోలీసు బుద్ధి కదా?

మీరా అమ్మ భుజం మీదగా వంగి ఫోటోలోకి చూడటానికై కదిలే సమయంలో... నేను కావాలనే లేచి, వాళ్ళిద్దరినీ కవర్ చేస్తూ వంగి, టేబుల్ మీద ఉన్న టీ కప్పు తీసుకున్నాను. ఇది చాలా అసందర్భపు పని అని తెలుసు. కానీ నాకు మీరా నేచర్ తెలుసు. తన ముఖంలో ఏ భావమూ దాగదు. వివేక్ తెలివైనవాడు.

చక్రవర్తి ఇక్కడి నుండీ వెళ్ళిపోతే మీరా మామూలైపోతుంది. కలక్టరు భర్తగా రావటం అంటే మాటలా.

సరిగ్గా అదే సమయానికి చక్రవర్తి లోపలికి వచ్చాడు.

మాలతి కూడా మీరా భుజం మీదవాలి ఆ ఫోటో వేపు చూస్తోంది.

సుధాకర్ చెంతగా వచ్చిన చక్రవర్తి -

"ఏంటది?" - అడిగాడు.

"కలక్టరు బాబుగారి ఫోటో" - జగపతిరావుగారు ఠక్కున చెప్పారు.

"ఏదీ" చేయిచాస్తూ కుతూహలంగా.. ఎగ్జైట్ అవుతూ... ఆత్రంగా అడిగాడు.

మీరా అమ్మ చేతిలో ఫోటోని చరాలున లాగి, ముందుకు కదిలి, చక్రవర్తికి ఇచ్చింది. ఆ చేయి విసురులో... ఓ నిరాశ.. ఓ నిస్పృహ గోచరించింది. అతను ఆ ఫోటోని పరిశీలనగా చూసి, మీరా వేపు చూసాడు. వాడిన గులాబీలా వుంది మీరా ముఖం.

అంతలో వివేక్ - "అంకుల్ ఇహ నేను వెళతాను." - అంటూ లేచి నిలచి... చక్రవర్తిని చూస్తూ -

"ఫోటో ఇస్తారా" - అని అడిగాడు.

చక్రవర్తి ఫోటో ఇచ్చేసాడు.

నేను నా చేతిలో టీ కప్పు డైనింగ్ టేబుల్ మీద పెట్టటానికై వెనుతిరిగాను.

మీరా నా చేతిలో కప్పుతీసుకుని లోపలికి వెళ్ళసాగింది.

ఆశ్చర్యపోవటం నా వంతయింది.

మా అందాలరాణి ఇలాంటి పనులు ఇంతకు ముదెప్పుడూ చేయలేదు మరి.

వివేక్ అందరి దగ్గరా సెలవు తీసుకుంటూ - నా దగ్గరకి వచ్చాడు. నన్ను స్నేహంగా. అభిమానంగా... ఆత్మీయంగా చూస్తూ, "మళ్ళీ కలుద్దాం" - అన్నాడు.

అతని కళ్ళల్లో నా పట్ల ఓ మమకారపు చెలిమి కనిపిస్తోంది. ఎందుకూ? నాతో మాట్లాడుతూ డైనింగ్ హాలు మీదుగా... వంటింటి లోపలగా అతని చూపు ప్రయాణించింది. నేనూ వెనుతిరిగి చూసాను. మీరా కనిపించలేదు. చూసి.. నిట్టూర్చి వివేక్ వెళ్ళిపోయాడు. అతని వెంట నాన్నగారూ, జగపతిరావు గారు గేటు వరకూ వెళ్ళారు.

బయటి వాళ్ళెవరైనా ఇంట్లో ఉన్నంత సేపూ నా మనసు నిండుగా వుంటోంది. వాళ్ళు వెళ్ళిపోగానే మనసు తిరిగి వెలితిగా

నా సమస్య నా ముందు భూతంలా -

విపరీతమైన ఆలోచనలు నాలో -

నన్ను నిరుత్సాహ పరుస్తున్నాయి.

అమ్మ మధ్యాహ్నపు వంటకి హడావిడి పడటానికై వంటింట్లోకి వెళ్ళింది. మీరా కనిపించలేదు.

మిగిలిన అంతా డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని మాట్లాడుకోసాగారు. పెరటి గుమ్మం బయట నిలబడిన అమ్మమ్మ 'బుజ్జీ' - అంటూ పిలిచింది. నేను తన వైపు చూడగానే 'ఇలారా' - అంటూ చేత్తో సైగ చేసింది. నేను దగ్గరకు వెళ్ళగానే, నన్ను గబగబా కొబ్బరి చెట్టు వెనక్కు తీసుకు వెళ్ళి, 'ఇప్పుడు బయటి వాళ్ళెవరూ లేరు. నేనెలాగో బాబును పైన గదిలోకి పంపిస్తాను నువ్వు గదిలోకి వెళ్ళు.

రాత్రి తెలియక అలా మాట్లాడాను. క్షమించమని అడుగు." - అంది. ఒక ప్రళయాన్ని ఆపుచేస్తున్నంత సాహసపు తాలూకా యాతనగా వున్నాయి ఆ ముఖంలో భావాలు. చూస్తుంటే నవ్వొస్తోంది. నాటితరం ఎంత సెన్సిటివ్!

నేను అదేదో చాలా తేలికైన విషయమనే భావన కలగచేస్తూ -

"రాత్రికి చెప్తాలే బామ్మా" - అన్నాను.

"ఏంటీ రాత్రికి చెప్తావా? రాత్రిలోపు అతని మనసు ఎన్ని రకాలుగా మారవచ్చో నువ్వు ఆలోచించావా?"

నేను జవాబివ్వలేదు.

అంతలో మా పనిపిల్ల భాగ్యం పరుగెత్తుకుంటూ వచ్చి -

"మీరు ఇక్కడున్నారా? ఇల్లంతా వెతుకుతున్నా మీకోసం. మీరా అమ్మకు ఏదో అయిందట. అందరూ ఆయమ్మ దగ్గరున్నారు. అమ్మగారు మిమ్మల్ని రమ్మంటున్నారు." - అంది. గబగబా.

"మీరాకు ఏమైంది? కొంపతీసి సూసైడ్ చేసుకోబోయిందా!" - మనసులో అనుకుంటూ, అమ్మమ్మ వైపు చూసాను ఆందోళనగా.

"ఏమైందే మీరాకు? నడవవే తల్లీ" - అంటూ అమ్మమ్మ కూడా గాబరా పడుతూ, "లోపలికి పద బుజ్జీ" - అంటూ నా చేయి పట్టుకుంది.

మేమిద్దరం లోపలికి, మీరా గదిలోకి వెళ్ళేసరికి... అక్కడ దృశ్యం చూసి, షాకై.. మ్రాన్పడి ఆగిపోయాను.

అమ్మమ్మ కూడాను.

మంచం మీద మీరా. సగం కూర్చుని... ప్రక్కనే సమీపంగా... అత్యంత సమీపంగా, మంచం పట్టెకు ఆనుకుని నిలచిన చక్రవర్తి నడుం చుట్టూ చేతులు వేసి, గుండెపై తల ఆన్చి వెక్కి.. వెక్కి ఏడుస్తూ – 'నేను చచ్చిపోతాను. నేను చచ్చిపోతాను. నాకు బ్రతకాలని లేదు" – అంటూ తలతో చక్రవర్తి గుండెను రాస్తూ వెక్కిళ్ళు పెడుతోంది.

"ఊరుకోరా.... ఊరుకో, ఏమైందని ఇప్పుడు? చూడు ఎలా ఎట్టాగా కందిపోయాయావో.. ఏడవొద్దు. మంచి తల్లివి కదూ?" – చక్రవర్తి మీరా తలను... తన హృదయంపై వున్న మీరా తలను, తన ఒక చేత్తో నిమురుతూ, మరో చేతిని మీరా భుజాన్ని చుట్టి ఓదార్చుతున్నాడు.

ఆ గదిలో అమ్మ ఉగ్రరూపంలో –

నాన్న తలవాల్చేసుకుని –

మా అత్తగారు, మాలతి, పిన్నమ్మలు, మామయ్యలు అంతా బిత్తరపోయి, దిగ్భ్రాంతి చెంది శిలల్లా నిలిచిపోయి వున్నారు.

అంతకు ముందు వరకూ ఆ గదిలో ఏమి జరిగిందో నాకు తెలియదు, కానీ – మీరెవ్వరూ మమ్మల్ని విడదీయలేరన్న రీతిలో వారిద్దరూ వున్నారు. నేనిది... ఇంత తెగింపును నేను వూహించలేకపోయాను. నాదగ్గర ఏ చిన్నపాటి అందమైన వస్తువున్నా అది చూసి భరించలేక గొడవ చేసి, గోలచేసి, అలిగి, అమ్మానాన్నల దగ్గర ఏడ్చి, వాటిని తీసుకోవటమే అలవాటుగా చేసుకున్న మీరా... ఇప్పుడుకూడా ఏడుస్తోంది. ఈ ఏడ్పు దేనికోసం ఎవరికోసం? ప్రాణం లేని, జీవం లేని నాదగ్గర వున్న అందమైన వస్తువులన్నీ మీరా ఏడుస్తూ అమ్మా నాన్నలతో చెప్పి అడిగించినప్పుడంతా, అమ్మా – నాన్నలు నాతో, "చిన్నది కదా.. నీకు మళ్ళీ ఇంతకంటే మంచిది కొనిస్తాం. మీరాకి ఇవ్వమ్మా" – అంటూ బుజ్జగించేవారు. ఇప్పుడూ మరి ఏడుస్తోంది. ప్రాణమున్న అందమైన దానికోసం ఏడుస్తోంది. ఏమంటారిప్పుడు అమ్మా నాన్నా???

"అంతా నీ మూలంగానే... నీ మూలంగానే" – అంటూ నా చెంప ఛెళ్ళుమనిపించింది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు. ఒకచేత్తో నా తల పట్టుకుని, రెండో చేతితో నా చెంపలను వాయిస్తుంటే –

రాత్రి చక్రవర్తి కూడా ఇలాగే... ఏమైంది వీళ్ళందరికీ?

మనసు ఘనీభవించి పోయింది.

ఎవరువీళ్ళంతా?

నేనేమి చేసానని నన్నిలా వేధిస్తూ అవమాన పరుస్తున్నారు?

"అయ్యో! ఏమిటాపని? పిల్లని చంపేస్తున్నట్లున్నావే" – అంటూ అమ్మమ్మ నన్ను అమ్మ నుండీ వెనక్కు లాగి, తన గుండెలో దాచుకుంది.

"చచ్చినా బావుండేది. పుట్టిన దగ్గర నుండీ ఇది నన్ను బాధ పెడ్తూనే వుంది." అంటూ అమ్మ "దీనికి మొగుణ్ణి ఆకట్టుకోవటం కూడారాదు – నా ఖర్మ" – అంటూ మరల మరల తిడుతూ ఏడ్వసాగింది.

"మీరే... మీరే చేసారు ఇదంతా. పెళ్ళిచూపులప్పుడు మీరాను బయటకు పంపి నన్ను మోసం చేసారు." - సడన్‌గా చక్రవర్తి అన్నాడు.

"ఛీ.. ఛీ" - అంటూ నాన్న గది నుండీ బయటకు వెళ్ళిపోయారు.

అమ్మ సడన్‌గా ఏడ్పు ఆపి, తలెత్తి చక్రవర్తి వేపు చూస్తూ -

"మీరాకి అప్పటికే సంబంధం సెటిలయ్యింది. అయినా మీరా కోసమయితే మీ సంబంధం ఎందుకు -" అంటూ ఆగిపోయింది.

"అంటే ఏవిటమ్మా నీ ఉద్దేశం? మేము మీ కంత చులకనగా, తక్కువగా కనిపిస్తున్నామా?" - మా అత్తగారు వుక్రోషంగా అడిగేరు.

"అమ్మా నువ్వేమీ మాట్లాడకు. నేను ఆమెకు విడాకులిచ్చేసి మీరాను చేసుకుంటాను."

చక్రవర్తి మాటలకు ఆ గదిలో అందరూ అదిరి పడ్డారు.

ముఖ్యంగా అమ్మా - అత్తగారూనూ.

మీరా వెక్కిళ్ళు ఆపేసింది. చక్రవర్తిని మరింతగా అల్లుకు పోయింది. *ఎవ్వరికీ ఏమీకానీ... నాకు మాత్రమే నేనై మిగిలిపోయిన నేను అమ్మమ్మ గుండెనుండీ దూరమై చక్రవర్తివైపు చూసాను.*

అతని ముఖమెంతో తేటగా వుంది. ఇంత వరకూ మనసు మోసిన భారం తీరిన రిలీఫ్ కనిపిస్తోంది అతనిలో

"చక్రవర్తీ నువ్వేం మాట్లాడుతున్నావు? నిన్న పెళ్ళి. ఈ రోజు విడాకుల గురించి మాటలా? అమ్మను అప్పుడే కానిదాన్నయ్యానా? ముందా పిల్లను వదిలి ఇలారా. సిగ్గులేకపోతే సరి. నలుగురూ వున్నారన్న ధ్యాసయినా లేకుండా నిన్నలా కావలించుకుందంటే ఎంత బరితెగించిందో తెలియటం లేదా?"

"అమ్మా" - చక్రవర్తి ఏదో చెప్పబోయాడు.

"నువ్వింక మాట్లాడకు. నీకు నేను బతికి వుండాలనుకుంటే నా మాట విను లేదా నీకా భోగందే కావాలనుకుంటే నీ చేత్తో నా పీక నలిపి చంపెయ్ ముందు. లేదా నీ కళ్ళ ముందే ఆపని నేనే చేసుకుంటాను." - అంటూ తన పమిట చెంగు మెడకు చుట్టుకుంటుంటే - "అమ్మా" - అంటూ మాలతి చెయ్యి పట్టుకుని ఆపింది.

"నా కూతురుని భోగంది అంటుందా? అమ్మా వీళ్ళందరినీ మొదట నా ఇంటి నుండీ వెళ్ళి పొమ్మని చెప్పు". - అని ఆగి నా వేపు అసహ్యంగా చూస్తూ, "దీన్ని కూడా తీసుకెళ్ళిపోమని చెప్పు. మూడుముళ్ళు పడ్డ తర్వాత అది నా కూతురు కాదు. తీసుకు వెళ్ళి చంపుకుంటారో ఏం చేసుకుంటారో వాళ్ళిష్టం. నాకు సంబంధం లేదు. నాకంఠంలో ప్రాణముండగా మీరాను ఏ రెండో పెళ్ళి వాడూ తీసుకువెళ్ళలేడు. అది కలక్టరుకు కాబోయే భార్య. మత్తు చల్లి మోసం చెయ్యాలనుకుంటున్నారేమో, వెంటనే పంపేయ్ వాళ్ళను. నాకు ఒక్కర్తే కూతురు, అది మీరాయే." - అని అమ్మ మీరా దగ్గరకు వెళ్ళి చెయ్యి పట్టుకుని బలంగా లాక్కుని పక్క గదిలోకి తీసుకు వెళ్ళి తలుపు వేసేసుకుంది.

"పదండి పోదాం. వెధవ సంబంధం.. వెధవ సంబంధం. తీసుకు వచ్చిన ఆ పేరయ్యగాడు కనిపిస్తే మూడు ముక్కల కింద నరికిపడేస్తాను. నడవండి. అలా నిలబడి చూస్తారేం. చాల్లేదా జరిగిన మర్యాదలు. అమ్మాయీ... నువ్వూ ... నడు." అంది మా అత్తగారు.

"అదా. వీల్లేదు." - చక్రవర్తి ఠక్కున అన్నాడు.

"నువ్వు మాట్లాడకు. నేను చెపుతున్నాను. నువ్వు వింటున్నావు. అంతే." - అని, "మాలతీ మన బట్టలు సర్దేసి తీసుకురా" - అన్నారు.

మాలతి సంశయంగా చూస్తుంటే "ఫర్వాలేదు, మనమేం వీళ్ళ సొమ్ములు ఎత్తుకుపోవటం లేదు. వెళ్ళు. వెళ్ళి త్వరగా రా. ఇక్కడ ఒక్క నిముషం ఉండాలన్నా నా వంటి మీద తేళ్ళూ జెఱ్ఱిలూ పాకుతున్నాయి." - అన్నారు.

మాలతి పైకి వెళ్ళింది. "అమ్మాయీ... నువ్వు కూడా వెళ్ళీ నీ బట్టలు సర్దుకునిరా." - అన్నారు.

"నేనా?!" - అన్నాను.

"నేనా అంటావేమిటీ? మీ అమ్మ అంత ఖరాకండీగా చెప్పినా నువ్వింకా ఇక్కడే వుంటావా?"

"కాదు. నేనిక్కడ వుండను. అలా అనీ మీతోనూ రాలేను. అతనికి నేనంటే పరమ అసహ్యం. నన్ను ఇష్టపడనీ... నన్ను అసహ్యించుకునే ఎక్కడా నేనుండను."

"మరెక్కడవుంటావ్?"

"ఈ ప్రపంచం చాలా పెద్దది. నాలాంటి అనాథలు వుండటానికి చాలా శరణాలయాలున్నాయి."

"బుజ్జీ అవేం మాటలే? మేమంతా చచ్చిపోయామా? ఏదో గొడవలొచ్చాయి. కొంత ఓపిక పడితే అవే సర్దుకుంటాయి. అంత వరకూ మీ అత్తగారు చెప్పినట్లు నడుచుకోవాలి.

"నువ్వు మాట్లాడకు అమ్మమ్మా.. మీకెవ్వరికీ నా గూర్చి మాట్లాడే అర్హత లేదు. మీ.. మీ స్వార్థం కోసం నా జీవితంతో ఆడుకున్నారు. ఐ హేట్ యూ ఆల్." అన్నాను కోపంగా.

"నేనేం చెయ్యను బుజ్జీ? నా మాట ఎవరు వింటారు? కొడుకులూ... కోడళ్ళూ  చీదరించుకుంటుంటే, మీ అమ్మ జాలిపడి నన్ను తెచ్చుకుని తన దగ్గర పెట్టుకుంది. కొడుకులుండీ కూడా లేనిదానిలా అల్లుడు ఇంట్లో పడి వుండటం ఎంత సిగ్గులేనితనంగా వుంటుందో నీకు తెలియదు బుజ్జీ. సగం చచ్చి ఇక్కడ వుంటున్నాను. ఆ దేవుడు ఎప్పుడు నన్ను దయతలచి తీసుకు వెళ్తాడా అని ఎదురు చూస్తూ రోజులు వెళ్ళదీస్తున్నాను."

అమ్మమ్మ మాటలు వింటుంటే ఆశ్చర్యం వేస్తోంది. తాత్కాలికంగా నా బాధను మర్చిపోయాను. ఆ స్థానే ఆశ్చర్యం.

నిజం చెప్పాలంటే అమ్మమ్మ అంటే అమ్మకు చాలా ప్రేమ. ఏరోజూ అమ్మమ్మ బాధ పడేలా అమ్మ ఒక్క మాటయినా అనలేదు. అయినా అమ్మమ్మ మనసులో ఇటువంటి ఆలోచనలు వున్నాయంటే? ఇది అమ్మమ్మ తప్పుకూడా కాదు. ఇది యుగయుగాలుగా మన సమాజంలో పాతుకు పోయిన దరిద్రగొట్టు ఛాందస భావాల మహిమ. కనీసం మా తరం నుండయినా ఆ భావనా సుడిగుండం నుండీ బయటపడాలి. అమ్మమ్మ మాటలు అమ్మ వింటే చాలా బాధపడి వుండేది. అవునూ ఇంత దైన్యపు స్థితిలో కూడా నేనింకా అమ్మ గురించి.. సౌమ్యంగా ఆలోచిస్తున్నానేమిటి?

"రాగద్వేషాల్ని విడిచిపెట్టి జితేంద్రియుడైనవాడు విషయాలను అనుభవిస్తున్నప్పటికీ నిర్మలాంతఃకరుణుడవుతాడు. అటువంటి నిర్మల మనస్కునకు అన్ని దుఃఖాలు నశిస్తాయి. అటువంటివారి బుద్ధియే శ్రీఘ్రంగా నిలకడ చెందుతుంది.' - గీతలో చెప్పినట్లు, ఇన్ని ద్వేషాలను అనుభవించిన నా మనసు దుఃఖానికి అతీతమై నిలకడగా నిలిచిపోయిందా? ఏమో?

"అమ్మమ్మా నువ్వు తప్పుగా ఆలోచిస్తున్నావు. అమ్మ వింటే బాధ పడుతుంది. నిన్ను ప్రేమగా చూసుకునే నీ కన్న కూతురి దగ్గర వుండటానికై... నీ మనసున ఇంత వేదన పడుతుంటే, మరి ప్రతిక్షణం అసహ్యించుకునే వారి దగ్గర

నన్ను ఎలా వుండమంటావు చెప్పు." - నేనీ మాటలు అంటున్నప్పుడే ఆ గదిలోనే కిటికీ దగ్గర నిలిచి ఒక చేత్తో కిటికీ వూచలను పట్టుకుని బయటకు చూస్తున్న చక్రవర్తి ఒకసారి నా వేపు తిరిగి చూసి, మరల తల తిప్పుకుని బయటకు చూడసాగాడు. అతని చూపులో ఒక ఆశ్చర్యం! ఎందుకని?

"నేను లోపలికి రావచ్చా?" - గుమ్మం బయట నిలచి సుధాకర్ అడుగుతుంటే మా అత్తగారు, కాస్త వినయంగా పవిట కొంగు సర్దుకుని -

"రండి అల్లుడుగారూ" - అన్నారు.

సుధాకర్ లోపలికి వచ్చి, నా ఎదుట నిలిచి -

"చూడండి సిస్టర్. ఇది మీ భార్యాభర్తల సమస్య అయితే నేను కల్పించుకునేవాణ్ణికాదు. కానీ ఇప్పుడిది మన ఇంటి సమస్యగా రూపుదిద్దుకుంది. జరిగినదంతా గమనిస్తే - మన ఇరువురి కుటుంబాల్లోని అందరూ తమ తమ స్వార్థం కోసం మీ కన్యాయం చేసారని పిస్తోంది. ఇప్పుడు మీ తల్లిగారు, మాతోపాటు మిమ్మల్ని వెళ్ళిపొమ్మన్నారు. చక్రవర్తి ఏమనుకున్నా సరే... అతని ప్రవర్తన కూడా బావుండలేదు. ఇటువంటి స్థితి ఏ ఆడపిల్లకూ రాకూడదు. నేను సిగ్గు పడుతున్నాను. మీకు జరిగిన అన్యాయానికి బాధపడుతున్నాను. ఈ క్షణం నుండీ నేను మీకు అన్నగా.. స్నేహితునిగా వుండదలచాను. మీరు అనాథ కాదు. ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరి కోసమూ బతకరు. బతకలేరు. తరచి తరచి చూస్తే ఈ బంధాలన్నీ వ్యాపార బంధాలు. స్వార్థపు బంధాలు. లోతులు లేని, పునాదులు లేని ఈ బంధాల కోసం మీ జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దు. మీ కోసం మీరు బ్రతకాలి. దేవుడు మనకి ఒక జన్మనే అదీ ఉత్తమ జన్మ అయిన మానవ జన్మను ప్రసాదించాడు. దాన్ని మనం వ్యర్థం చేసుకోకూడదు. దయచేసి నామాట మన్నించి... ప్రస్తుతం మీరు మాతో రండి. తర్వాత ఏం చెయ్యాలో నెమ్మదిగా ఆలోచిద్దాం."

"అవును వదినా. మావారు చెప్పింది న్యాయంగా అనిపిస్తోంది. మనం వెళ్ళిపోదాం. మీ బట్టలు తెచ్చుకోండి. అమ్మమ్మగారూ మీరు వదినకు కాస్త సహాయం చేస్తారా?"

అమ్మమ్మ కళ్ళు తుడుచుకుంటూ, "ఎంతో ఘనంగా చీరా సారెలతో పంపవలసిన పిల్లను ఇలా దిక్కులేని దానిలా చేసి పంపటం... ఏం పాపం చేసుకున్నావే బుజ్జీ" -

సుధాకర్ సడన్‌గా కలగ జేసుకుని - "అమ్మమ్మగారూ మీరు ఆవిడను ఓదారుస్తున్నారా లేక బాధపెడ్తున్నారా? ఆమెకు మేమంతా పెద్దదిక్కుగా వున్నాం. దయచేసి మీరు ఆమె అవసరాలకు సంబంధించిన వస్తువులు ఇస్తే చాలు." - అన్నాడు.

అమ్మమ్మ వెంటనే - "బుజ్జీ నేనేమన్నానని. కడుపులో బాధ వుంచుకోలేక వెళ్ళగక్కాను. అదీ తప్పేనా?" - బేలగా కన్నీళ్ళు పెట్టుకుంటూ అడిగింది.

"లేదమ్మమ్మా. నువ్వు తప్పుగా ఏం అనలేదు. కొన్ని వాస్తవాలు అలానే అగుపిస్తాయి. నువ్వు అవసరం లేదు. నేను వెళ్ళి నా బట్టలు కొన్ని తెచ్చుకుంటాను. మరేం అవసరం లేదు. ముఖ్యంగా మీ నగలు." - అంటుంటే

"మీ స్టడీస్‌కి సంబంధించినవన్నీ తెచ్చుకోండి" అన్నాడు.

"ఎస్. థేంక్స్ మీకు." - అని నా గదిలోకి వెళ్ళాను. అడుగు పెడ్తుంటే అనిపించింది. ఎన్ని సంవత్సరాల అనుబంధం ఈ గదితో నాకు. నా బాల్యం . నా యవ్వనం. నా ఊహలు. నా ఆశలు అన్నీ ఈ గదికి మాత్రమే తెలుసు.

ఒంటరి తనంలో నాకు తోడై, తన నాలుగు గోడల కడుపులో దాచుకుని ఓదార్చింది.

తానో ఏకాంత ఛాయై నన్ను సేద తీర్చుకొమ్మంది.

అమ్మా - నాన్న ఇంట వదిలి మీరాతో హాయిగా బయట పార్టీలకు వెళ్ళిపోయినప్పుడంతా...

తన కిటికీ అద్దం నుండీ బయట ఆకాశాన్నీ, చంద్రుడినీ, వెన్నెలనూ, తామరలనూ, మబ్బులనూ చూపిస్తూ -

చూసావా నీ కెందరు నేస్తాలో' - అంటూ ఉత్సాహ పరిచింది.

చల్లగాలులతో చెలిమి చేయింది... పరిమళాలను కానుకగా ఇచ్చింది. ప్చ్.. ఇంత ఆదరించిన ఈ గది రాత్రి అతని కఠినత్వాన్ని ఆపలేకపోయింది. అందుకే అనుకుంటా ఇప్పుడీ గది చిన్నబోయింది. నేను నిట్టూర్చి.. నాకు కావలసిన నా వస్తువులను సూట్‌కేసులో సర్దుకుని, చివరిసారిగా గదినంతా కలయజూసి క్రిందకి వచ్చాను. అప్పటికే సుధాకర్ ఆటోలు తెప్పించి నట్లున్నాడు. అందరి సామాన్లూ ఆటోల్లో పెట్టేసుకుని, ద్వారగుమ్మం దగ్గర నిలిచి ఎదురు చూస్తున్నారు. ఒక్క చక్రవర్తి మాత్రం లేడు. నేను సూట్‌కేస్‌తో మెట్లు దిగుతుంటే చూసి సుధాకర్ గబగబా దగ్గరకు వచ్చి, నా చేతిలో సూట్‌కేస్ తాను తీసుకున్నాడు. నేను క్రింద మెట్టు వరకూ వచ్చి ఆగిపోయాను. అంత వరకూ దాగిన దుఃఖం ఇహ నిలవలేక నన్ను కాదని గొంతు నుండీ బయటకు..... వరదలా ఉధ్రుతంగా.. ఉరకబోతుంటే ఆపుకోలేక కూలిపోయాను. ఆడపిల్ల పుట్టింట్లో ఏడ్వకూడదట. (అత్తింట్లోనూ ఏడ్వకూడదట.) అందుకే కడుపులోనే దాచ ప్రయత్నిస్తుంటే సాధ్యంకాక, నా వళ్ళంతా ఎగిసెగిసి పడసాగింది. నాలోని బాధ తిమింగలమయ్యింది.

*నేను సముద్రమయ్యాను.*

*నాలోని వేదన అలలై నా శరీరాన్ని కుదిపి వేస్తుంటే -*

*ఇంతలో... నా ప్రక్కగా ఎవరో కూర్చున్నారు.*

*నన్ను తమ గుండెకు హత్తుకున్నారు.*

*నేను కష్టంపై కళ్ళు విప్పి చూసాను.*

చిన్నత్తయ్య.

*నా కంటి నీటిని తన కంటిలో వంపుకుని -*

"కొత్త పెళ్ళికూతురివి. ఏడవ కూడదు." - అంది.

*అంత యాతనలోనూ నవ్వొస్తోంది. పిచ్చిదానిలా పడీ పడీ నవ్వాలనిపిస్తోంది. ఎవరూ నా గుండెలోతున దాగిన బడబాగ్నిని చూడరేమి? ప్రయత్నించరేమి? ఈ ఆచారాలూ... సాంప్రదాయాలూ... శాస్త్రాలూ అంటూ వల్లకాటికి బాటలు వేసి మనసులను సాగనంపటం న్యాయమా దేవా?*

అమ్మ తలుపులు బిగించుకుంది మీరాతో పాటుగా.

నాన్న కనిపించటంలేదు. బహుశా పెరట్లో ఉండి ఉంటారు. నేను వెళితే కానీ వాళ్ళు బయటకు వచ్చేలా లేరు.

అలా అనిపించగానే ఇహ ఇంత కంటే ఎక్కువ సమయం ఇక్కడే ఉండటం భావ్యం కాదనిపించింది.

వెంటనే చిన్నత్త నుండీ విడివడి ... లేస్తూ -

"వెళ్ళిపోతున్నాను." - అన్నాను. అక్కడ అమ్మమ్మ... అత్తయ్యలూ... మామయ్యలు ఉన్నారు. ఖిన్నవదనులై. అందరినీ ఉద్దేశించే చెప్పాను. అమ్మ దుఃఖపూరిత హృదయంతో - "బుజ్జీ వెళ్ళిపోతాను అనకూడదమ్మా. వెళ్ళొస్తాను అనాలి." - అంది.

*ఎంత దృఢమైనవి మన చాదస్తాలు! మనిషి కంటే, మనసు కంటే కూడా ప్రాముఖ్యత పొందాయంటే? ఎంత అజ్ఞానంలో వున్నాం మనం!!* నేను జాలిగా ఆ పురాతన స్త్రీ అయిన అమ్మ వైపు చూస్తూ -

"లేదు. నేను మరెన్నటికీ ఇక్కడికి రాను. నాకిక్కడ ఎవ్వరూ లేరు. ఏదీ లేదు. మీ సాంప్రదాయపు భాషాభావనతో చెప్పాలంటే - మళ్ళీ నేను ఇక్కడికి వస్తే... మీరు పిలుస్తే నేను చచ్చిపోయినంత ఒట్టే." - అన్నాను.

"బుజ్జీ ఏం మాటలే అవి??" -అమ్మమ్మ.

"జాహ్నవీ మమ్మల్ని కూడా వదులు కుంటున్నావా?" - అత్తయ్యలూ, బాబాయిలూ అడిగారు.

నేనెవ్వరినీ వదులుకోవాలని భావించటం లేదు. నన్ను వద్దన్న వారిని మాత్రమే విడిచి పెట్టేస్తున్నా. సారీ మిమ్మల్ని బాధపెట్టి ఉంటే -" విసురుగా బయటకు వచ్చేసాను.

అందరూ నాకోసం ఎదురు చూస్తున్నారు. చక్రవర్తి ముందుగా మరో ఆటోలో వెళ్ళిపోయాడంట. నేను ఆటో ఎక్కుతుంటే" - 'అమ్మా' అనే మాట విని వెనుతిరిగి చూసాను.

నాన్నగారు కాదు. జగపతిరావుగారు.

నా భుజంపై చిన్నగా టచ్ చేస్తూ -

"నీకు ఒక పుట్టింటి తలుపులు మూసివేసినప్పుడే.. మరో పుట్టింటి తలుపులు తెరచుకుని, అవి ఆహ్వానిస్తున్నాయి. అవి నా ఇంటి తలుపులు. సుధాకర్ దగ్గర నీ అత్తింటి అడ్రస్ తీసుకున్నాను. నిన్ను చాలా ఓదార్చాలని ఉంది. కానీ ఒక్కమాటా రావటం లేదు. నీకు భగవంతుడు మేలు చేస్తాడు ఆ దుర్గమ్మ తల్లి నిన్ను కాపాడుతుంది. ఇవిగో.. ఇందాక నేను ఇచ్చిన బహుమతులు. టేబుల్ మీద ఒదిలేసావు. ఈ డబ్బు నీ అవసరాలకు వాడుకో. ఈ దుర్గమ్మ నిన్ను కాపాడుతుంది. వెళ్ళిరామ్మా." - అన్నారు.

*"పిల్లన గ్రోవికీ నిలువెల్ల గాయాలూ*
*అల్లన మోవికీ తాకితే గేయాలూ."*

## తొమ్మిదవ భాగం

*"మనిషి తన చుట్టూ వున్న వాతావరణానికి బానిస.*
*జరుగుతున్న అప్రియ సంఘటనల్ని ఆపలేని బలహీనుడు.*
*ప్రేమా... సౌఖ్యం.. ఆనందం - ఇవి ఆత్మగతమైన సంపదలు.*
*అవి ఇతరులతో పంచుకున్నప్పుడు మాత్రమే వాటిని పూర్తిగా అనుభవించగలం." - అంటారు స్పినజో.*

జగపతిరావు బాబాయిగారి మాటలకు కదిలిపోయాను. కన్నీళ్ళొచ్చేసాయి. చటుక్కున ఆయన వేపు తిరిగి ''నాన్నగారూ..'' అంటూ వంగి ఆయన పాదాల్ని నా హస్తాలతో తాకాను. నా కంటి నీటి చుక్కలు టపటపా ఆయన పాదాల పైన రాలాయి. అది అభిషేకం.

ఆయనలోని మానవత్వానికి నా కన్నీళ్ళ పూలాభిషేకం.

''తల్లీ.. తల్లీ ఏంటమ్మా ఇది'' అంటూ నన్ను లేవనెత్తి తలనిమిరారు.

ఎప్పుడూ.. ఎక్కడా ఇంత వరకూ నాకు లభించని.. తెలియని స్వాంతన ఆ స్పర్శనుండి నాకు లభించింది. నిన్నటి వరకూ ఎవరో తెలియని మానవతా పరిమళం. నేడు నన్ను ఓదార్చుతుంది. మరేదో సందేశాన్నిస్తోంది. అది నేను పూర్తిగా గ్రహించగలగాలి. ఏంటది?

నిజమైన నిఖార్సయిన మానవత్వం మాత్రమే మనుషులకు శాశ్వత సంతృప్తిని ప్రసాదిస్తుంది.

''రా జాహ్నవీ. టైమవుతోంది. ఆటో ఎక్కు'' మా అత్తగారి మాటలు మృదువుగానే వున్నాయి. నాకే భయంగా వుంది. విడిచిపోవాలి. ఈ పరిసరాలను. తప్పదు కదా? బాధగా, అమోయంగా వుంది. ఇలా జరుగుతున్నదేవిటి?!

''వెళ్ళొస్తాం అన్నయ్యగారూ'' - అన్నారు గద్గధస్వరంతో. ఆయన కంఠ స్వర శబ్దంలో ఎందరెందరో నశించి పోయిన, సమసి పోయిన గతించిన కోడళ్ళ మరణవేదన తాలూకూ భయం వినిపించింది.

''అదేంటి అన్నయ్యా అలా భయపడతారు?! నాకు అవమానంగా ఉంది. నేను మాత్రం తల్లిని కానా? నాకూ కూతురు లేదా? మొగుడు లేని ఒంటరిదాన్ని కనుక నోరు పడేసుకుంటూ, నా పిల్లల్ని పెంచుకోవలసి వచ్చింది. అందరికీ వినిపించే నా నోరే కనిపిస్తుంది కానీ, లోపల వున్న నా మనసు కనిపించదు కదా అన్నయ్యా'' అన్నారు నిష్ఠూరంగా.

''అయ్యో...అయ్యో చెల్లెమ్మా! నన్ను అపార్థం చేసుకోకమ్మా. ఏదో పరిస్థితులను చూసి అలా అనేశాను.'' - అన్నారు జగపతిరావుగారు నొచ్చుకుంటూ.

''నిజమేలెండి. మీ తప్పు మాత్రం ఏవుందిలెండీ. అన్నింటికీ పరిస్థితులే కారణం. వస్తాం అన్నయ్యా,'' అని, - నా చేయి పట్టుకుని ఆటోలో కూర్చున్నారు నాతోపాటుగా.

ఆటో కదులుతుంటే, బాబాయి నా చేతిలో ఉన్న పేక్ వైపు చూస్తూ -

''అందులో డబ్బుతోపాటు నా ఎడ్రస్ కాగితం కూడా వుందమ్మా. జాగ్రత్త.'' - అన్నారు.

నేను 'అలానే' అంటూ తలవూపాను.

ఆటో పరుగుతీసింది.

నా జీవితంలో ఒక అధ్యాయానికి తెరపడింది. మరో అధ్యాయపు తెర లేస్తోంది. ఏం చూడవలసి, అనుభవించ వలసి వస్తుందో మరి.

మరునాడు ఉదయానికి వాళ్ళ ఊరు చేరారు.

''ఇదే మనిల్లు. రామ్మా లోపలకు.'' - అన్నారు అత్తగారు.

ముత్తయిదువుల స్వాగత హారతులు లేవు. గుమ్మడికాయ, పారాణి నీళ్ళతో దిష్టితీయటం, గడపవతల నిలిపి పేర్లు చెప్పించటం ఏం లేవు. వుండవని తెలుసు. కానీ .. సాంప్రదాయపు ఆచారాలు కదా? గుర్తుకు వచ్చాయి అంతే మెడలో ఈ పసుపుతాడు లేకపోతే నాకు పెళ్ళయిందన్న నిజాన్ని నేనే నమ్మేదాన్ని కాదేమో!

చక్రవర్తీ, సుధాకర్‌లు ముఖాలు కడుక్కుని, టిఫెన్లు తెస్తామని చెప్పి బయటకు వెళ్ళారు.

చివరగా నేనూ ముఖం కడుక్కుని హాలులోకి వచ్చాను.

"అమ్మాయి ఇల్లనే సరికి ఆశ్చర్యపోయి వుంటావు కదూ?" - మా అత్తగారు నా దగ్గరికి వస్తూ అన్నారు.

నేను మాట్లాడలేదు.

చిన్న అపార్ట్‌మెంటమ్మా. సింగిల్ బెడ్‌రూం. ఇబ్బందిగానే వుంటుంది. అందుకే మీవాళ్ళకో ఉత్తరం రాసి.. పెళ్ళప్పుడు ఇస్తానన్న ఆ ఆరెకరాల పొలం ఇచ్చేయమను. ఆ పొలం మన చేతికి వచ్చేస్తే అది అమ్మేసి, ఆ డబ్బుతో పెద్ద ఇల్లు కొనుక్కుందాం. 'ఏమంటావ్?' ఆశ్చర్యపోయాను. నాకీ విషయం తెలియదు. ఎవరూ నాకు చెప్పలేదు. అసలు ఏ విషయం చెప్పారని?

జీవితం నాదే సంఘటనల తాలూకూ కర్తను నేను కాదు. అయితే ఖర్మను నేనే అనుభవించాల్సివస్తోంది.

"ఏం అమ్మా వింటున్నావా?"

"నాకేం అర్థం కావటం లేదండీ!"

"ఏం అర్థం కావాలమ్మా - తెలుగులోనేగా చెప్పాను. మీవాళ్ళు కట్నంగా ఇస్తానన్న పొలం సంగతి గుర్తుచేస్తూ ఉత్తరం రాయమన్నాను. అంతే."

"ఆ ఆరెకరాల పొలం మీకిచ్చేస్తానన్నారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఏం ఆశ్చర్యంగా అడిగావ్. ఊరికే పెళ్ళిళ్ళు అయిపోతాయా? లేదూ నువ్వు పెద్ద అందగత్తెవని కట్నం ఎదురిచ్చి చేసుకున్నామనుకున్నావా? పంతాలకీ, పట్టింపులకూ వెళ్ళక ఉత్తరం రాయి. మనకిస్తానన్న పొలం వెంటనే ఇచ్చే ఏర్పాటు చేయమను. అర్థమయిందా?"

"అమ్మా! ఇలాంటి మాటలు మా ఆయన వింటే మండి పడతారు. వదినతో అలా మాట్లాడకమ్మా. అసలే బాధలో ఉంది. ఏ ఆడపిల్లకూ జరగనటువంటి అవమానం జరిగింది. మనం ఓదార్చాలి. అంతేకానీ ఇలా మన స్వార్థం కోసం బాధ పెట్టటం మంచిది కాదమ్మా."

"నోర్ముయ్! గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించిందట. ఒంటరి ఆడదాన్నయి వుండి కూడా నీ పెళ్ళి ఘనంగా ఎలా చేసాననుకున్నావ్? డబ్బెక్కడ నుండి వచ్చిందని ఎప్పుడయినా ఆలోచించావా? మీ అత్తింటి వైపు వాళ్ళు 'కట్నం తీసుకోము ఆదర్శం' - అన్నారు కానీ పెళ్ళి వాళ్ళు చేయలేదుగా? ఆచారాలు వదులుకోలేదుగా. సారే, చీరలూ వద్దన్నారా? మరి ఆ ఖర్చంతా రాబట్టుకోవాలనుకోవటం తప్పా? పూర్వం నుండీ జరుగుతున్నదే కదా? నేనేమన్నా ఏటికి ఎదురీదుతున్నానా? కనుక అమ్మాయీ దాని మాటలు పట్టించుకోక నువ్వు మీ వాళ్ళకి ఉత్తరం రాయి.." - అన్నారు నిక్కచ్చిగా.

"నాకెవ్వరూ లేరు." - నేను నెమ్మదిగా చెప్పాను.

"ఎవరూ లేరా? ఎందుకు లేరూ? కట్నం ఇవ్వాల్సి వస్తుందని అంతా కట్టకట్టుకుని మాయమయ్యారా? లేక ... ఎగ్గొట్టటానికి నాటకాలాడుతున్నారా? వద్దు.. వద్దంటూ వాడు ప్రాధేయపడినా వాడి మెళ్ళొంచి నీతో పెళ్ళెందుకు

చేసాననుకున్నావ్? నీ చెల్లెలు మీరా గొప్ప అందగత్తె అనీ.. ఆ పిల్లకు ఆ కలక్టరు పిల్లాడితో నిశ్చయం చేస్తారనీ, అన్నీ పెళ్ళిచూపులకుముందే తెలుసుకునే, నిన్ను చూట్టానికి వచ్చాను. ఎందుకనుకున్నావ్? మీ నాన్న పెళ్ళిళ్ళ పంతులకు ఈ కట్నం గురించి ముందే చెప్పి పెట్టాడు కనుక."

ఈవన్నీ నాకు తెలియదు. వాళ్ళ దృష్టిలో నేను చచ్చిపోయానన్నారు. నాకూ వాళ్ళేం లేరు. నేనెవ్వరికీ ఉత్తరం రాయను." కచ్చితంగా చెప్పేసాను. షాక్... షాక్..షాక్ నాకంతా షాకింగ్‌గా ఉంది. ఒక జీవి జీవితంపై ఇన్ని మోసాలు జరపాలా? ఏం బంధాలివి?

"రాయవా? ఎంత పొగరు నీకు? చిల్లిగవ్వ చేతలేకుండా వచ్చి మామీద పడి తేరగా తింటానికి సిగ్గులేదా నీకు?"

నేను షాకయ్యను. ఆమె మాటలకు. పౌరుషం పొడుచుకు వచ్చింది.

"నేను రానంటే మీరే... మీరే.. న..న్ను" మరి మాటరావటం లేదు. దుఃఖమొచ్చేసింది. చాలా.. చాలా కష్టంపై ఆపుకుని అడిగాను.

"మీరు బలవంతంగా తీసుకు వచ్చారు. అక్కడ చాలా ప్రేమ చూపారు. నిజమనుకున్నాను గానీ ఇంత మోసం చేస్తారనుకోలేదు. మీరు మంచి వాళ్ళు.. అమ్మా వాళ్ళు మాత్రమే చెడ్డవాళ్ళు అనుకున్నా ను."

"అవునే, నేను మంచిదాన్ని కాదు. నటించాను. ఏం నీవాళ్ళు అబద్దాలు చెప్పలేదా? వాళ్ళలాగే నేనూ నా అవసరం చూసుకున్నాను. ఏం చేస్తావ్? నోరుమూసుకుని చెప్పినట్లు చెయ్యి. అర్థమయిందా?"

"కుదరదు. మీ.. మీ స్వార్థాలకు నేను బలికాదలచుకోలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండి.

పెళ్ళైన కొత్తలో ఆడపిల్ల చచ్చిపోతే అదీ అనుమానస్థితిలో చచ్చిపోతే, ముందుగా అత్తనీ, మొగుణ్ణీ అనుమానించి అరెస్ట్ చేస్తారు. తెలియదా?"

"ఏం కూసావ్? నన్నే ఎదురిస్తావా? ఈ కాంతమ్మ గురించి నీకింకా తెలియదే"

"అందుకే మీ కొడుక్కి పిల్లనెవ్వరూ ఇచ్చి వుండరు. నా ఖర్మకాలి నే.."

"ఏమన్నావ్?" - అంటూ ఆవిడ చెయ్యెత్తి నా మీదకు వచ్చారు.

"సరిగ్గా అప్పుడే, బయట తలుపు చప్పుడయి, కాలింగ్ బెల్ మోగింది.

"అమ్మా! వాళ్ళు వచ్చినట్లున్నారు." - మాలతి తలుపు తీయటానికి వెళ్ళింది!

"నువ్వు వంటింట్లోకి వెళ్ళు." - నన్ను ఆజ్ఞాపించి, చెంగుతో ముఖం తుడుచుకున్నారు.

నేను వంటింట్లోకి వెళ్ళాను. ఆమె మాటలు వినిపిస్తున్నాయి.

"రండి. రండి లేటయింది. హోటళ్ళు దూరంగా వుండి ఉంటాయి. వీళ్ళిద్దరూ ఆకలి వేస్తోంది అంటున్నారు. మీరొచ్చేలోపున కాస్త కాఫీ కలిపి వాళ్ళిద్దరికీ ఇద్దామని వంటింట్లోకి వెళుతుంటే... అంతలో మీరు వచ్చేశారు. ఏవీ ఆ పొట్లాలు ఇలా ఇవ్వండి. టేబుల్ మీద సర్దుతాను. అమ్మా జాహ్నవీ, ప్లేట్లు తీసుకురామ్మా. టిఫిను తిందాము."

ఎంత నటన! ఎంత నటన!! 'ఛీ..ఛీ' అనుకునేటంత నటన. నేనిప్పుడు ప్లేట్లు తీసుకుని హాల్లోకి వెళ్ళదలచుకోలేదు. ఈ నా వివర్ణమైన ముఖాన్ని సుధాకర్‌కి చూపించ దలచుకోలేదు. అందుకే కదల లేదు.

"పాపం జాహ్నవికి కొత్త కదా? ఏదెక్కడ వుందో తెలియదు కదా? మాలతీ నువ్వెళ్ళి ప్లేట్లు తీసుకుని అమ్మాయిని కూడా వెంట పెట్టుకురా సిగ్గు పడతుందో ఏమో!"

సుధాకర్ ముందు ఆవిడ చాలా బాగా సహజాతి సహజంగా నటించేస్తున్నారు.

సుధాకర్ మగవాడు కదా! ఆడవాళ్ళ మనసు లోతులు పూర్తిగా తెలిసినట్లు లేదు. ఆదర్శవంతురాలయిన అమ్మమ్మ సంరక్షణలో పెరిగినవాడు కదా? అయినా ఒక్క సుధాకరనే ఏముంది? ఏ ఇంట్లో లోటు పాట్లయినా మొదటిగా తెలిసేది ఇంటి ప్రక్కల ఆడవారికి, వాళ్ళ ద్వారా వారి భర్తలకూ చేరతాయి. అయితే ఆడవారికి మల్లే ఏ పురుషుడూ ఆ విషయాన్ని ఆ ఇంటి మగవారికి చెప్పలేరు కదా? ఈ కారణం మూలంగానే సొంత ఇంటి విషయాలు పురుషులకు పూర్తిగా తెలియవు.

అదీ కాకుండా భార్యను అనుమానించి... అవమానించినంత తొందరగా మగవాడు తల్లిని చెడుగా భావించడు. ఊహించడు కూడా. అందునా ఇంతంత గొప్పగా నటించే ఆడవారి విషయంలో ఏ మగాడైనా మోసపోవలసిందేకదా? ఈ విషయంలో సుధాకర్ అతీతుడేం కాదూ. మాలతిని చూస్తుంటే అర్ధమయినదేవిటంటే ఆమె భర్త ముందు పుట్టింటివారిని తేలిక పరచి.. తను తేలిక పడదని. అదే మా అత్తగారికి ప్లస్ పాయింట్ అయింది. సుధాకర్ ముందు మా అత్తగారు సొంత తల్లికంటే ఎక్కువ ప్రేమ చూపించారు. నిజమని నమ్మిన సుధాకర్, రెండు రోజుల తర్వాత మాలతిని తీసుకుని వెళ్ళిపోయాడు.

"నువ్వేం ఆలోచించకు బాబూ. వాళ్ళిద్దరికీ రాజీ చేసి కలిపే బాధ్యత నాది. నా కళ్ళ ముందు నాకొడుకూ కోడలూ సంతోషంగా వుండటం కంటే నాకీ వయసులో కావలసింది ఏవుంది చెప్పు బాబూ." అన్న మా అత్తగారి మాటలు నిజమని నమ్మాడు. నిశ్చింతగా వెళ్ళాడు. మాలతి మాత్రం, వాళ్ళాయనకు తెలియకుండా, వాళ్ళమ్మతో - "అమ్మా వదినను బాధపెట్టకు. ఇక్కడేమయినా జరగరానిది జరిగితే మా ఆయన నన్ను వెంటనే నీదగ్గరకు పంపేస్తాడని మరచిపోకు." - అని చెప్పి వెళ్ళింది.

తల్లికే కాదు, నాకూ చెప్పింది.

"వదినా ఇలా చెపుతున్నానని ఏమనుకోవద్దు. నిప్పు మీద నీళ్ళు చల్లితే ఆరిపోతుంది. అదే నిప్పు మీద నూనె వేస్తే మంటలు లేస్తాయి. సహనం నీరు. అసహనం నూనె. తెలివైనదానివి అర్ధమయిందనుకుంటా. నీ జీవితం బాగుండాలనీ... సంతోషంగా వుండాలనుకునే వాళ్ళలో మేమిద్దరం మొదటివాళ్ళమని గుర్తుంచుకో వదినా. వస్తాను" - అంది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. తక్కువ సమయంలో ఎక్కువగా మనసులో చోటు చేసుకున్న ఆప్తులు వాళ్ళు వెళుతుంటే మనసు నిండా దిగులు ఆవరించింది.

ఇంట్లో పనిమనిషి లేదు.

ఈ అపార్ట్మెంటులోకి ప్రవేశించిన వెంటనే బయటి ప్రపంచపు తలుపులు నా పట్ల మూసుకుపోయాయి.

పుస్తకాలు మోసిన చేతులూ. కాంక్షలు నిండిన తనువూ ఏ అనుభుతులూ నోచకనే యంత్రంగా మారిపోతున్నాయి.

ఇంట్లో పని చేసుకోవటం తప్పుకాదు. కానీ, ఏసంబంధమూ ఏర్పడని ఈ మనుషుల కోసం నా నిండు జీవితాన్ని నిర్వీర్యం చేయటం న్యాయమా? కాదుగాక కాదు. మరేం చేయాలి? ఎలా నన్ను నేను చక్క పరచుకోవాలి?

సరిగ్గా ఇటువంటి సమయంలోనే జగపతిరావు బాబాయిగారూ, ఆయన భార్య జానకమ్మగారూ వచ్చారు. 'అమ్మాయి వెంట సారె పంపలేదుకదమ్మా. తీసుకు వచ్చామ'ంటూ.

నటన తెలియని స్వచ్ఛమైన మనుషులను మోసం చేయటానికి, మా అత్తగారు మరోమారు నా పట్ల ప్రేమను నటించసాగారు. ఇక్కడకు వచ్చిన ఇన్ని నెలల తర్వాత ఇప్పుడు మొట్టమొదటి సారిగా పిన్నీ బాబాయిల వెంట బయటకు వెళ్ళాను. మా అత్తగారూ, చక్రవర్తీ కూడా మంచి కంపెనీ ఇచ్చారు. కొత్తగా చూసేవాళ్ళకు మేమంతా హేపీఫేమ్లీలో మెంబర్లులానూ, 'పాపం నేను మాత్రం మూగమ్మాయినేమో'లా అనిపిస్తుంది.

ఇంట్లో అందరికీ పట్టుబట్టలు కొన్నారు. మాలతికి, సుధాకర్‌కి కూడా. బట్టలషాప్‌కి తీసుకువెళ్ళి మీకేమిష్టం? మీ అబ్బాయికి? మీ అమ్మాయికి? మీ అల్లుడుగారికి? - అంటూ బలవంతం చేసి మరీ కొన్నారు పిన్ని... బాబాయిలు. ఒక్క నన్ను మాత్రం ఎవరూ ఏమీ అడగలేదు. నాకేమీ కొనలేదు.. అప్పుడు తట్టింది. ఈ బహుమతుల వెనక ఎవరు వున్నారు? ఎస్. అమ్మానాన్నలు. వాళ్ళు రాలేక జగపతిరావు బాబాయి దంపతులను పంపి పెళ్ళిలో చేయని ఆచారాలను ఇప్పుడు.. ఇలా వీళ్ళద్వారా జరిపిస్తున్నారా? మా అత్తగారు లేని టైం చూసుకుని పిన్ని... బాబాయిగార్లను నిలదీసాను. "ఎందుకింత డబ్బు ఖర్చు పెడుతున్నారు - వీళ్ళకోసమంటూ. మొదట చెప్పలేదు. బాగా అడిగి... అలిగితే చెప్పారు. అ..మ్మ..మ్మ. అమ్మమ్మ. నన్ను ప్రేమించిన అమ్మమ్మ. వీళ్ళు నన్ను బాగా చూసుకోవాలనే కోర్కెతో బాబాయి, పిన్నిగారిని పంపింది.

అమ్మకాదు..

నాన్న కాదు..

"ఎలా కనిపెట్టావమ్మా?" - పిన్నిగారు అమాయకంగా అడిగారు. 'నాకేమీ తేలేదు కదా' అని నిజం చెప్పలేదు. "అనిపించింది.. అంతేనండి." - అన్నాను.

ఒక మాయను నిజమని నమ్మి సంతృప్తి చెంది, ఈ అబద్ధపు ఆనందం. దాన్ని అమ్మమ్మకు చేరవేయటానికై వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన వెంటనే మెటికలు విరుచుకుంటూ మా అత్తగారు, 'దొంగ వేషాలు, దొంగ వేషాలు. ఎవరికి తెలియదు. అందులోకీ మాముందా దాగుడు మూతలూ, నాటకాలూనూ. వేలు ఖర్చుపెట్టి నాలుగు గుడ్డలు కొని ముఖాన పడేస్తే, లక్షలు దాచుకోవచ్చు నుకుంటున్నారు కాబోలు. చూపిస్తా నేనంటే ఏవిటో." - నాకు వినిపించేలా తిట్ల వర్షం కురిపించారు. నేను పట్టించుకోలేదు.

వచ్చి నాలుగు నెలలైంది.

బాబాయిగారు ఉత్తరాలు రాస్తున్నారు. ఎలా వున్నావమ్మా అంటూ. రెప్లై కార్డు పెట్టి మరీ రాస్తున్నారు. నేను తిరిగి ఉత్తరం రాయటం ఇష్టం లేకపోయినా మా అత్తగారికి అంగీకరించక తప్పటంలేదు. సుధాకర్‌కి చెప్తారని భయం. సుధాకర్... మాలతి నెలకు ఒకసారి వచ్చి రెండురోజులు వుండి వెళుతున్నారు. ఆ రెండురోజులూ ఈ నా శరీర యంత్రానికి రెస్ట్.

మొట్టమొదటిసారిగా చక్రవర్తి బయట ఊరికి కేంప్‌కి వెళ్ళాడు. వారం రోజులు కేంప్ అట.

కొడుకు బయటకు వెళితే మా అత్తగారు భోజనం చేసి, ఇరుగు.. పొరుగు ఇళ్ళకు వెళ్ళి పోతారు. ఆ వెళ్ళేటప్పుడు బయట తాళం వేసుకుని మరీ వెళ్తారు. పక్క ఇళ్ళవాళ్ళెవరూ ఈ ఇంటికి రారు. కారణం నాకు తెలియదు. ఉదయం సూర్యుడు ఉదయించటం, రాత్రి అస్తమించటంలాంటి క్రమమే కదా నా జీవితం కూడా. వండిపెట్టటం వాళ్ళకు. వాళ్ళు తిన్నాక నేను తినటం. తర్వాత ఇంటి పనంతా పూర్తి చేయటం. ఇద్దరూ నాతో మాట్లాడరు. మౌనంతో శిక్షిస్తున్నారు. బహుశా పిచ్చిపట్టేలా చేసే ప్లాను అనుకుంటా.

చక్రవర్తి కేంప్ నుండి వచ్చాడు.

బయటి తిండి పడినట్లుంది. మనిషి తేటగా వున్నాడు. సంతోషంగా వున్నాడు. ముఖంలోకి సంతృప్తి కళ కనిపిస్తోంది.

ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

నాన్నగారూ కేంప్‌కి వెళ్ళేవారు. నాలుగురోజులకే ముఖం వేలాడేసుకుని నీరసపడి వచ్చేవారు." బయట తిండి పడలేదు. నీ చేతి వంట తొందరగా పెట్టు మధూ" - అనేవారు. నిజంగానే నీరంసంగా కళా... కాంతీ లేకుండా వచ్చేవారు.

మరి ఇదేంటీ? ఇతని తీరు వేరుగా వుందేమిటి?! అయినా నాకెందుకు? ముందు ఇతనికి విడాకులు ఎలా ఇవ్వాలి? ఎవరు సహాయం చేస్తారు నాకు? అసలు నాకోసం ఎవరున్నారు? బాబాయిగారికి చెపితే? అసలీ ఆలోచనే తప్పు. అసలు ఈ మాటే ఆయనకు మింగుడు పడదు. మరి ఎలా?

"ఒరే అబ్బాయ్! ఇలా ఎంత కాలంరా. వాళ్ళూరు వెళ్ళి వాళ్ళని నాలుగు దులిపేసి, ఆ పొలం తాలూకూ పేపర్లు తెచ్చుకుందామంటే నువ్వు ఆగమంటావ్?

ఇది చూస్తే మూగదయ్యంలా మొండికేస్తోంది.

అక్కడ ఊర్లో అక్క ఇంటి మీద తెచ్చిన 'అప్పూ - వడ్డీ' పెరిగిపోతోంది. మీ అక్కకిచ్చిన ఇంటి మీద అప్పు తెచ్చామని తెలిస్తే, మీ అక్క పరువూ... కాపురం నీ బావముందు ఏమవుతుందో ఆలోచించు."

మైగాడ్! షాక్స్ మీద షాక్స్. ఏమిటీ వీళ్ళ బ్రతుకులు!

ఎలాంటి మనుషులు మధ్యకి వచ్చి పడ్డాను.

మీరాకి పట్టం కట్టటానికై నా జీవితాన్ని బలిచ్చారు నా తల్లి తండ్రులు.

"నువ్వేమీ వర్రీ అవ్వకమ్మా! అంతా మనకే వస్తుంది. కొంచె కాలం ఓపిక పట్టు." - చాలా నమ్మకంగా చెప్పాడు చక్రవర్తి.

"ఎలా వస్తుందిరా? ఎవరిస్తారు?"

" చూస్తావుగా."

కేంప్‌కి వెళ్ళి వచ్చిన తర్వాత చక్రవర్తిలో మార్పుకనిపిస్తోంది. (నాపట్ల కాదు.) సరిగ్గా ఈ సంభాషణ జరిగిన రెండు రోజులకు ఊరులోని అప్పులవాళ్ళ నుండీ ఉత్తరం వచ్చింది.

చక్రవర్తీ.. ఆమె ఇద్దరూ ఊరికి వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళే ముందు నాచేత హామీ పత్రం రాయించుకున్నారు.

'వాళ్ళు ఊర్లోలేని సమయంలో, నేనేమైన అఘాయిత్యం చేసుకున్నా, ఇల్లు విడిచి పారిపోయినా ఆ బాధ్యత పూర్తిగా నాదే తప్ప, వాళ్ళకేమీ సంబంధము వుండదు." - అని. నాకు కూడా అభ్యంతరం కనిపించలేదు. చేతిలో డిగ్రీ లేదు, డబ్బులేదు. ఇటువంటి స్థితిలో నేను బయటపడి ఏం చేయగలను?! అందుకే నిశ్చింతగా వారు కోరినట్లుగా రాసి సంతకం పెట్టి ఇచ్చేసాను.

వాళ్ళిద్దరూ ఊరికి వెళ్ళారు. చాలా కాలం తర్వాత... ఒక్కర్తినే... ఎంత హాయి. నేను స్వేచ్ఛను శ్వాసిస్తున్నట్లుగా అనుభూతించాను.

మొట్టమొదటి సారిగా ఎదుటి అపార్ట్‌మెంటుకి వెళ్ళి తలుపు తట్టాను. తమిళియన్లు. మొదట ఆశ్చర్యంగా చూసారు. ఎదుటి అపార్ట్‌మెంటులో వుంటున్నానని ఇంగ్లీషులో చెప్పాను.

"కొత్తగా వచ్చావా అని" - తమిళంలో అడిగారు. అర్ధమైంది కానీ ఇంగ్లీషులో జవాబిచ్చాను.

'నాలుగు నెలలైంది ఇక్కడికి వచ్చి' - అని చెప్పాను.

ఆశ్చర్యపోయి లోపలకు ఆహ్వానించారు ఆదరంగా.

సరిగ్గా నాలుగు రోజుల్లో మా (?) అపార్ట్‌మెంటులో ఉన్న పన్నెండు కుటుంబాల వాళ్ళూ పరిచయమయ్యారు.

నాలుగో రోజు చక్రవర్తి ఒక్కడే వచ్చాడు. ఆమె రాలేదు. 'ప్చ్... ఇంత తొందరగా ఇతను రాకుంటే ఎంత బావుణ్ణు' - అనిపించింది. కానీ వచ్చేసాడుగా. తిరిగి ఇంటి పని ప్రారంభం. అయితే ఇందులోనూ ఒక ఊరట వుంది. చక్రవర్తి బయటకు వెళ్ళిన తర్వాత, నేను అపార్ట్‌మెంటుకి తాళం వేసుకుని ఎదుటి అపార్ట్‌మెంటుకీ, మరో అపార్ట్‌మెంటుకీ వెళుతున్నా. కాలక్షేపానికి కాదు. 'నన్ను నేను ఎలా పునరజ్జీవింప చేసుకోవాలా' - అనే అన్వేషణ నాది. ఈ అపార్ట్‌మెంట్స్‌లోని చాలామంది స్త్రీలు జాబ్ చేస్తున్నారు. ఈ మధ్య చక్రవర్తి తరచూ కాంప్‌లకి వెళ్తున్నాడు. అతనిలో మరింతగా ఓ వింత మెరుపు కనిపిస్తోంది. వాళ్ళ అమ్మ వున్నప్పుడు ముభావంగా, ముఖం ముడుచుకుని వుండేవాడు. ఇప్పుడు చురుకుగా.. హేపీగా వున్నాడు అతనికి అమ్మంటే ప్రేమ అన్నాడు. మరి తల్లి దగ్గర లేనందుకు కాస్తయినా డల్‌గా వుండాలిగా! ఎందుకు లేడు?! అసలు ఇటువంటి ఆలోచన నాకు రాకపోవును.

ఎదురింటి తమిళ ఆంటీ చాలా స్మార్ట్ అండ్ ఏక్టివ్.

ఆ ఆంటీ -

"జాహ్నవీ ఏమీ అనుకోకు. నువ్వు చూస్తే పెళ్ళైన కన్నెపిల్లలా వున్నావు. అతను చూస్తే ఖుషీగా, రిలాక్స్‌డ్‌గా అనిపిస్తున్నాడు. దానికి తోడు ఆడవాళ్ళకు మోహం కలిగించే రూపం అతనిది. ఎక్కడో రెండో ఫేమ్లీ నడుపుతున్నాడని నా కనుమానం. జాగ్రత్త పడు. లేకుంటే నష్టపోతావ్." - అన్నారు.

అంత వరకూ నాకు చక్రవర్తి పట్ల ఆ విధమైన ఆలోచన రాలేదు అనుమానించటానికి అనుభవమూ లేదు కదా?

ఆంటీ చెప్పిన తర్వాత చక్రవర్తిని బాగా గమనిస్తున్నాను. ఆంటీ చెప్పింది నిజమే అనిపిస్తోంది.

అదీ కాకుండా ఈ మధ్య చక్రవర్తి నెలలో ఇరవైరోజులు బయటే ఉంటున్నాడు.

ఈ ఊర్లో మరో ఇల్లు పెట్టాడో?

ఎవరై ఉంటారు? ఎవరామె?

మీరా కాదు కదా? మనసు జలదరించి ఉలికి పడింది.. కాదు.. కాదు మీరా కాదు. మీరా ఇక్కడ ఎలా వుంటుంది?

ఒకవేళ చక్రవర్తి అక్కడికి వెళుతున్నాడా?

అవును .. కాదు. అవునూ... కాదు. ఏదనుకోవాలి?

ఒకవేళ అలాంటిదేమైనా వుంటే అమ్మావాళ్ళు గ్రహించకుండా వుంటారా? వుంటే... నిజంగా వుంటే ఇప్పటికి పెద్ద గొడవ జరిగిపోదా? జరుగుతుంది. ఈసరికి చక్రవర్తిని నిలువునా చీల్చి చెండాడివుండేవారు. కానీ అమ్మా వాళ్ళ బేడ్‌లక్. హఠాత్తుగా.. ఊహించని రీతిలో ఆరోగ్యంగా తిరుగుతున్న సాయిరామ్‌గారి బామ్మ నిద్రిస్తూనే శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోయారట.

ఆ తర్వాత మూడు నెలలకు ఏక్సిడెంటులో సాయిరామ్‌గారి తండ్రి చనిపోయారంట. అది చూసి తల్లి షాక్‌లోకి వెళ్ళిపోయారంట. పాపం సాయిరాం. అందాల బొమ్మ మీరా పెళ్ళికి ఎంతెంత భయంకరమైన ఆటంకాలు!

ఇటువంటి స్థితిలో సాయిరాం దగ్గర పెళ్ళి ప్రసక్తి తేనూ లేక ఆగనూలేక అమ్మా వాళ్ళు ఫోను ద్వారా సాయిరాంకి మాత్రం టచ్‌లో ఉన్నారంట. మీరా కాలేజ్‌కి వెళుతోందట. దీనినే విధివైచిత్రం అనాలేమో.

జగపతిరావు బాబాయిగారి ద్వారా ఈ విషయాలన్నీ నాకు తెలిసాయి. ఇంత జరిగినా వాళ్ళ అహంకారంలో మార్పురాలేదు.

మీరాకి జరిగే ప్రతీ నష్టానికీ కారణం నేనుగా భావిస్తున్నారట. నాకిప్పుడు ఎవ్వరి మీదా ప్రేమలేదు. అభిమానం లేదు. బెంగా లేదు. నెగ్గాలి. నెగ్గాలి. నన్ను బాధ పెట్టిన వాళ్ళందరూ బాధతో తలవంచుకోవాలి. సిగ్గుపడాలి. అదే నా నిరంతరాలోచన.

కొద్దీ.. కొద్దిగా పరిస్థితులు నాకనుకూలంగా మారుతున్నాయనుకున్నాను. చక్రవర్తి తల్లి ఊర్లోనే ఉన్నారు. కాలు జారిపడటంతో ఇప్పుడప్పుడే ఇక్కడికి రారు. నేను డిగ్రీ పూర్తిచేసేందుకై మా అపార్ట్‌మెంటులో ఉన్న రమ సహాయం చేస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలో చక్రవర్తికి తల్లి నుండీ ఉత్తరం ... నన్ను తల్లిని చేయమని.

'అమ్మ చెప్పింది. నేను నిన్ను పెళ్ళిచేసుకున్నాను... 'అమ్మ చెప్పినట్లు చేస్తున్నానన్న' పెద్దమనిషి.. ఇపుడేం చేస్తాడు?

ఈ ఉత్తరం చదువుకుని తల్లి ఆజ్ఞ ప్రకారం. ఈ గొంగళిపురుగును తల్లిని చేస్తాడా? ఏం చేస్తారు శ్రీమాన్ శ్యామ సుందర చక్రవర్తి గారు!!

అతని రాక కోసం, ఈ ఉత్తరం చదివిన తర్వాత అతను ఏం చేస్తాడు అనేదానికోసం ఆత్రుతగా ఎదురు చూడసాగాను.

# పదవ భాగం

"నిన్ను నీ కోసం ఆవిష్కరించుకుంటే -
నిన్ను నీ ముందుకు తెస్తే -
నిన్ను నువ్వు చూసుకుంటే -
నిన్ను నువ్వు మార్చుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది.
నిన్ను నువ్వు మార్చుకోవటం ద్వారా నీలోని ప్రతిదీ మారే అవకాశముంది."

- హువాచింగ్‌ని

**చాలా సార్లు ఇంతే**

దేనికోసమయితే మనం ఆత్రుతగా వేయికళ్ళు చేసుకుని ఎదురు చూస్తామో, అవి మన్ని ఊరిస్తూ, ఆటపట్టిస్తూ మరీ మరీ ఆలస్యం చేస్తాయి. చక్రవర్తి వెళ్ళి ఇరవైరోజులు అయింది. ఎప్పుడూ ఇంచుమించు ఇరవై రోజులలో వచ్చేసేవాడు. ఈ సారి లేటు అయింది. కారణం తెలియదు. అతను ఊరికి వెళ్ళే ముందు, కొంత డబ్బు టేబుల్ మీద పెట్టి వెళతాడు. నా దగ్గర బాబాయ్‌గారు ఇచ్చిన పదివేలు అలానే ఉన్నాయి. అందుకని మొదట్లో అతని డబ్బు వాడటానికి (కూరగాయలకూ, అదీ అన్నమాట) సంకోచించాను. బాగా ఆలోచించిన మీదట, అతని డబ్బు వాడటం తప్పు కాదనిపించింది. నా జీవితంతో ఆడుకుంటున్న వారికి ఆమాత్రం నష్టం చేయటం, చాలా న్యాయం అనిపించింది.

అదీ కాకుండా తిరిగి ప్రవేటుగా చదవటం ప్రారంభించాను కనుక, డబ్బు అవసరం చాలానే ఉంది.

చక్రవర్తి ఇంకా రాలేదు. అతనికి ఆ ఉత్తరం ఇవ్వాలి. తర్వాత అతను ఏం చేస్తాడోనని ఆత్రంగా ఉంది.

ఇంతలో ఓ గొప్ప విచిత్రం జరిగింది.

ఎదురు అపార్ట్‌మెంటులో ఉంటున్న తమిళ ఆంటీ ఫ్రెండ్స్‌ని డిన్నర్‌కి పిలిచి, ఒక్కర్తినే ఉన్నానని నన్నూ డిన్నరికి ఆహ్వానించారు.

మొదట సంకోచించాను. తెలియని వాళ్ళతో కలిసి భోజనం చేయటానికి

ఆంటీ బాగా బలవంతం చేసారు. నలుగురిలో చక్కగా కలిసి పోవడం ఒక ఆర్ట్ అట. "భగవంతుడిచ్చిన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి గానీ ఖైదు చేసుకోకూడదు. నువ్వు వస్తున్నావు. తల్లిలా చెపుతున్నాను." అన్నారు.

ఇంకేమంటాను. 'సరే' అన్నట్లుగా తల ఊపాను.

టైమ్ సాయంత్రం 7.30 అయింది.

వెళ్ళాలా? కాస్త కంగారుగా ఉంది. కొత్తవాళ్ళెవరో. ఎలాంటి వాళ్ళో, అంతా తమిళంలో మాట్లాడుకుంటారు. నేను ఒక్కర్తినే భాష వేరు. వాళ్ళకి ఇబ్బందే కదా? ఆంటీ ఎందుకిలా చేసారు?

ఇంతలో తలుపు తట్టిన శబ్దం. తెలుసు ఆంటీనే. వదలరు. వెళ్ళి తలుపు తీసాను.

"రా అమ్మా! వాళ్ళు వచ్చేసారు." - అన్నారు ఆంటీ.

నేను మొహమాటంగా నిలబడ్డాను.

"రా జాహ్నవీ" - అంటూ నా చేయి పట్టుకుని, బయటకు తీసుకు వచ్చి తనే మెయిన్ డోర్‌కి గెడ పెట్టారు.

నేను నెమ్మదిగా ఆంటీతో వాళ్ళింట్లోకి అడుగు పెట్టాను.

ఎదుటి సోఫాలో ఆంటీ వాళ్ళ అబ్బాయి సుందర్ కూర్చున్నాడు. నన్ను చూస్తూనే - "ప్లీజ్ కమ్" - అంటూ లేచి నిలబడ్డాడు.

గుమ్మానికి వెనక చేసుకు కూర్చున్న ఇద్దరు వ్యక్తులు వెనక్కి తిరిగి చూసారు. నేను వాళ్ళ వేపు చూడక పోయినా, వాళ్ళు తలలు తిప్పి నన్ను చూడ్డం గ్రహించాను.

"జాహ్నవీ మీరా?!" - అందులో ఒకతను నన్ను చూస్తూ ఆశ్చర్యంగా కాస్త గట్టిగానే అన్నాడు.

నేను చటుక్కున అటువైపు చూసాను.

చప్పున గుర్తురా..లే..దు, అనిపిస్తున్న సమయంలో గుర్తు పట్టాను. వివేక్!!!

"వివేక్, మీరా?!" - సంతోషంగా ... ఎగ్జైటింగ్‌గా... ఇంకా చాలా చాలా భావ సమ్మేళనాలు మిశ్రమంచేస్తూ అన్నాను.

అతను సంతోషంగా లేచి నిలబడ్డాడు.

"ఎలా ఉన్నారు జాహ్నవీ? అసలు మీరేనా? ఇది నిజమేనా అనిపిస్తోంది తెలుసా?" ఎంత ఆప్యాయత ఆ గొంతులో. ఎన్ని యుగాల తర్వాత అమ్మా వాళ్ళ ఇంట్లో చూసిన వ్యక్తిని... మరల చూస్తున్నాను! నాకు కలలా ఉంది. కమ్మని కల. ఇష్టమైన కల కాదు కదా? ఆ రోజు వెళుతూ." మళ్ళీ కలుద్దాం" అన్నాడు అతను అన్నట్లే జరిగింది. వివేక్ సడన్‌గా పక్క వ్యక్తిని చూస్తూ -

"హాయ్ సాయిరాం.. ఈమే జాహ్నవి. ఆ జాహ్నవి. ఆ అమ్మాయి వాళ్ళ సిస్టర్." అన్నాడు సాయిరాం. సాయిరాం కూడా వచ్చాడా? ఎదుటే ఉన్నాడా! చూస్తున్నానా? సాయిరాం... అతనిచ్చిన బుద్ధ విగ్రహం. నా సూట్‌కేస్‌లో జాగ్రత్తగా ఉంది. నాకే ఈ ఇంట స్థలం లేకపోవడం వలన బుద్ధుని విగ్రహాన్ని నా బట్టల మధ్యే ఉంచేసాను. సాయిరాం - సుకుమారంగా, సున్నితంగా ఉన్నాడు.

కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తున్నా. ఈ వ్యక్తి.. ఈ వ్యక్తి. మీరాకి కాబోయే భర్త అయిన ఈ సాయిరాంని ఇలా ఇంత హఠాత్తుగా చూస్తాననుకోలేదు "మీరు సాయిరాం. మీరే సాయిరాం", ఇంకేం మాట్లాడాలో తెలియటంలేదు

"నేనే సాయిరాంని జాహ్నవిగారూ" - అన్నాడు. అతని మాట మహా మృదువుగా... మెత్తగా ఉంది. ఎంతో.. ఎంతో సౌమ్యంగా కనిపిస్తున్నాడు.

అమ్మలానో.... అక్కలానో అతని చేతిని నాచేతిలోకి తీసుకోవాలనిపిస్తోంది. కదలలేక పోతున్నా.. కన్నీరొచ్చింది. కంటిరెప్పల వెనక దాచేసాను. మీరాకి బుద్ధి లేదు అనిపించింది.

"అయితే మీరు ఒకరికి ఒకరు ముందే తెలుసన్నమాట! చూసావా రాను రాను అన్నావ్. ఎంత 'మిస్' అయి ఉండేదానివి." - ఆంటీ అన్నారు.

నిజంగానే ఎస్. చాలా చాలా మిస్ అయ్యేదాన్ని. నేను ముందుకు కదిలి ఆంటీ చెయ్యి పట్టుకుని, "చాలా చాలా థేంక్స్ ఆంటీ." - అన్నాను.

"సరే... సరే, కూర్చో. చక్కగా మాట్లాడుకోండి. అంతలో నేను డిన్నర్ రడీ చేస్తాను."
అంటూ ఆంటీ వంటింటి వైపు వెళ్ళారు. సుందర్, తనూ హెల్ప్ చేస్తానంటూ ఆంటీ వెనకాలే వెళ్ళాడు.

వివేక్, సాయిరాంలకు ఎదురుగా నేను కూర్చున్నాను.

నాకిప్పటికే ఎలాగెలాగో ఉంది. నిజమా? నా చుట్టూ ఆవరించిన శూన్యం కరిగిపోతుందా? నేను మరల మనుషుల్లో పడుతున్నానా?

"ఎలా ఉన్నారు?" మరల వివేక్ అడిగాడు.

ఏమని చెప్పాలి? నువ్వు తప్ప మరో జవాబు నా దగ్గర లేదు.

"మీ ఇల్లు దగ్గరేనా?" - వివేక్ అడిగాడు. సాయిరాం నన్నే చూస్తున్నాడు.

"ఎదురింట్లో ఉంటున్నాను." - అన్నాను.

'ఉంటున్నాను' - అంటున్నారు. మీరొక్కరే ఉంటున్నారా? మీ వారితోనే కదా ఉండేది?" ఈ వివేక్ చాలా తెలివైనవాడు. అన్నింటినీ తొందరగా గ్రహించేస్తాడు. I.P.S కదా నా సన్యాసపు సంసారం గురించి ఏమి చెప్పాలో తెలియక, సాయిరాంగారిని చూస్తూ

"ఐయామ్ సారీ సాయిరాం గారూ! నాన్నగారు పోవటం గూర్చి విని చాలా బాధపడ్డాను. అమ్మగారి ఆరోగ్యం ఎలా ఉంది? కాస్త అయినా కోలుకున్నారా?"

"లేదండీ. అమ్మని చూస్తే జాలి వేస్తుంది. నాన్నగారు లేరనే షాక్ నుండీ అమ్మ ఇంకా తేరుకో లేదు." - సాయిరాం చాలా బాధగా చెప్పారు.

"అమ్మ ఎక్కడ ఉన్నారు?"

"ఇక్కడే నా దగ్గరే ఉన్నారు?"

"ఇక్కడే అంటే, మీరు ఈ ఊర్లోనే ఉంటున్నారా?" - ఆశ్చర్యంగా అడిగాను.

"అవును నేనిక్కడకు జాయింట్ కలెక్టరుగా ఈ మధ్యే వచ్చాను. "

"వివేక్ గారు?" -

"తను కూడా ఇక్కడే అడిషనల్ ఎస్పీగా ఉన్నాడు."

"అరే! ఇవేమీ నాకు తెలియదు."

"మీ పేరెంట్స్ చెప్పలేదా?" - వివేక్ అడిగాడు.

క్షణం నా ముఖం వాడి పోయింది. నన్ను నేను సర్దుకుని చెప్పాను.

"నేను వాళ్ళకి అక్కర్లేదని చెప్పారు." - చాలా నెమ్మదిగా చెప్పాను.

"అదేం?" - సాయిరాం ఆశ్చర్యంగా అడిగారు.

ఏం చెప్పను నేను? చక్రవర్తి ... మీరాల గురించి చెప్పాలా? ఏమని చెప్పాలి?

"మీ పెళ్ళి ఎప్పుడు?" - సడన్‌గా అడిగాను. అడిగిన తర్వాత నాలుక కరచుకున్నాను.

"సారీ. ఈ ప్రశ్న ఇప్పుడు అడగ కూడదు నేను. సారీ. రియల్లీ సారీ" అన్నాను. అంతలో ఆంటీ వచ్చారు. 'డిన్నర్ రడీ రండి.' - అంటూ

"ఒక్క నిముషం కూర్చోండి ఆంటీ. మీకో మాట చెప్పాలి " - వివేక్ అన్నాడు

ఇంతలో సుందర్ కూడా వచ్చాడు. "ఆకలి వేయటం లేదా మీకు? అమ్మ మంచి ... మంచి డిషెస్ చేసింది. రండి. రండి." - సుందర్ తొందర చేసాడు.

"వీళ్ళేదో చెప్పాలనుకుంటున్నారు. ఒక్క నిముషం కూర్చో సుందర్." - ఆంటీ అన్నారు.

"నో... నో... ఏదైనా డిన్నర్ తర్వాతే.. రండి.. రండి" - సుందర్ తొందర చేసారు, మరల.

"లాభం లేదు వీడికి ఆకలి వేస్తే ఎవర్నీ నిలువ నీయడు. లేవండి. డిన్నర్ అయిన తర్వాత, మేడ మీదకు వెళ్ళి మాట్లాడుకుందాం. సరేనా"

"ఓ.కే ఆంటీ." - అంటూ వివేక్ లేచాడు. అందరం ఫాలో అయ్యాము. నిజంగా ఆంటీ చాలా చక్కగా, రుచిగా వండారు.

కానీ నేను ఎంజాయ్ చేయలేక పోయాను.

మనసు బరువుగా ఉంది. ఎవరి హోదాను చూసి నా తల్లితండ్రులు ఆశపడి, నాకు అన్యాయం చేసారో, ఎవరి మూలంగా, ఎవరి కోరిక మూలంగా నా జీవితంలో అన్నింటినీ పోగొట్టుకున్నానో ఆ వ్యక్తి నా కళ్ళ ఎదుటే ఉన్నాడు. నాటి స్థితికి కారణం? ఈ వ్యక్తేకదా?

అతను ఒక అందమైన మంటను చూసి ఆశపడ్డాడు. ఫలితంగా నా జీవితం కాలిపోయింది.

"జాహ్నవీ ఏమాలోచిస్తున్నావ్? సరిగా తినటం లేదు." - ఆంటీ హెచ్చరించారు. డిన్నర్ టేబుల్ దగ్గర కూడా ఎక్కువ ఆంటీ... వివేకే మాట్లాడారు. సుందర్ సహజంగానే నెమ్మదయిన వ్యక్తి.

సాయిరాం? ఏమో. నాకింకా అతని గూర్చి సరిగా తెలియటం లేదు.

డిన్నర్ అయిన తర్వాత అందరం మేడమీదకు వెళ్ళాం.

నీలాకాశంలో నిండు చంద్రుడు మనోహరంగా ప్రకాశిస్తున్నాడు. ఎన్నాళ్ళయింది ఇలా వెన్నల్లో కూర్చుని. చిన్ననాటి రోజులు గుర్తుకొచ్చాయి. నేను తలెత్తి అపురూపంగా, తన్మయత్వంగా కదిలే మేఘ సముదాయాన్ని చూస్తున్నా. అమ్మమ్మ పక్కన పడుకుని, ఆకాశంలోకి చూపిస్తూ అమ్మామ్మా! అలా చూడు, ఆ పెద్ద మేఘం ఏనుగులా ఉంది కదూ? ఆ ప్రక్క మేఘం చూడు ఒంటెలా ఉంది కదూ? అంటూ అమాయకంగా చెప్పే ఆ బాల్యంలోనే ఉండి పోతే ఎంత బావుణ్ణు.

అంతా రిలాక్స్‌డ్‌గా కూర్చున్నారు.

ఆంటీ పెట్టిన భోజనం చాలా బావుందని వివేక్ బాగా మెచ్చుకున్నాడు మరోమారు.

"సరే వివేక్. నువ్వేదో చెప్పాలన్నావు కదా. ఇప్పుడు చెప్పు." - ఆంటీ అడిగారు.

"ఈ జాహ్నవిగారు ఎవరో తెలుసా? మన సాయిరాం పెళ్ళి చేసుకోవాలనుకున్న మీరా వాళ్ళ అక్కగారు."

"అవునా జాహ్నవీ. కానీ ఆ అమ్మాయి ఇక్కడికి ఎప్పుడూ వచ్చినట్లు లేదు."

"అవును ఆంటీ. తను ఇంత వరకూ ఇక్కడకు రాలేదు."

"ఒకసారి రమ్మని చెప్పకూడదూ." - ఆంటీ అడిగారు.

వివేక్ అది విని తమాషాగా నవ్వాడు. నవ్వి..." మీ వారెలా ఉన్నారు జాహ్నవిగారూ?" అని అడిగాడు. ఆ నవ్వుకూ.. ఆ ప్రశ్నకూ అర్థం నాకు అర్థమయింది.

"ఏం ఉండటమో? ఆ అబ్బాయి నెలకు ఇరవై రోజులు బయటే ఉంటాడు. మొన్నటి వరకూ ఆ అబ్బాయి తల్లి ఇక్కడే ఉండేవారు. ఈ మధ్యనే వాళ్ళ ఊరు వెళ్ళారు. జాహ్నవి ఆల్‌మోస్ట్ ఒంటరిగా అయిపోయింది. ఆమె వెళ్ళిన తర్వాతే జాహ్నవి నాకు పరిచయం అయింది." అన్నారు.

"ఇలా అడుగుతున్నానని మీరేం అనుకోనంటే ఓ మాట." - వివేక్

"అడగండి"

"మీ వివాహ జీవితం బావుందా?"

నేను మాట్లాడలేదు.

"వీడికేం అవసరం ఈ ప్రశ్న అని మనసులో నన్ను తిట్టుకోకండి. నాకీ ప్రశ్నకు జవాబు చాలా అవసరం. ఎందుకో తెలుసా? మా నలుగురి మదర్స్ స్కూల్ డేస్ నుండీ ఫ్రెండ్స్. వాళ్ళ స్నేహం చెడిపోకుండా ఉండటానికై అందుకు సహకరించే వారిని ఎంచుకుని పెళ్ళి చేసుకున్నారు. అందు వలన మా నలుగురి కుటుంబాల మధ్య రహస్యాలు లేవు. గట్టిగా చెప్పాలంటే -

మేమందరం మా ఆనందం, విషాదం, కష్టాలూ, బాధలూ, కన్నీళ్ళూ, నవ్వులూ అన్నీ కలిసే పంచుకుంటాం. అందుకే ఆ రోజు మీ ఇంటికి సడన్‌గా వచ్చింది మీ చెల్లెలి నేచర్ తెలుసుకోవటానికే. మా వాడు చాలా సెన్సిటివ్. ఆ అమ్మాయి ఎలా ఉంటుందా అని చూడటానికి వచ్చాను. నాకా అమ్మాయి నచ్చలేదు. మా వాడికి తగదు అనిపించింది. మీ చెల్లెలికి విపరీతమైన నిర్లక్ష్యం ఉంది, గర్వం ఉంది అందగత్తెనని. హుందాగా ప్రవర్తించటం రాదు. ఇంకా కొన్ని అనుమానాలున్నాయి నాకు. అందుకే మీ ఇంటి నుండీ వెళ్ళాక సాయిరాంతో తొందరపడవద్దని ఫోన్లో చెప్పాను. అంతలోనే అనుకోని, రాకూడదనుకునే దురదృష్ట సంఘటనలు జరిగిపోయాయి. సాయి మాతో ఈ విషయం చర్చించలేదు. ప్రస్తుతం వాడి ఆలోచనలు వాళ్ళమ్మ చుట్టూ తిరుగుతున్నాయి.

"మొదట అమ్మ ఆరోగ్యం బాగుపడాలి. తర్వాతే పెళ్ళి గురించి ఆలోచన' - అంటున్నాడు. మీ పేరెంట్స్ మాత్రం తొందరగా పెళ్ళి చేయటానికై వీడికి ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు.

సాయి ఎప్పుడూ ఏ విషయానికీ... అసలు దేనికీ తొందర పడి నిర్ణయాలు తీసుకోడు. అటువంటిది మీ చెల్లెల్ని చూస్తూనే, ఎవరికీ చెప్పకుండా నిర్ణయం తీసుకున్నాడు. సాయి మీద ప్రేమతో వాళ్ళ పేరెంట్స్ కూడా అంగీకరించారు. సాయి పేరెంట్స్ మీ మేరేజ్‌కి కూడా వచ్చారు, బంగారపు బొమ్మలాంటి అమ్మాయి తమకి కోడలు కాబోతుందని నా దగ్గర కూడా ప్రస్తావించి ఆనంద పడ్డారు. ఆ తర్వాతే ట్రైనింగ్‌లో ఉన్నా సాయికి ఫోన్ చేసి అడిగినప్పుడు సాయి చెప్పాడు, ఒకసారి మీ ఇంటికి వెళ్ళి మీ సిస్టర్‌ని చూసి, నా అభిప్రాయం చెప్పమన్నాడు. నేను గమనించి చెప్పాను. నాకు తెలుసు నా అభిప్రాయాలు సాయిని నొప్పిస్తాయని. కానీ అది కొంతకాలమే. నా ఉద్దేశంలో ఏ వ్యక్తికయినా జీవితం ఒక వరం వంటిది. ఆ జీవితాన్ని చాలా జాగ్రత్తగా... శ్రద్ధగా రచించుకుంటూ అనుభవించాలి. ఇది నా సిద్ధాంతం. అది సాయికి తెలుసు. నువ్వయితే కరెక్ట్‌గా ఆలోచిస్తావన్నాడు ఆరోజు. కానీ ఇప్పుడు చాలా బాధ పడుతున్నాడు మౌనంగా. ఎటూ నిర్ణయించుకోలేక బాధ పడుతున్నాడు." - అంటూ ఆగి క్షణకాలం ఆకాశంలోని నిండు చంద్రుణ్ణి చూస్తూ -

"జీవితం మారుతూ ఉంటుంది. కొన్ని క్షణాలనూ.. మరీ ఒక్క సంఘటననే పట్టుకుని వ్రేలాడకూడదు.

బాధించే సంఘటనల తాలూకూ మూలాల్ని శోధించి నిర్మూలిస్తే, ఆనందపు సంఘటనలు వాటంతట అవే పైకి వస్తాయి', కదూ ఆంటీ? " - అన్నాడు.

ఈ మాటలు ఎవరిని ఉద్దేశించి, వివేక్ చెప్పినట్లు? తప్పక సాయిరాం కోసమే అయి ఉంటుంది.

ఏమైనా మీరా మూలంగా చాలా సిగ్గుగా ఉంది. మీరా గురించి వివేక్ అలా మాట్లాడటం అది నిజమే కావచ్చు.. కానీ కొన్ని నిజాలు అగ్ని కణాలు వంటివి. వాటి తాలూకూ వేడిని తట్టుకోవటం కష్టం.

ఈ వివేక్‌ది మరీ ముక్కుసూటి మనస్తత్వం.

"జాహ్నవిగారూ.. సాయిరాం ఫాదర్ లేరు. ఆంటీ ఎలా ఉన్నారో మీకూ తెలుసు. ఇప్పుడు సాయిరాం బాధ్యత మా స్నేహితులపై మరింత ఎక్కువగా ఉంది. అందుకే అడుగుతున్నాను. నిజం చెప్తారని ఆశిస్తున్నాను. చెప్పండి సాయిరాంని పెళ్ళి చేసుకునే అర్హత మీ చెల్లెలికి ఉందంటారా? ఎందుకడుగుతున్నానంటే, సాయి మీ సిస్టర్ గురించి నేను చెప్పినది జీర్ణించుకోలేకపోయాడు. అలాగే తన నిర్ణయాన్ని మార్చుకోనూ లేక నలిగి పోతున్నాడు.

అనుకోని విధంగా మనమంతా ఇక్కడ కలిశాము.

మీరు చెప్పే నిజాల ఆధారంగా మా సాయి తన పెళ్ళి గురించి ఒక అభిప్రాయానికొస్తాడు... అనుకుంటున్నాను" - వివేక్ అన్నాడు.

నేను సాయిరాం వేపు చూసాను. అతనిలో ఏ భావమూ కనిపించలేదు. నిజమే సాయిరాం సుకుమార హృదయానికి భరించలేని గాయాలు తగిలాయి. ఆ బాధను భరించతం కోసమే తను మౌని అయినట్లు ఉన్నాడు.

ఇప్పుడు నన్ను వివేక్ అనుకోని చిక్కుల్లో ఇరికించేసాడు. ఏం చెప్పాలి నేను? ఒక విధంగా ఇది నాకొక ఛాన్స్. అమ్మా, నాన్నగారూ, మీరాల మీద ప్రతీకారం తీర్చుకోవటానికై, కానీ ఇందు వలన నా కొచ్చే లాభం ఏమిటి? 'వెయ్యి అబద్దాలు చెప్పి అయినా ఒక పెళ్ళి చేయాలి'అనేది అమ్మమ్మ. నా పెళ్ళి అలానే చేసారు. ఏం పొందాను. ఏం సుఖపడ్డాను?

నిరాశా? నిస్పృహ, ఒంటరితనం శిక్షలా అనుభవిస్తున్నాను. బాధంటే ఏమిటో తెలిసిన దాన్ని నేను. అనుభవిస్తున్న దాన్ని కూడా ఇటువంటి స్థితిలో ఇలాంటి బాధ మరికొందరు అనుభవించాలా? అది ఏమి సంస్కారం?

ఒక్కరి స్వార్ధం కోసం ఇందరు బాధపడాలా? ఏం తప్పు చేసారని! నా రాత బాగుండక నాకన్యాయం జరిగింది. కానీ పాపం సాయిరాం. అందాన్ని చూసి ... కావాలనుకోవటంలో తప్పేంటీ?

మరయితే మీరా. మీరాని గుర్తు చేసుకోబోతే నా ఆలోచనలకు బ్రేక్ పడుతోంది. స్వార్ధపరురాలు మీరా. ని...జ...మా? కాదేమో! ఏ ప్రాణి అయినా ఈ లోకంలోకి అమాయకంగానే వస్తారు తల్లితండ్రుల పెంపకంలో అభిప్రాయాలు, అలవాట్లు ఏర్పడతాయి. మీరా మాట్లాడిన ప్రతీమాటకూ విలువ ఇచ్చారు. ఇచ్చారా? నిజంగా ఇచ్చారా? న్యాయంగా ఆలోచిస్తే... కాదు.. కాదు. పెద్దవాళ్ళకు ఇబ్బంది రానంత వరకూ మీరాని సమర్ధించారు. సాయిరాంని మీరాకు చూపించకుండానే పెళ్ళి చేయాలనుకున్నారు. అన్నీ గొప్పవీ.. విలువైనవీ... అందమైనవీ తనకిచ్చినట్లే పెళ్ళి విషయంలో కూడా అనుకుంది మీరా.

పెళ్ళంటే కట్నాలూ, కానుకలూ, హోదాలూ సరిపోవటం కాదు. ఆ పిల్లల మనసులు కలవాలి. హృదయాలు స్పందించాలి. ఒకరినొకరు చూసుకున్న క్షణాన తనువులు ఇరువురివీ పులకరించాలి. అంతేకానీ –

ఒకరికి నచ్చినంత మాత్రాన రెండో వ్యక్తి తలవంచి అంగీకరించటం న్యాయమా? నిన్నటి మనుష్యులూ, నిన్నటి ఆచారాలూ, నిన్నటి సంప్రదాయాలు అసలు నిన్నటి సమాజ పరిస్థితులూ కూడా నేడు లేవు. పనికి రావు.

ఎప్పుడయితే ఆడపిల్లలు మగవారితో సమానంగా, చదివి సంపాదిస్తున్నారో అప్పటి నుండే ఇరువురి అభిప్రాయాలనూ మన్నించటం తల్లితండ్రులు తప్పక నేర్చుకోవాలి.

మీరాని, 'నువ్వు సాయిరాంని చూసావా' - అని అడిగితే 'చూళ్ళేదు ఆయన ఐ.ఏ.ఎస్ కదా తప్పక బావుంటారు ' - అని చెప్పింది. అది అమాయకత్వం. అందమైన మూర్ఖత్వంలో దాగిన అమాయకత్వం.

మీరా అందాన్ని నలుగురూ పొగిడినప్పుడు మురిసిపోయే తన తల్లితండ్రులు కేవలం అందం మూలంగానే తనని అందలం ఎక్కించిన తన తల్లితండ్రులు తప్పక ఒక అందాల రాజకుమారుణ్ణే తెస్తారు అనుకుంది. అమ్మా చూడలేదు అంది. మరి తప్పెవరిది? నాన్నగారిదే కదా?

"ఏమాలోచిస్తున్నారు? చెల్లెలి మంచి గుణాలను ఎన్ని రకాలుగా చెపితే బావుంటుందనా?" వివేక్ అడిగాడు.

తమిళ ఆంటీ, సుందర్‌ల నేచర్ నాకు తెలుసు. అన్నీ గ్రహిస్తారు. కానీ తమ హద్దుల్ని అతిక్రమించరు.

ఈ పోలీసు ఆఫీసరుకే అసహనం ఎక్కువ అసలు అందుకే ఆ పోస్ట్‌కి సెలక్ట్ అయ్యుంటాడు.

"వివేక్ గారూ! ఇది జీవిత సమస్య. మనం ప్రశాంతంగా... నిదానంగా... స్వార్థరహితంగా ఆలోచిద్దామా?' - అడిగాను.

"ఓహ్! పైకి కనిపించినంత అమాయకత్వం మీ ఆలోచనల్లో లేనట్లుంది. సరే చెప్పండి, వింటాను."

నేను సాయిరాం గారు వైపు తిరిగి,

"సాయిరాం గారూ, మీరు బుద్ధుని ప్రతిమ నాకు పంపినపుడు అది నేను తీసుకున్నప్పుడు, నాలో ఒక విచిత్ర ఆత్మీయత మీ పట్ల కలిగింది. ఏదో ఒక అదృశ్యతోడు మీ ద్వారా నాకు లభించింది, అనే భావనా బలం నా వివాహానంతరపు వైఫల్యాలన్నింటిలోనూ... సహనాన్ని ప్రదర్శించే శక్తిని నాకు ఇచ్చింది. ఇప్పుడూ ఆ ఆసరాతోనే మాట్లాడుతున్నాను.

మీరా నా చెల్లెలే. అమ్మా నాన్నా విపరీతంగా గారాం చేసారు. వ్యక్తులు ఏ వయసులో ఎలా ఆలోచించాలి... నిర్ణయాలు తీసుకోవాలో అది దానికి వాళ్ళు నేర్పించలేదు. సో... మీరా ప్రవర్తనకు తప్పు పట్టాల్సింది మీరాను కాదు. పేరెంట్స్‌ని మొదట తప్పు పట్టాలి. తర్వాత మిమ్మల్ని కూడా..."

"ఏమన్నారు? మా వాడినే తప్పు పడుతున్నారా?" - వివేక్ చాలా కోపంగా, ఆవేశంగా అడిగాడు. గొంతు పట్టుకోలేదు కానీ, అంత ఆవేశమూ నాకు వివేక్‌లో కనిపించింది.

"వివేక్ కూల్‌డౌన్. కూల్‌డౌన్." - సాయిరాం అన్నాడు.

"మీ అందరినీ అనుకోకుండా కలిపి నేను పొరపాటు చేసానా?" - ఆంటీ కలవరపడుతూ అడిగారు.

"లేదు ఆంటీ. కొద్దిసేపు ఓపిక పట్టండి. మబ్బులన్నీ విడిపోతాయి" - అన్నాను. సుందర్‌కి కూడా నామీద కోపం వచ్చినట్లే ఉంది. పైకి ప్రకటించలేదంతే.

సాయిరాం మాత్రం చాలా నెమ్మదిగా ప్రశాంతంగా అచ్చం బుద్ధుని లానే చూస్తూ -

"జాహ్నవిగారూ! మీ మనోభావాల్ని నేను అర్థం చేసుకున్నాను. నేను నావేపు నుండే, ఈ దేశపు సగటు మగవానిలానే ఆలోచించాను. మీ చెల్లెల్ని ఆ రోజు చూసిన వెంటనే తన్ని పెళ్ళి చేసుకుంటే బావుంటుందని అనిపించింది. 'ఆమె ఎవరు' - అని, అక్కడి వారిని అడిగితే, మీ నాన్నగారిని చూపారు. నాకు ట్రైనికి టైం అవుతోంది. ఆ తొందరలోనే - మీ నాన్నగారిని మాత్రమే కలసి, నా ఇష్టాన్ని తెలియచేసి, మా నాన్నగారిని పరిచయం చేసి మాట్లాడమని చెప్పి వెళ్ళిపోయాను. ఇప్పుడు మీ మాటలు వింటుంటే అనిపిస్తోంది. నేను నేరుగా మీ సిస్టర్ దగ్గరకు వెళ్ళి, నన్ను పరిచయం చేసుకుని, ఆమె అభిప్రాయాన్ని కూడా తెలుసుకుని అప్పుడు మీ నాన్నగారికి చెప్పి ఉండాల్సింది. ఇలా జరగడానికి కారణం -

అమ్మ పెంపకం, అమ్మ సాంప్రదాయపు మనిషి 'ఇటువంటి విషయాలు పెద్దవాళ్ళ ద్వారా జరగాలి' - అన్న విధంగా పెరగటం వలన, నేటి యువతరానికి తగినట్లుగా ఆలోచించలేక పోయాను. ఇందుకు నేను చాలా చింతిస్తున్నాను."

"అలా అనకండి మీ వరకూ మీరు కరక్టే. కానీ భగవంతుని నిర్ణయం ఎలా ఉందో మనకు తెలియదు కదా! మిమ్మల్ని తొందరగా ఇంటి అల్లుడిగా తెచ్చుకోవాలనే ఉద్దేశంతో నా చదువును ఆపేసారు. ఇప్పుడు ఆంటీ మరో ఫ్రెండ్ రమా ఇద్దరి సహాయంతో ప్రైవేట్‌గా చదువుతున్నాను. ఆ... నా సంగతి సరే! మీరేం నిర్ణయించుకున్నారు?"

"మా సాయిరాంకి మీ చెల్లెలితో పెళ్ళి అనుకున్నాక ఏమీ కలిసి రావటం లేదు. అతను ట్రైనింగ్ పూర్తి చేసుకుని వచ్చిన మరునాడే బామ్మ, మరో మూడు నెలలకు ఏక్సిడెంటులో అంకుల్ పోయారు."

"వివేక్ జాహ్నవి గారేం చేసారని, ఆమెను అనటం బావుండలేదు. ఎప్పుడు ఏది ఎలా జరగాలని రాసి ఉంటే, అలాగే జరుగుతుంది. జాహ్నవిగారు చెప్పింది కరక్టే." - సాయిరాం చెప్పాడు.

సడన్‌గా మా మధ్య నిశ్శబ్దం ఆవరించింది.

సుందర్ ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ -

"మీ వారెప్పుడు వస్తారు?" అడిగాడు.

"తెలియదు" - నిర్లిప్తంగా చెప్పాను.

'అదేంటీ ఆయన ఎప్పుడు వచ్చేది మీకు చెప్పరా?" - వివేక్ అడిగాడు.

నేను మాట్లాడలేదు.

"సారీ జాహ్నవిగారూ మిమ్మల్ని అనవసరంగా బాధిస్తున్నాను. ఆ రోజు మీ చెల్లెలితోపాటు మిమ్మల్ని గమనించాను. మీ నేచర్ నాకు చాలా నచ్చింది. ఆ ఇంట తప్ప పుట్టారు అనుకున్నాను. అయితే వరసగా సాయిరాంకి వస్తున్న బాధను తట్టుకోలేక అనవసరంగా, ఎదురుగా కనిపించే మీమీద చికాకు పడ్డాను. ఐయాం సారీ. ఇంతకూ చెప్పాల్సిన అసలు విషయం మీరు దాటేస్తున్నారు," - వివేక్ అన్నాడు

"ఏంటది?"

"మీరు హేపీగా ఉన్నారా? మీ మ్యారేజ్ లైఫ్ ఐమీన్ మీ భర్త మీతో ఎలా ఉంటున్నారు?"

"బావున్నాను. అంతా బావుంది." - అన్నాను.

"కాదు. మీరు అబద్ధం చెపుతున్నారు. ఆరోజు నేను గమనించిన విషయం వేరే అనిపించింది.

అతను అయిష్టంగా... ఎవరి బలవంతం వల్లనో మిమ్మల్ని చేసుకున్నట్లు అనిపించింది. మీరు నిజం చెప్పాలి. మీరు అబద్దం చెప్పటం మూలంగా ఇద్దరి జీవితాలు నష్టపోతాయని మరచిపోవద్దు. ప్లీజ్ నిజం చెప్పండి."

"ఇప్పుడు నేనూ.. నా అభిప్రాయాలూ ముఖ్యం కాదు వివేక్‌గారు. సాయిరాం గారిని వెళ్ళి మీరాను కలవమనండి. ఇద్దరూ మాట్లాడుకుని ఓ నిర్ణయానికి వస్తే మంచిది. అది కాకుండా, ఫోటోలు చూసే కంటే, పెళ్ళిళ్ళ విషయంలో వ్యక్తులు కలుసుకుని అరమరికలు లేకుండా అభిప్రాయాలు తెలుసుకోవటం మంచిదని నా అభిప్రాయం. ఏమంటారు సాయిరాం గారూ."

"వాడేమంటాడు. నేనూ మీలానే చెప్పాను. 'అనుకున్నట్లుగా అన్నీ సవ్యంగా జరిగి ఉంటే బావుణ్ణు. నువ్వా అమ్మాయి నేచర్ నచ్చలేదంటున్నావు. దానికి తోడు బామ్మ.. నాన్న పోయి, అమ్మ అలా అయ్యి, ఆమెను కలవటానికి హాయి అనిపించటంలేదు.' - అంటున్నాడు. "

"పోనీ మీరాను ఇక్కడకు పిలిపించి, ఇద్దరూ మాట్లాడుకునే వీలు కలిపిద్దామా? " - ఆంటీ అన్నారు.

"మీరానా! ఇక్కడకా?! అసలు వాళ్ళ దృష్టిలో నేను చచ్చిపోయాను. అమ్మావాళ్ళు నన్ను వదులుకున్నారు."

"అదే అదే ఎందుకూ? కారణం ఏమిటనే నేను అడిగాను. మీరు మాట మార్చేస్తున్నారు. అంత చెప్పరాని విషయమా?" - వివేక్ రెట్టించి, రెట్టించి అడిగాడు.

అంతలో -

ఆంటీ వాళ్ళ పనిపిల్ల 'అమ్మా ఎదురింటి అయ్యగారు వచ్చారు. ఆయమ్మ వచ్చారా అని అడిగారు. అంతా పైనున్నారని చెపితే విని వెళ్ళిపోయారు." - అంది.

"గుడ్ టైముకి వచ్చాడు. పద సాయీ... నిన్ను పరిచయం చేస్తాను." - అంటూ వివేక్ లేచాడు.

నాకు చక్రవర్తికి ఇవ్వాల్సిన ఉత్తరం గుర్తుకు వచ్చింది.

## పదకొండవ భాగం

"మనం మార్చలేని దానిని అంగీకరించటం ద్వారా
మార్చగలిగిన దానిని మార్చడం ద్వారా
వాటి రెండింటికీ ఉన్న తేడాని అవగాహన చేసుకోవటం ద్వారా
మన ఆవేశాత్మక జీవితాన్ని మన అదుపులో ఉంచుకోగలం. "

-తావో

చక్రవర్తి... చక్రవర్తి వచ్చేడా?

ఎందుకో గుండె దడదడ లాడుతోంది.

ఇంత సైన్యాన్ని వెంట పెట్టుకుని అతనికి ఎదురుపడటమా? ఏమనుకుంటాడు అతను?

నేనేదో కావాలనే ఇలా చేస్తున్నాను అనుకోడుకదా?

ఒక కప్పు కింద

రెండు చెక్క హృదయాలు

ఎప్పటికీ ఒక్కటి కావని తెలుసు.

కానీ అపోహ రాకూడదు కదా?

అయినా ఇదేంటీ? ఏమని ఊహించాను నేను? ఎప్పటిలానే తెల తెల వారుతుండగా అతను వస్తాడు. తలుపు తడతాడు, నేను నిశ్శబ్దంగా వెళ్ళి తలుపు తీస్తాను. అతను మరింత అందంగా... కళకళలాడుతూ కనిపిస్తాడు.

ఎదురింటి ఆంటీ నా మనసులో నాటిన అనుమానపు మొక్క మరింత పెరిగి నా వళ్ళంతా విస్తరిస్తోంది. అయినా అదేమీ లేనట్లుగా... అసలు ఏదీ... ఏమీ లేనట్లుగా సహజాతి సహజంగా ముఖం పెట్టుకుని, పక్కకి మళ్ళి, కాఫీ ఇచ్చి, అతను స్నానం చేసే సమయంలో టిఫిన్ తయారు చేసి, టేబుల్‌పై సర్ది, ప్రక్కనే మంచినీళ్ళ గ్లాసు ప్రక్కన మరో ఖాళీ ప్లేటులో వాళ్ళమ్మగారు నుండీ వచ్చిన ఉత్తరాన్ని పెట్టి, అదికాస్తా ఎగిరిపోకుండా, సాల్ట్ అండ్ పెప్పర్ వేసిన అందమైన తాజ్‌మహల్ షేపులో ఉన్న బాటిల్‌ని పెట్టి... వంటింటి లోపలకు వెళ్ళి... కాఫీ కలిపే పనిలో నిమగ్నమైనట్లు నటిస్తూ –

అతను వచ్చాడా? ఏం చేస్తున్నారు? ఉత్తరం చూస్తున్నాడా? తీసాడా? చదివాడా? అతని ముఖంలో ఫీలింగ్స్ ఏమిటి? ఆ రామచంద్ర చక్రవర్తిగారు... అమ్మ మాటమీద పెళ్ళాడిన ప్రబుద్ధుడు, మొదటి రాత్రి "అమ్మ చెప్పిందని చేసాను. గొంగళిపురుగును గుండె మీద పెట్టుకుంటారా?" అనే ఇతను ఇప్పుడు ఏం చేస్తాడు నన్ను? అమ్మ మాట వింటాడా?..లేదా??' అనే ఆత్రుతతో టెన్షన్ అయిపోవాలనుకున్న ఈ నా ఆలోచనలన్నీ ఏవీ?

ప్చ్.... ఒక్క ఆలోచన కూడా నాది ఫలించదు. ఎందుకని? పోన్లే.. రేపు ఉంది కదా? రేపే ఇవ్వవచ్చు. అవును రేపు ఉంది కదా. అంతలో నా ఆలోచనలని కట్ చేస్తూ వివేక్ –

"జాహ్నవిగారూ వెళ్దామా" – అన్నాడు.

"సరే" – అన్నట్లుగా చూసి ముందుకు నడిచాను. నా వెనుక అంతా.

"తరచుగా సమస్యల్లో చిక్కుకుని పరిష్కారం చిక్కక మనం స్థాణువైనప్పుడు ఎవరో ఒకరు మనకి మార్గాన్ని చూపుతారు,"

నేను నెమ్మదిగా తలుపు తోసాను, నా అరచేతితో అదిమి. నెమ్మదిగా నిశ్శబ్దంగా తలుపు తెరుచుకుంది.

కమ్మని పరిమళం తాలూకూ తియ్యదనం నన్ను చుట్టుకుంది. ఇది నాకు తెలుసు. కానీ చక్రవర్తి నుండీ కాదు. స్త్రీల తాలూకూ పరిమళమిది. బహుశా నా వెనుక ఉన్న ఆంటీ నుండి కావచ్చు. ఇంత వరకూ నేను గ్రహించలేదా!! అడుగు లోపలికి వేసాను. వింతైన నిశ్శబ్దం. హాలులో చక్రవర్తి లేడు. అసలు నిజంగా ఇతను కేంప్ నుండీ వచ్చాడా? ఆ పనమ్మాయి పొరబడిందా?

కాదన్నట్లు ఉన్నా ఒకే ఒక్క బెడ్ రూం నుండీ పొడి దగ్గు వినిపించింది. నేను వెను తిరిగి, నా వెనుక నిలబడిన అందరినీ చూస్తూ, కూర్చోండి అన్నాను.

ఆంటీ సింగిల్ సోఫాలో కూర్చున్నారు.

వివేక్, సాయిరాం, సుందర్ ముగ్గురూ నేను పడుకునే దివాన్ మీద కూర్చున్నారు.

అది పూర్తిగా దివాన్ కాదు. మంచం, దివానులా తయారు చేసాను. పగలది దివాన్‌గా, రాత్రి నాకు మంచంలా ఉపయోగపడుతుంది. ఈ గదిలో అలికిడి విని (చిన్న అపార్ట్‌మెంటు కదా) చక్రవర్తి బయటకు వచ్చాడు. నిజంగానే ఫ్రెష్‌గా ఉన్నాడు. చాలా సమయమయినట్లుంది వచ్చి, స్నానంచేసినట్లు తెలుస్తోంది. ఇంకా ఏదోకూడా. అర్థం కావటం లేదు. అయితే -

చక్రవర్తి వివేక్‌ని వెంటనే గుర్తుపట్టాడు.

"హలో! మీరా?? ఇదేమిటి ఇలా?" - అంటూ నా వైపు చూసాడు ఆశ్చర్యంగా.

నేను గబాల్న - "ఎదురింటి ఆంటీ వాళ్ళింటికి వచ్చారు. అంతా ఎదురింటి ఆంటీ వాళ్ళ అబ్బాయి సుందర్ ఫ్రెండ్స్ అట. వాళ్ళతో పాటు ఆంటీ నన్నూ డిన్నర్‌కి పిలిచారు. ఆయన... ఆయన సాయిరాంగారు. మా మీరాకు కాబోయే భర్త." నేను గబగబా చెపుతూ పరిచయం చేసాను.

శ్రీమాన్ శ్యామ సుందర చక్రవర్తి నా భర్త అనబడే (కాని) వ్యక్తి అందరినీ చాలా మర్యాదగా విష్ చేసి, తను పెద్ద సోఫాలో ఒక వైపు కూర్చుని, "మీరూ కూర్చోండి జాహ్నవిగారూ" - అంటూ ఆంటీ ప్రక్కనున్న మరో సింగిల్ సోఫా వేపు ఎడంచేతివేళ్ళతో చూపిస్తూ చెప్పాడు. నేను అతని పిలుపులోని మర్యాదకు చెదిరి, కానీ... వెంటనే ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించాలనే విషయం గుర్తుకు వచ్చి -

"వాటర్ తీసుకుంటారా?" - అన్నాను ఆంటీని చూస్తూ.

**"మీరు కూర్చోండి జాహ్నవీ. మీరా తీసుకు వస్తుంది లెండీ." అన్నాడు మీ...రా...నా!! అన్నానా? పైకి అన్నానా?** ఏమో తెలియలేదు. సూది పడితే గాలికి కూడా వినిపించనంతటి నిశ్శబ్దం నాలో! ఏమి విన్నాను నేను.

మీరా తీసుకు వస్తుందా? మీరా వచ్చిందా?!

నా ఆలోచన గ్రహించినట్లుగా "మీరా" - అంటూ బెడ్‌రూం వేపు చూస్తూ పిలిచాడు.

ఎంత మధురంగా... ప్రేమగా... అపురూపంగా పిలిచాడు మీరాను. మీరా అనే ఆ పేరు ఇంత అందంగా తియ్యగా మనోహరంగా ఉంటుందని ఇప్పుడే తెలిసినట్లయింది నాకు.

అసలే అందమైనవాడు ఆ పైన మధురాతి మధుర స్వరంతో మీరా అంటూ పిలవటం. నాకు దొరకనిది మీరా అందుకున్నది ఏమిటది? జీవితం అనే పాత్రలో చేరవలసిన మధువు. ప్చ్. బేడ్‌లక్. అందరం ఆశ్చర్యంగా చూస్తున్నాం. అచేతనంగా కూడా. అనుకోని సంఘటన ఇది. మా అందరికీ కూడా.

నేను ఆత్రంగా గదివైపు కదలబోయాను.

"లేదు. మీరు కూర్చోండి తనే వస్తుంది." - ఆజ్ఞలా చెప్పాడా చక్రవర్తి!

ఇదేవిటి ఇతను ఇలా అంటున్నాడు. క్రితం తాలూకూ సుకుమార సౌందర్యపు గొంతు తాలూకూ జాడలు ఏవీ?

నేను కదలక బోనులో ముద్దాయిలా నిలుచుండిపోయాను.

అప్పుడే గది నుండీ మీరా వచ్చింది.

ఎక్కడి నుండో ఓ పంచెవన్నెల రామ చిలుక ఎగిరివచ్చి ఈ గది మధ్యన వాలినట్లుగా మీరా ప్రవేశించింది.

నైటీలో ఉంది మీరా.

నైటీ మీద తెల్లని కాదు బంగారు వర్ణంలో మెరుస్తున్న కంఠాన్ని చుట్టి, నైటీని లాలిస్తున్న నల్లపూసల పేరు.

మీరాకు పెళ్ళి అయిందా?? ఎవరితో? చక్రవర్తితోనా? ఎప్పుడు?

అమ్మా వాళ్ళకి తెలుసా?

"ఈ అమ్మాయేనా మీరా అంటే? పెళ్ళయినట్లుందే!" - ఆంటీ మీరాను చూస్తూనే అనేసారు.

పాపం ఆంటీ నిన్నటి తరం స్త్రీమూర్తి కదా? చాలా చాలా ఎక్కువగా షాక్ అయ్యారు.

వివేక్ ముఖం ఎఱ్ఱగా కందిపోయింది.

సుందర్ అయోమయంగా చూస్తున్నాడు.

ఒక్క సాయిరాం మాత్రమే స్థిత ప్రజ్ఞుడులా చాలా ప్రసన్నంగా మీరా వేపు ఒక్క నిముషం చూసి తలదించుకున్నాడు.

"రా మీరా ఇలా కూర్చో" అంటూ తన పక్కన చోటు చూపించాడు. మీరా నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి చక్రవర్తి ప్రక్కన కూర్చుంది. ఆ కూర్చోవడంలోని సామీప్యత, వారిద్దరి మధ్యా ఉన్న దగ్గరితనాన్ని చెప్పకనే చెప్పినట్లుగా ఉంది.

"ఎప్పుడు పెళ్ళి చేసుకున్నారు?" - వివేక్ కఠినంగా అడిగాడు.

"ఇంకా లేదు." - కూల్‌గా చెప్పాడు చక్రవర్తి.

"మరి ఆ అమ్మాయి మెడలో నల్లపూసలు..." - ఆంటీ అనుమానంగా అడిగారు.

'మా పెళ్ళికి కొన్ని ఆటంకాలు ఉన్నాయి. లీగల్ సమస్యలు. అవి తీరేవరకూ మీ అందరి దృష్టిలో మేము భార్యాభర్తలం కాదు. కానీ మా వరకూ మాకు పెళ్ళి అయిపోయింది. తనిప్పుడు తల్లి కూడా కాబోతుంది."

"దుశ్శకునం లాంటిది మరొకటి ఉండదు.

విధి దాన్ని ముందుగా తెలిపే దూతని మన దగ్గరకు పంపదు.

ఆ విషయంలో విధి మరీ వివేకంతో, లేదా మరీ క్రూరంగా ప్రవర్తిస్తుంది."

అమ్మా వాళ్ళకి తెలుసా? - నా ముందు ఒక ద్వారం పూర్తిగా మూసుకు పోయింది.

ఒక మాయ కరిగి పోయింది.

ఖైదు లాంటి జీవితం నుండి విడుదల కలుగుతోందా? ఇంతే ఆలోచించాను. బాధ మాత్రం కలగటం లేదు. ఆ మనిషి నా కెప్పుడూ ఏదీ కాలేదు ఎటువంటి ఆశలూ చూడలేదు. మొదటి నుండీ నన్ను అసహ్యించుకుంటూనే ఉన్నాడూ.

అశాశ్వతమైన అందాన్ని చూసి మిణుగురు పురుగును కాలేదు. కాను కూడా. కానయితే విధికి తల ఒగ్గి పరిస్థితులకు కట్టుపడ్డానంతే. స్వేచ్ఛను కోరుకుంటున్న నాకు, ఇప్పుడు విశాల ప్రపంచంలోకి దారి కనిపిస్తోంది. బంధాలూ... బంధనాలు ఊడి పోయాయి. ఉన్నారు అనుకున్నవారంతా వేరయి దూరమైపోయారు. ఎలాగెలాగో ఉంది నాకు, సుఖం లేని హాయి నాలో ప్రవేశిస్తోంది.

మళ్ళీ అడిగాను మీరా వేపు చూస్తూ. -

"అమ్మా వాళ్ళకి తెలుసా??"

"తెలియదు. ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఇండియాలో లేరు. ప్రాజెక్ట్ వర్క్ మీద అంకుల్ ఎబ్రాడ్‌కి వెళ్ళారు. ఆంటీ కూడా వెళ్ళారు. రెండు నెలల వరకూ రారు." - చక్రవర్తి చెప్పాడు.

"మరి అమ్మమ్మ ఒక్కర్తే ఉందా?" - ఆత్రుతగా అడిగాను.

ఇద్దరూ మాట్లాడలేదు.

ప్రేమ ఇంత స్వార్ధపూరితమైనదా? పాపం అమ్మమ్మ. ఎంత కంగరు పడిపోతూ ఉంటుందో ఏమో.

"అమ్మమ్మ కంగారు పడదా మీరా."

"పడదు. పెళ్ళికి ఫ్రెండ్ ఊరు వెళుతున్నాను. పది రోజుల వరకూ రానని చెప్పాను. అత్తా వాళ్ళు అమ్మ దగ్గరే ఉన్నారు." - మొట్ట మొదటిసారిగా మీరా నోరు విప్పి మాట్లాడిన మాటలు అవి.

మీరా చాలా తెలివైన అమ్మాయి. తనకేం కావాలో అవన్నీ చాలా తెలివిగా, నిర్భయంగా చేజిక్కించు కుంటుంది. చిన్నతనం నుండి తనకి అలవాటేగా. తనూ తన సుఖం, అంతే తనకి కావాలి. అవునూ ఎవరు మాత్రం కాదు? అమ్మా.. నాన్నా.. కాంతమ్మ చక్రవర్తీ అందరూ, అందరూ స్వార్ధపరులే కదా?

కానీ మంచివాళ్ళు కూడా ఉన్నారుగా.

జగపతి బాబాయిగారూ, సాయిరాం, వివేక్, సుందరం, ఆంటీ వీళ్ళంతా మంచివాళ్ళేగా!

నిజమే మంచీ - చెడూ రెండూ ప్రక్క ప్రక్కనే ఉంటాయి, బొమ్మా -బొరుసుల్లా.

జీవితమనే నాణాన్ని ఎగరవేసి అరచేయి చాపితే, ఎవరి అదృష్ట దురదృష్టాలని బట్టి వారికి బొమ్మో, బొరుసో వస్తూ ఉంటుంది.

వివేక్ అసహనంగా కదిలాడు.

అతను అడగాలనుకున్న ప్రశ్నలన్నింటికీ, అతను అడగకుండానే జవాబులు లభించాయి.

బహుశా ఈ సంఘటన వివేక్‌కి ఆనందాన్నిస్తుంది. ఎందుకంటే తన స్నేహితుడు రక్షించబడ్డాడు. కాస్త బాధ అనిపించినా జరిగింది సాయిరాంకి మంచే చేస్తుందని భావిస్తూ ఉండవచ్చు. మరి నా సంగతి.

నేను మీరాని చూస్తూ -

"మీరా ఒక్క మాట అడగనా?" - అన్నాను.

మీరా నుదురూ, కనుబొమ్మలూ చిట్లించి `ఏమిటి`, అన్నట్లు చూసింది.

"నిన్నంతగా ప్రేమించిన అమ్మా, నాన్నలను మోసం చేయటం నీకు బావుందా?"

"చాలా బావుంది. వాళ్ళు వాళ్ళ గొప్పల కోసం, నన్ను మోసం చేసారు. నా ఇష్టాన్ని తెలిసి కూడా తెలియనట్లు ప్రవర్తించారు. వాళ్ళకి ఇలానే చేయాలి." - కక్షగా చెప్పింది.

'మరి కలక్టరు భార్యను కాబోతున్నానని మురిసిపోయావు కదా?' - అని అడగాలనిపించింది. అడగలేదు. ఎందుకంటే సాయిరాం ఇక్కడే ఉన్నాడు. అతన్ని బాధించకూడదు.

"సరే మరిప్పుడు జాహ్నవి సంగతి ఏవిటి?" - వివేక్ అడిగాడు అవును కదా! నా సంగతేవిటి? మీరా ఇక్కడకు వచ్చేసింది. ఎట్‌లీస్ట్ మరో పది రోజులు నిశ్చింతగా ఇక్కడ ఉంటుంది. ఆ తర్వాత?

ఇద్దరూ మరో గొప్ప తెలివైన ఆలోచన చేస్తారు.

నిండా మునిగిన వాళ్ళకి చలేమిటి? భయమేమిటి? సిగ్గేంటి? నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లు ఇందరి ముందు ఇంత సిగ్గులేకుండా, చాలా సహజం ఇది అన్నట్లు ఉన్నా వీళ్ళ గురించి మరి ఆలోచన వృధా కదా.

వివేక్ ప్రశ్నకు సాయిరాం తలెత్తి చక్రవర్తి వైపు చూసాడు.

"ఆమె ఇష్టం. పుట్టింటికెళ్ళి పోయినా, మరెక్కడికి వెళ్ళినా అది ఆమె నిర్ణయం ఆమె తీసుకోవాలి. వీలయినంత తొందరగా" - చక్రవర్తి అన్నాడు.

స్వార్ధపరుల మాటలూ, ఆలోచనలూ ఎలా ఉంటాయో అలానే ఆలోచిస్తున్నారు వాళ్ళిద్దరూ. ఇప్పటి కిప్పుడు నేనెక్కడకు వెళ్ళాలి? నాకెవరున్నారు? జగతిపతిరావు బాబాయిగారు ఉన్నారు. అక్కడికి ముందు వెళ్ళి, ఆ తర్వాత ఏం చేయాలి? ఎలా ఉండాలి ఆలోచించుకోవచ్చు. సరే కానీ ఇంత రాత్రి వేళ, ఒంటరిగా... ఏకాకిగా ప్రయాణమా? ఎలా? భయమేస్తోందే!

"ఏం నిర్ణయించు కున్నారు జాహ్నవీ?" - వివేక్ అడిగాడు.

"మా ఇంట్లో ఉంటుంది." - ఆంటీ గబాల్న అన్నారు. అంటూనే చటాలున లేచి నిలబడ్డారు.

ఆవిడకు ఈ ఇంట్లో... ఇలాంటి పరిస్థితులను భరించటం కంపరంగా ఉన్నట్లు ఆమెను చూస్తుంటేనే తెలుస్తోంది.

"ఇంతరాత్రా! అక్క పరాయింటిలో ఉండటమా? ఊహలోకూడా వద్దు" - అని కూడా నాతోబుట్టువు నోటి నుండీ రాలేదు. పైగా - వీళ్ళంతా తొందరగా వెళ్ళిపోతే బావుణ్ణు వచ్చీరాగానే ఏవిటీ సంత అన్నట్లుగా కూర్చుంది. ఇట్లాంటి స్వార్ధపరుల మూలంగానే కదా, కుటుంబం, సాంప్రదాయాలూ, శాస్త్రాలూ అన్ని అడుగంటి పోతున్నాయి. "జాహ్నవిగారూ మీ వస్తువులు తెచ్చుకోండి. అమ్మ ఒక్కర్తే ఇంట్లో ఉంది కదా? ఎంత సర్వెంట్స్ తోడు ఉన్నా, మనం వెళ్ళే వరకూ అమ్మ ఆత్రుత పడుతూనే ఉంటుంది." - సాయిరాం అన్నాడు. చాలా స్థిరంగా. సాయిరాం... సాయిరాం... సాయిరాం. బుద్ధుని బొమ్మ ఇచ్చిన సాయిరాం. ఆ ప్రతిమ చూస్తున్నప్పుడంతా నాలో కలిగే ఏవో ఏవో భావాలకు ఇప్పుడు అర్ధం తెలిసింది.

"నిజంగానా సాయీ" - వివేక్, ఆంటీ ఒక్కసారే అడిగారు.

"అవును. ఈ క్షణం నుండీ అమ్మకు ఇద్దరు పిల్లలు. జాహ్నవీ, నేనూ." సాయిరాం మాటలు వింటూనే సుందరం సంతోషంగా చప్పట్లు కొడుతూ చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు సాయి. జాహ్నవిగారు మా ఇంట్లో ఉండటం నాకు ఇష్టమే కానీ, మా ఇల్లు ఈ ఇంటికి ఎదురిల్లు కావటం మూలంగా నాకు హాయిగా అనిపించటం లేదు." - అన్నాడు. "ఉండు, ఉండు సాయి, జాహ్నవిగారిని ఆలోచించుకోనివ్వు. తనకి ఎలా బావుంటే అలా ఉంటారు. ఏమంటారు జాహ్నవీ. మొహమాట పడకండి. చూసారా మీకోసం ఎంత మంది ఆత్మీయులు ఉన్నారో మరి చెప్పండి ఏమనుకుంటున్నారు మీరు?" - వివేక్ అడిగాడు. క్షణం కూడా ఆలోచించకుండా చెప్పేసాను.

"నేను సాయిరాం గారితో వాళ్ళింటికి వెళతాను. అమ్మకి బావుండలేదుకదా? ఇటువంటప్పుడు అమ్మలను మగపిల్లల కంటే ఆడ పిల్లలే అన్ని విధాలా చూసుకోగలరు." - స్థిరంగా చెప్పాను.

నా మాటలు వింటూనే, ఆంటీ నా దగ్గరకు గబగబా వచ్చి నన్ను కౌగిలించుకుని, నా నుదుట ముద్దుల వర్షం కురిపించారు. "లలితకే కాదు నాకూ కూతురువే ఈ క్షణం నుండీ తల్లీ." - అన్నారు.

"మా అమ్మకి కాదా?" - వివేక్ అడిగాడు.

సుందరం కవ్వింపుగా నవ్వుతూ 'అరే! నీకూ అసూయ వస్తుందన్నమాట! - అన్నాడు.

"ఇలాంటి విషయాలలో." - వివేక్ అన్నాడు.

"వెళ్ళు జాహ్నవీ. నీ బట్టలూ అవి తీసుకునిరా" - అన్నారు. వాళ్ళెవ్వరూ ఇప్పుడు చక్రవర్తినీ, మీరాను పట్టించుకోలేదు. అసలు అక్కడ వాళ్ళిద్దరూ లేనట్లే ప్రవర్తించసాగారు.

నేను దివాను కమ్ మంచం దగ్గరకు వెళ్ళి, క్రిందకు వేలాడుతున్న దుప్పటిని పైకి తీసి, మంచం క్రింద ఉన్న సూట్‌కేస్ బయటకు తీసి, లాక్ చెక్ చేసుకుని, "నేను రడీ" - అన్నాను.

వివేక్, ఆంటీ, సుందర్ గబగబా బయటకు నడిచారు. మీరాకు, చక్రవర్తికీ ఏమీ చెప్పకుకుండానే.

సాయిరాం నా దగ్గరగా వచ్చి, "ఇటివ్వండి" అంటూ, నా చేతిలో సూట్‌కేస్ తను తీసుకున్నాడు.

మీరా దగ్గరగా వెళ్ళి-

"ఐ యాం సారీ, నా తొందరపాటు మూలంగా మీ అందరూ బాధపడినందుకు" - అన్నాడు.

మీరా తల వంచుకుంది. 'బహుశా ఫీలవుతోంది' - అనిపించింది.

చక్రవర్తి మాత్రం - "నో... నో... నో.. సాయిరాం గారూ, మీ మూలంగానే నాకు అపురూపమైన బంగారం వంటి మీరా దొరికింది. మీకు థేంక్స్ చెప్పాలి. ఎట్ ది సేమ్ టైం మీరా మూలంగా మీరు గాయపడితే ఆమెను క్షమించండి. తను కావాలని మిమ్మల్ని బాధించలేదు." - అన్నాడు. ఆహా! ఎంత గొప్ప 'భర్త'! అవునూ భర్త అనవచ్చా? ఎస్. నిరభ్యంతరంగా అనొచ్చు.

పెళ్ళికి కావాల్సింది పసుపు కలిపిన బియ్యం, పసుపు తాడూ కాదు. అదంతా సాంప్రదాయ ప్రకటన. సంతోష సంబరం. పెళ్ళంటే రెండు మనసుల ముడి.

పెళ్ళంటే ధైర్యంగా కలిసి హాయిగా, ఆదర్శంగా బ్రతకటం, అదే వాళ్ళు చేసి చూపించారు.

నేను మీరా వేపు చూస్తూ - 'ఎన్నో నెల?" - అని అడిగాను.

"మూడు." - అంది. ఆ ముఖంలో రిలీఫ్. బహుశా నేనేమి గొడవ చేయనందుకేమో! అయినా గొడవ చేయటానికి ఏముందని? ఆ... ఒక్కటి. ఒకే ఒక్కటి. అది -

అతను కట్టిన మంగళ సూత్రాలు. నేను నా మెడలో మంగళ సూత్రాల తాడు (బంగారందే) తీసి మీరా చేతిలో పెట్టాను. నవ్వుతూ చెప్పాను. ఇది ఇంతకాలం నా మెడను పాములా చుట్టుకుంది. శంఖంలో పోస్తేనే తీర్ధం అయినట్లు, ఈ పాము నీ చేతికి వచ్చిన వెంటనే తప్పక మంగళ సూత్రమో, ప్రేమ బంధముగానో మారుతుందని నాకు తెలుసు. అందుకే ఇది నీకిచ్చేస్తున్నాను." - అని, చక్రవర్తి వేపు తిరిగి ప్రేమలేని చోట కలిసి ఉండటం నరకం. ఇప్పుడు నాకు హాయిగా ఉంది. మీరా జాగ్రత్త. వస్తాం." అని - "వెళదామా" అన్నాను సాయిరాం వేపు చూస్తూ.

సాయిరాం బుద్ధునిలా, సాయిబాబాలా కనిపించాడు నాకు క్షణకాలం. అతని చేతిలో ఉన్న నా సూట్ కేస్‌లో బుద్ధప్రతిమ ఉంది. మేమిద్దరం ఆంటీ వాళ్ళ ఇంటికి వెళ్ళాము.

ముగ్గురూ నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు.

నా మనసు కూడా నిశ్శబ్దంగానే ఉంది.

బహుశా హాలాహలం బయటకు తీయబడిన తర్వాత సముద్రుడు కూడా నాలానే ఉండి ఉంటాడు శాంతించి ప్రశాంతంగా.

## ఆఖరి భాగం

**నీకోసం...!!!**

నేస్తం!!!
ఏకాంతపు యామినిలో
బందీవని దిగులు చెందకు
స్నేహదీపాలు వెలిగిస్తా నీకోసం.
ఎడారి ఒంటరి పయనంలో
అలసి, ఆగిపోకు నేస్తం...
మమతా సుమాలు వర్షిస్తా నీకోసం...

**"కిరణ్‌ప్రభ"**

'గతం గతః' అంటారనుకుంటాను కదూ ఆంటీ, ఆ ఇంటి గుమ్మం దాటిన వెంటనే జాహ్నవి గతానికి ఇనుప తెరపడిపోయింది. ఇప్పుడు ఈ జాహ్నవి వేరు. ఈమె మన స్నేహితురాలు. ఆత్మీ యురాలు. ప్రాణసమానం మనందరికి చూస్తూ ఉండండి ఈ జాహ్నవిని ఎంత ఎత్తుకు ఎదిగేలా చేస్తానో." సాయిరాం ఆవేశంగా... మరికాస్త ఉద్రిక్త స్వరంతో అన్నాడు. అతనిని చూస్తుంటే అతను లోలోన చాలా చాలా ఆవేశిస్తున్నాడని, వేదన చెందుతున్నాడని అర్థమయింది.

"కూల్...కూల్ సాయి" - వివేక్ అన్నాడు, అని.. నా వేపు తిరిగి, " మీ పని అయిపోయింది. వీడేదైనా అనుకుంటే, అది సాధించే వరకూ నిద్రపోడు. నిద్రపోనివ్వడు." - అన్నాడు.

" పర్వాలేదు. నాకు మరీ మంచిది. నాకూ పంతం, పట్టుదల ఎక్కువే ఇది నాకు మంచిదే" - అన్నాను.

తర్వాత కొద్దిసేపు కూర్చుని, వివేక్, సాయిరాం, నేను లేచాం వెళ్ళటానికై.

వెళుతూ.. వెళుతూ ఎదురింటి వేపు చూసాను. తలుపులు వేసేసి ఉన్నాయి.

'నడుస్తూ ఉంటే మార్గమేర్పడుతుంది.

దాని ఉనికిని బట్టి ఒక దాని పేరు రూఢీ అవుతుంది' - సాయిరాం తోడుగా నడుస్తుంటే నాకూ అలానే అనిపించింది.

ప్రభుత్వం వారిచ్చిన చిన్న బంగ్లా.

పెద్దగేటు. గేటు ప్రక్కన గోడకు నేమ్ ప్లేట్.

ఎస్.సాయిరాం I.A.S

అసిస్టెంటు కలెక్టరు - ఆని ఒక వైపు, మరో వైపు, 'అసిస్టెంటు కలెక్టరు గారి బంగ్లా.' - అని ఉంది.

కారు హారను వింటూనే లోపలి నుండీ ఒకతను పరుగెత్తుకుంటూ వచ్చి, గేటు బార్లా తెరిచాడు. ఆ తెరుచుకునే విధం నాకు మనస్పూర్తిగా స్వాగతిస్తున్నట్లు అనిపించింది. మనసు పులకరించింది. విశాలమైన ఆవరణ. పద్దతిగా మొక్కలు. పూలవనంలోకి ప్రవేశం. ఎంత బావుంది ఇక్కడ అనిపిస్తోంది.

సాయిరాం నేను కూర్చున్న వేపు డోరు తనే తెరిచి, 'స్వాగతం జాహ్నవీ' - అన్నాడు.

'థేంక్స్' అన్నట్లుగా చూసి, దిగాను.

మరో జీవితం ... ఊహ కాదు జీవితం తాలూకూ మరొక పార్శ్వం అనుభవంకై ప్రవేశం.

సాయిరాం నన్ను లోపలికి తీసుకు వెళ్ళి, లలితమ్మగారి గదికి తీసుకు వెళ్ళాడు.

ఆవిడ టీ.వీ ముందు సోఫాలో కూర్చున్నారు. చూపులైతే టీ.వీ స్క్రీన్ మీద ఉన్నాయి కానీ, తెరమీద జరిగేది ఆవిడ గ్రహించటం లేదని తెలుస్తోంది.

ఆవిడ ప్రక్కనే క్రింద కూర్చుని నోరంతా తెరచుకుని తెరమీద ప్రసారాన్ని పూర్తిగా వినోదిస్తున్న ఆమె పనిమనిషి అనుకుంటా. సాయిరాంని, వివేక్‌ని, నన్నూ చూస్తూనే గబాల్న లేచి నిలబడింది.

"అమ్మ భోజనం చేసారా?" - సాయిరాం అడిగాడు.

"చేసేరండి." - అంది వినయంగా.

"సరే నువ్వెళ్ళు" - అన్నాడు.

మరోమారు నమస్కరించి, వినయంగా వంగి నడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయింది.

నిజం చెప్పాలంటే మీరాకిటువంటి మర్యాదలు చాలా ఇష్టం.

"అమ్మా! ఇదిగో జాహ్నవి. నీ కూతురు. మనతోనే ఉంటుంది" - నన్ను చూపిస్తూ సాయిరాం చెప్పాడు.

"ఆ" - అన్నారు అంతే. సాయిరాం చెప్పింది పూర్తిగా అర్ధమైనట్లులేదు. వివేక్, సాయిరాం నాకోసం ఒక గది ఏర్పాటు చేసారు. నన్ను అడిగి, అడిగి నా అవసరాలకు కావలసిన వన్నీ క్షణాల్లో అమర్చేసారు. వింతగా, తమాషాగా, అద్భుతంగా అనిపిస్తోంది నాకు.

వంటామెనూ, మిగిలిన పనివాళ్ళనూ, నైట్‌డ్యూటీ చేసేవాళ్ళను అందరినీ హాజరు పరచి - నన్ను వాళ్ళ చెల్లెలిగా పరిచయం చేసి, ఈ క్షణంనుండీ నేను చెప్పినట్లు వాళ్ళు పనిచేయాలని ఆర్డర్స్ జారీ చేసేసారు.

మరికొద్దిసేపు లలితమ్మగారి దగ్గర గడిపి, రేపు వస్తానంటూ వివేక్ వెళ్ళిపోయాడు.

నేను సాయిరాం ఇచ్చిన బుద్దుని ప్రతిమ బయటకు తీసి, నాగదిలో టేబుల్ మీద పెట్టుకున్నాను.

ఎందుకో ప్రశాంతంగా ఉంది. హాయిగా ఉంది. నిశ్చింతగా కూడా అనిపిస్తోంది.

సాయిరాం మదర్‌ని నేనూ అమ్మా అనే పిలుస్తున్నాను. అమ్మకి అన్ని పనులూ నేనే చేస్తున్నాను. పూలతోటలో తిప్పి వాకింగ్ చేయిస్తున్నాను. సుందర్, ఆంటీ, వివేక్ అందరూ రోజూ వస్తున్నారు. సాయిరాం నాకోసం చాలా బుక్స్ తెప్పించాడు. తనకి ఖాళీ ఉన్నప్పుడంతా నాకు పాఠాలు చెపుతున్నాడు. బాప్‌రే చాలా తెలివైనవాడు. ఒక్కసారి అతను పాఠం వివరిస్తే మరిక చదవనవసరం లేదు.

ఇంతటి ప్రత్యేక వ్యక్తిని మీరా కాదనుకుని పొరపాటు చేసింది.

ఒకరోజు ఆంటీ చెప్పారు. చక్రవర్తి, మీరా ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారట. ఎక్కడికో తెలియదట.

అప్పుడు గుర్తుకు వచ్చింది. బాప్‌రే! జగపతి బాబాయిగారికి ఈ జరిగిన మార్పులన్నీ వివరిస్తూ ఉత్తరం రాయాలని. ఆ వెంటనే గుర్తుకు వచ్చింది. ఇప్పుడు ఉత్తరం రాయక్కర్లేదు ఫోను ఉంది కాదా అని. నేను గబగబా నంబర్లు ప్రెస్ చేసి డైల్ చేసాను.

బాబాయే ఫోను లిఫ్ట్ చేసారు.

"ఎలా ఉన్నావు తల్లీ. ఇదేంటి ఫోను చేసావు. ఎక్కడినుండీ." - బాబాయ్‌లో భయం కనిపించింది.

"భయం లేదు బాబాయ్. నేను చాలా బావున్నాను. సాయిరాం, అమ్మా అంటే సాయిరాం గారి అమ్మగారు అన్నమాట. ముగ్గురం కలిసి ఉంటున్నాం."

"అదేవిటి తల్లీ. నీ ఇల్లు.... చక్రవర్తి..."

"అన్ని చెపుతాను. మీరు ఇక్కడకు రండి. కంగారు పడేదేంలేదు అంటూ మా ఇంటి అడ్రస్ చెప్పాను.

మర్నాటి ఉదయానికి బాబాయ్ వచ్చారు. సాయిరాం ఇంట్లోనే ఉన్నారు. జరిగినదంతా విని తట్టుకోలేక, సాయిరాం రెండు చేతులూ పట్టుకుని, చిన్నపిల్లాడిలా ఏడ్చేసారు. "నా తల్లికి అన్యాయం జరిగిపోయింది బాబూ" - అంటూ.

"ఏమైంది బాబాయ్ నాకు. అసలు ఇప్పుడే నేను హాయిగా ఉన్నాను తెలుసా? నన్ను నన్నుగా ప్రేమించే మనుషుల మధ్య నేను విహరిస్తున్నాను తెలుసా?" - అన్నాను.

"నీ వివాహ జీవితం ఇలా అయిపోయినందుకు నీకు బాధగా లేదా తల్లీ?"

"బాధెందుకు బాబాయ్. మంచి భర్తా, మంచి జీవితం కావాలని అందరూ కోరుకుంటారు నిజమే. కానీ ఎంతమందికి దొరుకుతుంది చెప్పు. మనసులో ఇష్టం లేకపోయినా సమాజం కోసం నటిస్తూ బ్రతకటం, లోపల ఒంటరిగా మగ్గిపోవటం నాకిష్టం లేదు బాబాయ్. దేవుడిచ్చిన ఈ చిన్ని జీవితం, స్వచ్ఛంగా, నిర్మలంగా, అద్భుతంగా మలచుకోవాలి బాబాయ్." - అన్నాను.

బాబాయ్‌గారికి నా మాటలు నచ్చినట్లు లేదు.

"మీరా, చక్రవర్తి ఎక్కడున్నారు?"

"తెలియదు బాబాయ్."

"మీ నాన్నా వాళ్ళకి తెలుసా?"

"వాళ్ళు ఇక్కడ లేరంట. ఎబ్రాడ్ వెళ్ళారంట కదా?"

"అదా విషయం. సరే అమ్మా ముందు... ముందు నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్?"

నేను సాయిరాం వేపు చూసి నవ్వాను. నేను ఏం కావాలో అది సాయిరాం నిర్ణయించేసాడు. ప్రస్తుతం నేను అతని చేతిలో చెక్కను. అతను శిల్పి.

"ఏమైనా నువ్విలా రావటం బావుండలేదమ్మా. చూసే వాళ్ళంతా ఏమనుకుంటారు? అలా జరిగినప్పుడు నువ్వు మా దగ్గరకు వచ్చేసి ఉంటే బావుణ్ణు."

బాబాయిగారు సగం నిష్టూరంగా అన్నారు.

బాబాయ్‌గారు అలా మాట్లాడుతుంటే ఆశ్చర్యం అనిపించింది. అంత మంచి మనసున్న... అనుకున్న బాబాయే ఏమిటి ఇలా? అవునుకదా. బాబాయ్ కూడా సగటు మనిషే. సమాజానికి భయపడే మనిషే అన్నమాట.

"తప్పేం ఉంది బాబాయ్. మంచివాళ్ళ మధ్య ఉంటున్నాను. భవిష్యత్తును నిర్మించుకుంటున్నాను. అదీకాక అమ్మ నేను వచ్చిన తర్వాత తొందరగా కోలుకుంటున్నారు. ఇది మంచి విషయమే కదా?" అన్నాను.

"అవుననుకో. అయినా సమాజానికి భయపడాలి, గౌరవించాలి. అప్పుడే కదమ్మా మనకు మర్యాదా, గౌరవము వచ్చేది." - అన్నారు.

నేనేం మాట్లాడలేదు. సమాజము సంగతేమో గానీ, బాబాయిగారికి నాపట్ల అప్పుడే ప్రేమ తగ్గటం మొదలైందని అర్థమైంది.

"నీకు ఒక పుట్టింటి తలుపులు మూసివేసినపుడే.. మరో పుట్టింటి తలుపులు తెరచుకుని, అవి ఆహ్వానిస్తున్నాయి అని నా ఇంటి తలుపులు -" అన్న బాబాయిగారేనా ఈయన?!

బహుశా తలుపులు తెరిచిన తనింటికి రాకుండా మరో పుట్టింటిలో ప్రవేశించినందుకు అలక వహించి తన ఇంటి తలుపులు మూసివేస్తున్నారు అనిపించింది.

ఏం చేయగలను నేను?

మనుషులకు ఎదుటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు గొప్పగా ఓదార్చాలనీ, అదే మనిషి కష్టానికి ధైర్యంగా ఎదురొడ్డి నిలబడితే హేళన చేసి వెలివేయాలని అనిపిస్తుందనుకుంటా.

ఏది ఏమైనా బాబయిగారు అసంతృప్తిగా వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిన మరో రెండు రోజులకు మాలతీ సుధాకర్ వచ్చారు. మాలతి తన తమ్ముడు చక్రవర్తి అలా చేస్తాడని తాము ఊహించలేదంది. "మీరా మంచి అమ్మాయి కాదు గర్వం ఎక్కువ. అమ్మని కొడుకు దగ్గరకు రానివ్వదు" అంటూ బాధపడింది.

ఇంతకూ మాలతి దేనికి నిజంగా బాధపడుతుందో అర్థంకాలేదు తల్లి బాధ్యత పూర్తిగా తనమీద పడుతుందేమోనని భయమా?

సుధాకర్ మాత్రం సాయిరాంని చాలా చాలా ప్రశంసించాడు. "జాహ్నవిగారిని ఎప్పుడు తలచుకున్నా బాధనిపించేది. అందరం కలిసి ఆమెకు అన్యాయం చేసినట్లుగా ఉండేది. ఇకపై ఆమెకు మంచి భవిష్యత్తు మీరు ఇస్తారని నాకు నమ్మకంగా ఉంది. అందుకోసం మీకు పదే పదే కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను." - అన్నాడు.

"మీ అమ్మగారికీ విషయం తెలుసా మాలతీ" - అని అడిగాను.

"ఆ... నేనే చెప్పాను." - అంది.

"ఏమన్నారు?" - కుతూహలం నాలో.

"ఏమంటుంది? 'అడ్డాలనాడు బిడ్డలు గానీ గెడ్డాలు వచ్చాక కాదు. వాడికి నేనేం చెప్పగలను అంది."

అవును పాపం. మాలతి ఇంటి సమస్య సాల్వ్ చేస్తానని తల్లికి మాట ఇచ్చి ఉంటాడు మరి.

"బేరమాడే బతుకు ఎంత దయనీయం!

వస్తువులమ్మే మార్కెట్ బతుకు ఎంత హీనమైంది!"

మాలతీ, సుధాకర్ కూడా వెళ్ళిపోయారు.

ఒకరోజుసాయంత్రం తోటలో తిరుగుతుంటే సాయిరాం సడన్‌గా అడిగాడు.

"ఒక్క నిజం చెపుతావా జాహ్నవీ?"

"ఊ"

"మీ అమ్మా, నాన్నా, అమ్మమ్మ, చెల్లెలు, అత్తయ్య, మామయ్యలు, జగపతి బాబాయ్, కాంతమ్మగారు, చక్రవర్తి, మాలతి, సుధాకర్, తమిళ్ ఆంటీ, సుందర్, వివేక్, అమ్మా, నేనూ ఇందరం నీ జీవితంలో ఉన్నాం. మా అందరిలోకి ఎవరంటే నీకు ఎక్కువ ప్రేమ? నిజం చెప్పు."

నేను క్షణం కూడా ఆలోచించకుండా గబాల్న చెప్పేసాను.

"మీరా."

"నేను అనుకున్నాను. అయితే ఎందుకో తెలుసుకోవచ్చా?"

"అది అమాయకురాలు. మంటను చూసి వెలుగు అనుకుంది. చిన్ననాటినుండీ తనా పొరపాటు చేస్తోంది. సరిదిద్దవలసిన పేరెంట్సే అందుకు కారణమయ్యారు.

తనకంటే పెద్దదాన్ని కదా... అక్కలా నా బాధ్యత నెరవేర్చుదామనుకున్నా నాకా అవకాశం ఇవ్వకుండా, నన్నంతా దూరం పెట్టేసారు. సాయిరాం... ఆకర్షణ వేరు. ప్రేమ వేరు

ఆకర్షణ యవ్వనాన్ని దహిస్తుంది

ప్రేమ జీవితాన్ని వెలిగిస్తుంది!

కాస్త ఓర్పు వహించి వేచి ఉండు నేను చెప్పింది నిజమని నువ్వూ అంటావు" - అన్నాను.

"శపిస్తున్నావా? కోరుకుంటున్నావా జాహ్నవీ?"

"ఛ..ఛ అలా ఎప్పుడూ ఆలోచించకు. ఏది జరగబోతుందో అదే చెపుతున్నాను నేను." - అన్నాను.

ఒకరోజు సుధాకర్ ఫోన్ చేసాడు.

అమ్మా నాన్నగారూ వచ్చేరంట. విషయం తెలిసిన అమ్మ నిద్రమాత్రలు మింగేసిందట. సమయానికి అమ్మమ్మ చూసి, అమ్మని హాస్పటల్‌లో జాయిన్ చేసారంట. ఇప్పుడు అమ్మ క్షేమంగానే ఉంది కానీ ఇంట్లో అంతా చాలా డల్ అయిపోయారంట.

"మీరా వెళ్ళిందా?" - అడిగాను.

"లేనట్లుంది." అన్నాడు.

"నాకు వెళ్ళి చూడాలని ఉంది" - అన్నాను.

"వద్దు జాహ్నవీ. మీ పేరెంట్స్‌కి పట్టుదల ఎక్కువ అనుకుంటాను. మీ బంధువులు మీ ప్రస్తావన తీసుకురాబోతే -

వద్దు. మాకు పిల్లలే లేరు. దయచేసి మమ్మల్నిలా బ్రతకనివ్వండి. అంటున్నారంట." - అన్నాడు.

నిజమే. అమ్మా, నాన్నలకు చివరకు అమ్మకు కూడా పంతం పట్టింపులూ చాలా ఎక్కువ. వాళ్ళ దారిలో అంతా నడవాలంటారు కానీ, వాళ్ళు మాత్రం పరిస్థితులకు అనుకూలంగా మారరు. సాయిరాం ఆఫీసు నుండీ వచ్చిన తర్వాత విషయమంతా చెప్పాను. విని బాధపడటం తప్ప తను మాత్రం ఏం చేయగలడు.

లలితమ్మ దగ్గర మాత్రం ఇటువంటి సీరియస్ విషయాలు మాట్లాడరు. అది డాక్టర్ సలహా. అమ్మ పర్వాలేదు తొందరగానే కోలుకుంటున్నారు. అంతా నా ఆప్యాయతా మహత్యమే అంటాడు సాయిరాం. ఏం కాదు నీ తల్లిప్రేమ అంటాను నేను.

ఇలానే ఒకరోజు వాదించుకుంటుంటే, గబగబా లేచి తెల్లటి పేపరూ స్కెచ్ పెన్ వెదికి, వెదికి తెచ్చుకున్నాడు చిన్నపిల్లాడిలా. నాకు దూరంగా కూర్చుని, ఏదో గీతలులాంటివి గీసి, నా దగ్గరకు వచ్చి -

"జాహ్నవీ చూడు" అంటూ ఆ పేపరు, మరోదానిపైన తనపేరు రాసుకున్నాడు.

రైలు టాప్ మీద జాహ్నవి జీవితం+ సాయిరాం జీవితం = ఒక్కటైన ఈ రైలుబండి", - అనిరాసి ఉంది.

ఒక్కొక్క భోగీ మీద వివేక్, వినూత్న, తమిళ్ ఆంటీ, సుందర్, లలితమ్మ పేర్లు రాసి ఉన్నాయి. అర్థం కాక "ఏవిటిది?" - అని అడిగాను.

"అర్థం కాలేదా?"

"ఊహూ"

" నీ జీవితం ప్లస్ నా జీవితం కలిసి ఒకే ఒక జీవన రైలు అవుతుంది మిత్రమా. ఈ పట్టాలు మనిద్దరం. మన జీవన రైలు తాలూకూ బోగిలే వీళ్ళంతా. అంటే జీవితాంతం వరకూ మనం మంచి స్నేహితుల్లా కలిసి ఉంటున్నాం. ఉంటాం అని అర్థం తెలిసిందా?" - అన్నాడు

"నీతో జీవితాంతం నేనెందుకుంటాను? నువ్వు పెళ్ళి చేసుకుంటావు. నీభార్యా, నీ పిల్లలూ...

"స్టాప్..స్టాప్.అలాంటి ఆలోచన చేయకు." అన్నాడు.

"ఏం?

"ఒక్కటి మనస్పూర్తిగా చెప్పు జాహ్నవీ. నువ్వు మరల పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నావా?"

"ఛా...లేదే"

"ఏం?ఎందుకని?"

"వివాహం మీద నమ్మకం పోయింది. ఆ పవిత్రమైన కోరికలూ, భావాలూ చెదిరిపోయాయి." - అన్నాను.

"నాకూ అంతే మరి. మన ఇద్దరి ఆలోచనలూ ఒక్కటే అయినప్పుడు మనిద్దరి జీవితం ఒక్కలానే ఉంటుంది కదా?" అన్నాడు

"అవును." - బుద్దిగా అంగీకరించాను.

సాయిరాం అన్ని విషయాల్లోనూ చాలా మెత్తగా మృదువుగా ప్రవర్తిస్తాడు. ఒక్క చదువు విషయంలో మాత్రం కఠినాతి కఠినంగా ప్రవర్తిస్తాడు.

"నువ్వూ.. నేనూ ఈ I.A.S అనే లేబుల్ మూలంగా మన జీవితాల్లో ఒక భాగాన్ని పోగొట్టుకున్నాం. అయినా ఈ లేబుల్‌కి చాలా పవరుంది. ఈ పవర్ మూలంగా మనం ఎందరో నిర్భాగ్యులకు నీడను కలిపించవచ్చు. అందుకే నీ ఈ విషయంలో నేను ఇంత స్ట్రిక్ట్‌గాఉన్నాను" - అంటాడు. "మరీ ఇంత కఠినతా." అంటే "తప్పదు తల్లీ." - అంటాడు.

నేను చదువుతుంటే తనే స్వయంగా టీ తయారు చేసి తీసుకు వచ్చి ఇచ్చేవాడు.

నేను అలిసినట్లు కనిపిస్తే ఏ రాత్రివేళయినా సరే, కార్లో బయటకు తీసుకు వెళ్ళేవాడు. ఆ నిశ్శబ్ద రాత్రివేళ పాత హిందీ, తెలుగు పాటలు వింటూ, అలా అలా ప్రయాణించడం అబ్బ! ఎంత హాయి. కొత్త ఉత్సాహం నాలో ప్రవేశించేది. బాగా ప్రిపేర్ అవ్వాలి. ఫస్ట్ అటెంప్ట్‌లోనే నేను I.A.S రేంకులో సాధించాలి' - అనుకునేదాన్ని చాలాగట్టిగా.

తను ఎలా ప్రిపేర్ అయిందీ వివరించేవాడు. నోట్స్ ప్రిపేర్ చేసి ఇచ్చేవాడు.

"బాగా చదవాలి జాహ్నవీ. నీకేం కావాలన్నా నేను ఎరేంజ్ చేస్తాను అనేవాడు. 'ఒక మంచి పని మరో మంచి పనికి కారణం కావటం అపురూపమయిన, అద్భుతమయిన విషయం.' మా పట్ల ఇది నిజం.

ఆరు సంవత్సరాల కాలం ఎలా గడిచిపోయిది! నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. నన్ను వరించినది తక్కువేమీ కాదు.ఏది నేను కావాలని సాయిరాం తపించాడో, ఆ తపస్వి ఆశయం నేను నెరవేర్చ గలిగాను.

'ఈవేళ... మబ్బు పట్టిన ఈ ఆకాశంఈదురు గాలులతో చెలగాటమాడుతున్న ఈ చెట్లు, ఎగిరే చిన్ని.. చిన్ని పిట్టలు ఎంత బావుంది వాతావరణం' - అనుకుంటూ లివింగ్ రూం కిటికీ దగ్గర నిలబడి బయట తోటలోకి చూస్తూ నిలబడ్డాను.

అమ్మ పూర్తిగా కోలుకున్నారు. నా దగ్గరే ఉంటున్నారు. సాయిరాం ఇప్పుడు డిస్ట్రిక్ కలెక్టరుగా ప్రమోట్ అయి, వేరే జిల్లాలో ఉంటున్నాడు. ఈ మధ్యలో రెండు మూడు ఊర్లు మారాడు. వెంట అమ్మా - నేనూ ఉన్నాం. కానీ ఇప్పుడు వీలు పడదు.

ఆరున్నర సంవత్సరకాలం క్రితం ఒకరాత్రివేళ ఈ బంగ్లా గేటు బయటకారు దిగి, గేటు ప్రక్కన గోడపై సాయిరాం I.A.S అసిస్టెంటు కలెక్టరు అని ఒక వేపు, మరొకప్రక్క అసిస్టెంటు కలెక్టరు గారి బంగ్లా' - అనే నేమ్‌ప్లేటు చూసాను. ఈరోజు ఆ మరో ప్రక్క 'అసిస్టెంటు కలెక్టరుగారి బంగ్లా' అనే నేమ్ బోర్డు మారింది. పట్టుదలతో ఏదైనా సాధించ వచ్చు.

అమ్మనీ... నాన్నగారిని చూడాలని అనిపిస్తుంది అప్పుడప్పుడూ గాఢంగా. అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి, భుజాలపై చేతులు వేసి, అమ్మమ్మ కళ్ళలోకి తృప్తిగా చూస్తూ, "చూసావా నీ మనవరాలు ఎంత గొప్పదయిందో" అనాలనిపిస్తుంది.

కానీ నాకు తెలుసు. అమ్మమ్మకి నిజమైన అదృష్టం, పెళ్ళి చేసుకుని పిల్లల్ని కని, వంటింట్లో మగ్గిపోవటం లోనే ఉందనుకుంటుంది.

పాతకాలపు భావనల నుండీ బయటపడలేదు అయినా తన మనసు నాకు తెలుసు. నన్ను చూడాలనీ, నాదగ్గరకు రావాలని ఆమె మనసులో బలంగా ఉన్నా అణుచుకుంటుంది. ఎందుకంటే, తన కొడుకులూ, కోడళ్ళూ తనని బాధపెడుతున్న సమయంలో అమ్మే కదా అమ్మమ్మను దగ్గరకు తీసుకున్నది. అది ఎలా మరచిపోతుంది.

తమని ఆదరించిన వారిని బాధపెట్టక పోవటం కూడా పాతకాలపు పద్ధతే కదా! మరి అమ్మా - నాన్నా??

రావాలనే ఉంటుంది. రావాలీ... చూడాలీ ఈ హోదాను అనుభవించాలనే ఉంటుంది మనసున. కానీ రాలేరు. ఒకవేపు అహం అడ్డుపడుతుంది. మరోవేపు 'చూసారా నన్ను ద్వేషించారు. కానీ ఆ నేనే మీరా కన్నా ఎంతో... ఎంతో ఎత్తుకు ఎదిగాను. మీరు నా నుండి అన్నీ తీసి మీరా అడిగిన వెంటనే దానికి ఇచ్చేసేవారు - కానీ ఈ నా కలక్టరు పోస్ట్ ఇవ్వలేరు" - అంటానేమో లేదు ఆ భావన కనిపించేలా ప్రవర్తిస్తానేమో అని భయం. ఎంతయినా ఆత్మాభిమానంగల తల్లితండ్రులు కదా!

అయినా నాకు తెలుసు.

ఈ మనసులూ, అభిమానాలూ, స్వార్థాలనూ అన్నింటినీ జయించి తన అదుపులోకి తీసుకునే శక్తి ఆ కాలానికి ఉంది. ఆకాలం ముందు అన్నీ తలవంచవలసిందే ఆకాలం నన్ను కరుణిస్తుందన్న నమ్మకం నాకుఉంది. ఎందుకంటే -

నేనెప్పుడూ కాలానికి ఎదురు తిరగలేదు. నా జీవితంలో జరిగిన ప్రతి దురదృష్ట సంఘటననూ తలవంచి అనుభవించాను. కాలానికి ఆ విషయం తెలుసు. అందుకే నన్ను దీవిస్తుంది. అందరినీ కలుపుతుంది. నేను చేయాల్సింది ఒక్కటే ఆ రోజు కోసం ఓర్పుగా ఎదురు చూడ్డం. అదే నేను చేస్తున్నాను.

బయట వాతావరణం కూడా ఆహ్లాదంగా ఉంది. మనసూ ప్రశాంతంగా ఉంది.

అంతలో వెనుక సవ్వడి. తిరిగి చూస్తే - మీరా!!!! ప్రక్కనే ఆరేళ్ళ అందమైన పాప. సందేహం లేదు. మీరా కూతురే. మీరా అలానే ఉంది. కానయితే ఆ అందం నలిగినట్లుంది. మనిషిలో ఆనాటి నిర్లక్ష్యం, పొగరుబోతుతనంలేదు. శివుని జటాఝూటంతో అణచబడిన సోయగంలా ఉంది.

"నువ్వా మీరా!!" ఎంతెంతో ఆశ్చర్యంగా అడిగాను. వెంటనే "నువ్వేంటీ ఇలా...", అని కూడా అన్నాను. ఒక షాక్ నాలో.

"ఏం రాకూడదా నేను? లేక కలెక్టరు జాహ్నవిగారింటికి రావాలంటే ముందుగా ఫోను చేసి అపాయింట్‌మెంట్ తీసుకోవాలా?" - అంది. ఆమాటలలో పొగరూ, అసూయలు లేవు.

"ఛ..ఛ అదేంటి రా..రా" - అంటూ దగ్గరగా వెళ్ళి, పాప నీకూతురు కదూ?" అన్నాను.

"పేరేంటి తల్లీ" - పాపని దగ్గరగా తీసుకుంటూ అడిగాను.

"ప్రేమిక" - అని చెప్పింది ముద్దుగా.

"చాలా బావుంది పేరు."

కావాలనే పెట్టాను.

మొహం ఎత్తి మీరా వేపు చూసాను.

నవ్వింది సోదరిలా.

"ఎందుకొచ్చానో తెలుసా?"

"తర్వాత చెప్పవచ్చు. రాముందు కాఫీఊ తాగుదువు" - అన్నాను.

"లేదు ముందుగా చెప్పనివ్వు."

"అలా అయితే ముందుగా నా ప్రశ్నకు జవాబు చెప్పు. నువ్వూ, చక్రవర్తీ బావున్నారా?" - భయంగా... ఆత్రుతగా అడిగాను.

"భయపడనవసరం లేదు. మేం బాగున్నాం." - అంది నవ్వుతూ.

"థేంక్‌గాడ్! ఇహ ఏదైనా చెప్పు. వింటానికి నేను రడీ." - అన్నాను.

"మా పాపను నీకెచ్చేసి వెళ్ళాలని వచ్చాను." - అంది.

"అదేమిటి?!"

"నాకు నా కూతురు నా కంటే దర్జాగా.. గౌరవంగా పెరగాలని నా కోరిక. అందుకే నీ దగ్గర పెడుతున్నాను."

"మరి నువ్వు?"

అప్పుడప్పుడూ వచ్చి చూసి వెళతాను

"అసలు పాపకిష్టమేనా?"

"అడుగు"

"ఏం ప్రేమా! నీకీ పెద్దమ్మ దగ్గర ఉండడం ఇష్టమా?"

"ఓ చాలా ఇష్టం. అమ్మ చెప్పింది ఇక్కడ పెద్ద ఇల్లూ, కారూ, నౌకర్లూ అంతా ఉంటారు. చాలా బావుంటుందట కదా!"

అంతలో సాయిరాం వచ్చాడు. అనుకోలేదు. మమ్మల్ని చూడాలనిపించినపుడు ఇలానే సడన్‌గా వచ్చేస్తాడు. వస్తూనే మీరాను చూస్తూ, "బావున్నారా?" - అన్నాడు.

"బావున్నాను." - అంది.

"మీరా కూతురు, 'ప్రేమిక' పేరు బావుంది కదా?"

"బావుంది"

"ఏం ప్రేమీ! ఈ అంకుల్‌కి ఇంకా పెద్ద ఇల్లూ, బోలెడు కార్లూ, అంకుల్‌తో వెళతావా?" - సరదాగా అడిగాను.

అది ఒక క్షణం సాయిరాంని చూసి - "అంకుల్ ఇల్లు చూడలేదు కదా? నచ్చితే ఉంటా." - అంది.

"మైగాడ్! మీరా దీనికన్నీ నీ పోలికలు వచ్చినట్లున్నాయి." - అన్నాను.

"ఆ భయంతోనే కదా నీ దగ్గర పెడుతోంది." అంది నిస్సంకోచంగా.

ఏమంటాను నేను.

(ఐపోయింది)

*"ఫీలింగ్ లేకుండా ఉండటమంటే మనిషి లక్షణం లేకపోవటమే. అనుభూతిలో పడి కొట్టుకుపోవడం తెలివితక్కువ తనం. కోరిక లేకపోవటం మరణంతో సమానం. కోరికకు బానిస కావడం అన్నీ కోల్పోవడమే.. మనం మార్చలేని దానిని అంగీకరించడం ద్వారా మార్చగలిగిన దానిని మార్చడం ద్వారా వాటి రెండిటికీ ఉన్న తేడాని అవగాహన చేసుకోవటం ద్వారా మన ఆవేశాత్మక జీవితాన్ని మన అదుపులో ఉంచుకోగలం!*

- తావీ

ఎడిటర్ గారికి -

" మీరు కౌముది కి సీరియల్ రాస్తున్నారు" అన్నారు. ఏమంటాను నేను!? మీ స్నేహ మాధుర్యానికి ఎలా ఎదురు చెప్పగలను? అందుకే.. ఎప్పుడో నేను మరిచిపోయిన నాలోని రచయిత్రిని తిరిగి బ్రతికించుకున్నాను (కున్నానా?). ఏమో.. ఐతే ఈ నవల రాస్తున్న ప్రతిక్షణం నన్ను నేను ప్రశ్నించుకుంటూనే ఉన్నాను.

ఈ నవల ఎవరికోసం రాస్తున్నాను? ఎవరి ప్రేరణతో రాస్తున్నాను? అని.

స్నేహమంటే ప్రాణం నాకు..

స్నేహాన్ని యిచ్చేవారంటే ప్రేమ నాకు. అందుకే మీరు అడిగినందుకైనా వ్రాయాలనుకున్నాను. ఐతే నవలంటే మీకూ నాకూ మధ్య మాత్రమే ఉండిపోదుకదా.. ఈ నవలని చదివి ఆమోదించాల్సిన పాఠకుల మాటేమిటి? వారిని నేను సంతృప్తిపరచగలనా అని భయపడ్డాను..కానీ..

సాయిబాబా(షిర్డీ) దయా, ఆశీస్సులతో, మీస్నేహానురాగం, మావారు రాజశేఖర్ గారు ఇచ్చే ప్రోత్సాహం నాకు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ప్రతినెలా మీరు ఫోన్ ద్వారా పాఠకుల అభిప్రాయాలను చెబుతున్నంత సేపూ నాకు కళ్ళలో నీటితెరలు కదలాడేవి. తిరిగి నన్ను రచయిత్రిగా బ్రతికించిన మీకు కృతజ్ఞతలు లాంటి చిన్ని పదం సరిపోదు కదా! అందుకే మీకు ఏమీ చెప్పడం లేదు..

**ఇంక నా సీరియల్ ని ఆదరించిన పాఠకులకీ, పాఠకురాళ్ళకీ..**

నా సీరియల్ చదివి నన్నూ, లేదూ నా సీరియల్ని అభిమానించిన మీరంతా నాకు తెలియకపోవచ్చు. మిమ్మల్ని నేను చూడలేకపోవచ్చు. కానీ ఎడిటర్ గారు మీ అందరి అభిప్రాయాలూ ఎప్పటికప్పుడు తెలియచేస్తుంటే ఒక వైపుతృప్తీ, మరొకవైపు అంత దుర్మార్గురాలినా నేను!? అంత కఠినంగా వ్రాస్తున్నానా అనిపించేది...ఏం చెప్పనూ..!?

నేను చూశాను నిజంగా..చిన్ననాటి నుండీ..నాన్న గారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వున్నప్పుడు (జస్టిస్ పి.ఎల్.ఎన్.రెడ్డి, రిటైర్డ్) ఎన్నో కేసులు విన్నాను. చూశాను..తర్వాత జడ్జిగా ఆయన పనిచేసినప్పుడూ ఇంతకంటే ఘోరమైన బాధల గాథలు విన్నాను. అవన్నీ నా మనసుకి హత్తుకుపోయాయి.. అలా అనుభవాలను ఈ నవలద్వారా మీకు పంచేసి మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమించండి..

ఒక్కటి మాత్రం నిజం..ఈ నవలని చదివిన వారినందరినీ నేను అభిమానిస్తున్నాను..ప్రేమిస్తున్నాను.ప్రేమ గొప్పది. నిజమైన అభిమానంలో కోరికా, స్వార్థం, నటన, కుటిలత్వం ఉండవు కదా.. అటువంటి ప్రేమను మీకందిస్తూ..మీ నుండి ఆశిస్తూ.. ప్రస్తుతానికి మీనుంచీ శెలవు తీసుకుంటూ..మరోసారి నా నవలపట్ల మీరు చూపించిన ఆదరణకి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

ఇక అసలు ముఖ్య విషయం..

ఈ నవల నాచే బలవంతంగా వ్రాయించిన, వ్రాయించుకున్న నా స్నేహితురాలు శ్రీమతి కాంతికి ఈ నవలను ప్రేమతో అంకితమిస్తున్నాను.

**ప్రేమతో..**

**మీ హేమ**